

'ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 13 సంచిక: 239

శుక్రవారం 20-11-2020




**రికార్డుల ర్యాలీకి బ్రేక్**

44వేల దిగువన ముగిసిన సెన్సెక్స్

167 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ -బిజినెస్‌లో



**సూపర్ ఫుట్‌బాల్**

నేటి నుంచి ఇండియన్ లీగ్ ఏడో సీజన్

మ్యాచ్‌లన్నీ గోవాలోనే.. - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

• బాధ్యతలు చేపట్టిన కాసేపటికే..

## మంత్రి పదవికి రాజీనామా



బాధ్యతలు చేపట్టిన కొద్ది గంటల్లోనే బిహార్ విద్యా శాఖ మంత్రి, జేడీయూ నేత మేవా లాల్ చౌధరి గురువారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ.. ఆయనకు మంత్రి పదవి ఇచ్చారన్న విమర్శలు వెల్లువెత్తడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. చౌధరి రాజీనామాను గవర్నర్ ఆమోదించారు.

- వివరాలు 7లో

• కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

## భారీ ఉగ్ర కుట్ర భగ్నం



కశ్మీర్‌లో భారీస్థాయి దాడులు జరిపి, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు అవరోధం కలిగించడమే లక్ష్యంగా ఉగ్రవాదులు పన్నిన కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. జమ్మూ శివారులో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో జైషే మహ్మద్‌కు చెందిన నలుగురు ఉగ్రవాదులు హతం కాగా, ఇద్దరు పోలీసులు గాయపడ్డారు.

- వివరాలు 7లో

• పాకిస్తాన్ ఉగ్రవాద వ్యతిరేక కోర్టు తీర్పు

## ఉగ్ర సయీద్‌కు పదేళ్ల జైలు



ఉగ్రవాద సంస్థ జమాత్ ఉద్ దవా అధినేత హఫీజ్ సయీద్‌కు పాకిస్తాన్ ఉగ్రవాద వ్యతిరేక కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఉగ్ర దాడులకు ఆర్థిక సాయం అందజేశాడని పాకిస్తాన్ పోలీసులు సయీద్‌పై రెండు కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో అవి నిజమని తేలింది. కాగా, 2008లో ముంబైలో జరిగిన ఉగ్రదాడుల సూత్రధారి ఇతనే.

- వివరాలు 7లో

• ఆరోగ్య కార్యకర్తలు, వృద్ధులకు..

## టీకా తొలుత వారికే



మరో 3, 4 నెలల్లో కరోనా వ్యాక్సిన్ సిద్ధమవుతుందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాధాన్యతల వారీగా వ్యాక్సిన్ పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తొలుత ఆరోగ్య కార్యకర్తలకు, 65 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులకు కరోనా టీకా అందజేస్తామన్నారు.

- వివరాలు 7లో

# పాడి పండుగ

## వైఎస్సార్ ఆసరా, చేయూత మహిళలకు 26న పాడి పశువుల పంపిణీ

ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పంపిణీకి ప్రణాళిక

ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- తొలిదశలో ప్రకాశం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లోని 400 గ్రామాల్లో 7 వేల యూనిట్ల పంపిణీ
- దశలవారీగా కార్యక్రమం అమలు
- పోషకులకు పెట్టుబడి కచ్చితంగా గిట్టుబాటు కావాలని సీఎం వైఎస్ జగన్ స్పష్టీకరణ
- మేలు జాతి పాడి పశువుల ఎంపిక
- దాణా, వైద్యంపై శ్రద్ధ.. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు
- కొత్తగా లబ్ధి పొందిన 2.78 లక్షల మంది నుంచి కూడా ఆప్షన్లకు ఆదేశం
- మహిళా సాధికారత, సుస్థిర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పథకం అమలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల లబ్ధిదారులైన మహిళలకు నవంబర్ 26వ తేదీన పాడి పశువులను పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పంపిణీకి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. వర్చువల్ విధానంలో వచ్చే గురువారం రోజు తొలిదశలో ప్రకాశం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లోని 400 గ్రామాల్లో దాదాపు 7 వేల యూనిట్ల పాడి పశువుల పంపిణీని సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం దశలవారీగా పంపిణీ చేసేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. వైఎస్సార్ చేయూత,

మిగతా 2వ పేజీలో ▶

### ఆవులు, గేదెల కోసం అత్యధిక ఆప్షన్లు

ఆవులు, గేదెల పెంపకం కోసం 4.68 లక్షల మంది మహిళలు ఆప్షన్లు ఇవ్వగా గొర్రెలు, మేకల పోషణ కోసం 2.49 లక్షల మంది ఆప్షన్ ఇచ్చారు. ఒక్కో యూనిట్ ధర రూ.75 వేలు కాగా ప్రాజెక్టు విలువ రూ.5,386 కోట్లుగా నిర్ణయించారు. సుస్థిర జీవనోపాధి కోసం చేయూత, ఆసరా పథకాల లబ్ధిదారులైన మహిళలకు 2,11,780 ఆవుల యూనిట్లు, 2,57,211 గేదెల యూనిట్లు, 1,51,671 గొర్రెల యూనిట్లు, 97,480 మేకల యూనిట్ల పంపిణీకి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక యూనిట్‌లో 14 మేకపిల్లలు లేదా గొర్రెపిల్లలు, ఒక మేకపోతు లేదా గొర్రె పోతు పంపిణీ చేస్తారు. ఆవు లేదా గేదెలను చూడితో ఉన్నవి లేదా పాలిచ్చేవి అందచేస్తారు.

సీఎం వైఎస్ జగన్ పుష్కరాలు ప్రారంభించే కర్నూలులోని సంకల్ భాగ్ ఘాట్ వద్ద పూర్తయిన ఏర్పాట్లు



# తుంగభద్రకు పుష్కర శోభ

**నేటి నుంచి 12 రోజుల పాటు పుష్కరాలు**

ప్రత్యేక పూజలతో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

- నది ప్రవహించే కర్నూలు జిల్లాలో 23 ఘాట్లు
- కోవిడ్ నేపథ్యంలో జాగ్రత్తలతో పుష్కరాల నిర్వహణ
- ఘాట్లలో పుష్కరస్నానాలకు అనుమతి నిరాకరణ
- ఈ–టికెట్ ద్వారానే పిండప్రదానాలకు అనుమతి

సాక్షి ప్రతినిధి, కర్నూలు/కర్నూలు(సెంట్రల్)/సాక్షి, అమరావతి: పవిత్రమైన తుంగభద్ర పుష్కరాలు నేడు (శుక్రవారం) ఘనంగా ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 1.21 గంటలకు పుష్కరుడు నదిలో ప్రవేశిస్తాడని, అప్పటి నుంచి పుణ్యఘడియలు ప్రారంభమవుతాయని పండితులు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులోని సంకల్‌భాగ్ ఘాట్‌లో ప్రత్యేక పూజలతో పుష్కరాలను ప్రారంభించనున్నారు. కోవిడ్ నేపథ్యంలో ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నా, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆర్భాటాలు లేకుండా సంప్రదాయరీతిలో, శాస్త్రోక్తంగా నిర్వహించి పుష్కరాలను విజయవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12 ఏళ్లకోసారి వచ్చే పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక జాగ్రత్తలతో అన్ని ఏర్పాట్లు చేసింది. ఐదు వేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఘాట్ల వద్ద

మిగతా 2వ పేజీలో ▶

## యరపతినేని నివాసాల్లో సీబీఐ దాడులు

**అక్రమ మైనింగ్ కేసులో ఏపీ, తెలంగాణలోని 25 ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు**

టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని, అనుచరుల నివాసాల్లో సోదాలు

పలు కీలక పత్రాలు, మొబైల్ ఫోన్లు, సామగ్రి, నగదు స్వాధీనం

శాటిలైట్ చిత్రాలతో నష్టం అంచనా



సాక్షి, అమరావతి/దాచేపల్లి(గురజాల): టీడీపీ పాలనలో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన టీడీపీ నేత, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆయన అనుచరుల నివాసాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) గురువారం మెరుపు దాడులు చేసింది. తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు గుంటూరు జిల్లా గురజాల, పిడుగురాళ్ల, నడికుడి, నారాయణపురం, కేసానుపల్లి తదితర 25 ప్రాంతాల్లోని నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సీబీఐ సోదాలు జరిపింది. దీనికి సంబంధించిన వివరాలను సీబీఐ ఢిల్లీ ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. తాము జరిపిన సోదాల్లో అనేక ఆధారాలతో పాటు

మిగతా 2వ పేజీలో ▶

### అధికారం అండతో అక్రమ మైనింగ్

- టీడీపీ పాలనలో యరపతినేని ఇష్టారాజ్యం
- కేసానుపల్లి, కోనంకి, నడికుడి గ్రామాల్లో రూ.10వేల కోట్ల విలువైన తవ్వకాలు

2 లో

## కోవిడ్.. భయం భయం!

- చలికాలంలో విరుచుకుపడుతున్న మహమ్మారి
- ఢిల్లీలో ఒకేరోజు 131 మంది మృత్యువాత
- మాస్కు లేకుంటే దేశ రాజధానిలో రూ.2 వేల జరిమానా
- వేవ్‌లతో గడగడలాడుతున్న పాశ్చాత్య దేశాలు
- హైదరాబాద్ విమానాశ్రయానికి నిత్యం 2 వేల మంది రాక
- భారతీయ ఖైదీలనూ వెనక్కి పంపిస్తున్న విదేశాలు

8 లో



**దేశంలో కొత్తగా 45,576 కేసులు** 7 లో

**ఏపీలో తాజాగా 1,316 మందికి..**

**తెలంగాణలో 1,058 మందికి కరోనా** 2 లో

ఆరోగ్య సిబ్బంది కష్టాలు విని

## బైడెన్ భావోద్వేగం



7లో

■ కోవిడ్ మహమ్మారి మిగిల్చిన విషాదాన్ని వింటూ అమెరికా కాబోయే అధ్యక్షుడు జో బైడెన్ భావోద్వేగానికి గురయ్యారు. కోవిడ్‌పై వివిధ వర్గాల అనుభవాలను తెలుసుకునేందుకు బైడెన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు.

6.29 లక్షల మంది చిరు వ్యాపారులకు

## రూ.627 కోట్ల వడ్డీలేని రుణం



- 'జగనన్న తోడు' కింద ఒక్కొక్కరికి రూ.10 వేల వరకు ఇప్పటికే అందజేత
- రాష్ట్రవ్యాప్తంగా 9.69 లక్షల మంది వ్యాపారుల నుంచి అందిన దరఖాస్తులు
- ఈ నెల 24లోగా మిగతా వారికి బ్యాంకుల నుంచి రుణం మంజూరు
- 25న పథకం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

2 లో

## రాజోలి, జోలదరాశి టెండర్లలో రూ.82.87 కోట్లు ఆదా

- నిప్పులవాగు సామర్థ్యం పెంపు, రాజోలి, జోలదరాశి పనులకు రూ.1,769.15 కోట్ల అంచనాతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన సర్కార్
- ఆర్థిక బిడ్‌లో ఎల్–1గా నిలిచిన సంస్థ కోట్ చేసింది రూ.1,841.69 కోట్లు
- రూ.1841.69 కోట్లనే కాంట్రాక్టు విలువగా పరిగణించి రివర్స్ టెండరింగ్
- రూ.1,758.82 కోట్లకు పనులు దక్కించుకున్న ఎమ్మార్కేఆర్–రిత్విక్ ప్రాజెక్ట్స్ (జేవీ)
- ఎస్ఎల్‌టీసీ ఆమోదంతో ఆ సంస్థకు వర్క్ ఆర్డర్

- వివరాలు 3లో


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్డు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

| | | |
|---|---|---|
| గుడ్డు రిటైల్ ధర ₹ 66 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ 91 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో 164 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ 113 కిలో | స్కిన్‌లెస్ 186 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయబడినది


ఇదం జగత్





### రెండో రోజూ కాన్ఫరెన్స్ రద్దు

■ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ నిర్వహించ తలపెట్టిన వీడియో కాన్ఫరెన్స్ గురువారం కూడా రద్దు అయింది. తొలుత ఈ సమావేశం నాటకీయ పరిణామాల మధ్య బుధవారం నాడు రద్దయిన విషయం తెలిసిందే. మరోవైపు ఎస్ఈసీ నిమ్మగడ్డ గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్లినట్లు తెలిసింది.

3 లో

### అనంతపురంలో భారీ డ్రోన్ సిటీ

■ అనంతపురం జిల్లాలో 360 ఎకరాల్లో భారీ డ్రోన్ సిటీ నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతర్జాతీయ సంస్థలు డ్రోన్ తయారీ, పరిశోధన అభివృద్ధి, పరీక్ష కేంద్రాలను ఒకేచోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఏడీసీఎల్ ఎండీ వి.ఎన్.భరత్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను ఆహ్వానించగా 38 కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు.

10 లో






రోగాన్ని సరిగ్గా గుర్తించకుండా మందులు రాసిచ్చే డాక్టరును మీరు నమ్ముతారా? మరి తేమ విషయంలో వేరే ఆలోచన ఎందుకు?

మీ గోడల తేమ గురించి అక్కడ ఇక్కడ ఇచ్చే సలహాలు విశ్వసించడానికి ముందు అసలైన ఎక్స్‌పర్ట్‌ను ఉపయోగించండి.

ప్రవేశపెడుతున్నాం బర్గర్ హోమ్ షీల్డ్ మాయిశ్చర్ మీటర్ – ఇది తేమ నిండిన గోడల్లో ఉండే మాయిశ్చర్‌ను సరైన శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించి దాని అసలు కారణాన్ని కనిపెడుతుంది. ఆ సమస్య నివారించేందుకు అందిస్తుంది ఒక అద్భుతమైన వాటర్‌ప్రూఫింగ్ సొల్యూషన్స్.

ఇప్పుడు అక్కడ–ఇక్కడ సలహాలు వద్దు, బర్గర్ హోమ్ షీల్డ్‌ను విశ్వసించండి–వారెంటీతో కూడిన సైంటిఫిక్ వాటర్‌ప్రూఫింగ్ సొల్యూషన్స్.

SMS "DAMP" to 56767 or visit bergerpaints.com

Connect with us

## ఈ నెల 27న కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని గురువారం అన్ని శాఖలకు నోట్ పంపారు. కేబినెట్‌లో చర్చించే అంశాలకు సంబంధించిన వివరాలను మెమోరాండం రూపంలో ఈ నెల 24 మధ్యాహ్నం 3 గంటల్లోగా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా నోట్‌లో స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో తాజాగా 1,316 మందికి కరోనా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో 75,165 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 1,316 కేసులు నమోదయ్యాయి. కరోనాతో 11మంది మృతి చెందారు. ఒకే రోజు 1,821 మంది కరోనా నుంచి కోలుకున్నారు. ఇప్పటివరకూ 94,08,868 టెస్టులు చేయగా 8,58,711 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరిలో 8,35,801 మంది కోలుకోగా, 16వేల మంది చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకూ 6,910 మంది మృతి చెందారు. రాష్ట్రంలో పాజిటివిటీ రేటు 9.13 శాతంగా ఉంది.

## తెలంగాణలో తాజాగా 1,058 మందికి కరోనా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బుధవారం ఒక్కరోజే 1,058 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు బులెటిన్‌లో వెల్లడించారు. ఇప్పటివరకు టెస్టుల సంఖ్య 50,11,164కు చేరుకోగా, అందులో 2,60,834 మంది కరోనా బారినపడ్డారు. అలాగే కరోనా నుంచి ఈ ఒక్కరోజులో 1,440 మంది కోలుకోగా, ఇప్పటివరకు 2,46,733 మంది కోలుకున్నారు. తాజాగా మరో నలుగురు చనిపోగా, ఇప్పటివరకు కరోనాతో 1,419 మంది మరణించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా యాక్టివ్ కేసులు 12,682 ఉండగా, అందులో 10,352 మంది చికిత్స పొందుతున్నారు. ఇక రాష్ట్రంలో పది లక్షల జనాభాలో 1,34,636 మందికి నిర్ధారణ పరీక్షలు చేశారు.



వైఎస్సార్ ఆసరా, చేయూత లబ్ధిదారులకు పాడి పశువుల పంపిణీపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు, అధికారులు

# పాడి పండుగ

▶ మొదటి పేజీ తరువాయి

ఆసరా పథకాల లబ్ధిదారులైన మహిళలకు పాడి పశువులు, గొర్రెలు, మేకల పంపిణీ కార్యక్రమంపై ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా వివరాలను పరిశీలించారు. చేయూత ద్వారా కొత్తగా లబ్ధి పొందిన 2.78 లక్షల మంది నుంచి కూడా ఆప్షన్లు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పశువులపై పెట్టుబడి పోషకులకు కచ్చితంగా గిట్టుబాటు కావాలని, ఈ మేరకు పాడి పశువులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. పాల దిగుబడి బాగుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సాధికారత, సుస్థిర ఆర్థికాభివృద్ధి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు చెప్పారు. పశువుల దాణా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల ద్వారా ఇప్పటివరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 78 వేల దుకాణాలు ప్రారంభం అయినట్లు అధికారులు సీఎంకు వివరించారు. సమీక్షలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీదిరి అప్పలరాజు, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్షలో సీఎం సూచనల్లో ముఖ్యాంశాలివీ..



### ఆర్బీకేల్లో సదుపాయాలను వినియోగించుకోవాలి

పెట్టుబడి కచ్చితంగా గిట్టుబాటు అయ్యేలా మేలు జాతిని ఎంపిక చేసేలా జాగ్రత్త వహించాలి. కొనుగోళ్ల కమిటీలో సాంకేతిక నైపుణ్యం కలిగిన వారుండాలి. బీమా సంస్థ ప్రతినిధితో పాటు బ్యాంకర్ కూడా ఆ కమిటీలో సభ్యులుగా ఉండాలి. పశు సంవర్ధక శాఖ సేవలను బలోపేతం చేసి ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలి. పాడి పశువులకు ఎలాంటి సమస్య వచ్చినా ఆర్బీకేల పరిధిలో వెంటనే వాటికి వైద్యం అందించేలా అధికారులు సన్నద్ధం కావాలి. ఆర్బీకేల పరిధిలో ఏర్పాటయ్యే వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలను వైద్య సేవల కోసం వినియోగించుకోవాలి. కాల్ సెంటర్ల ద్వారా వైద్యం అందించాలి.

### సహజసిద్ధమైన దాణా..

పశువుల దాణా సక్రమంగా సరఫరా చేస్తూ రసాయనాలు (కెమికల్స్) లేకుండా సహజమైన పదార్థాలతో తయారైనవే అందించాలి. పశువులకు కలుషితమైన ఆహారం అందించడం వల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులు పెరుగుతున్నాయి. సేంద్రీయ (ఆర్గానిక్) పాలు, సేంద్రీయ మాంసం ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీనివల్ల ఉత్పత్తులకు మరింత మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుంది. సేంద్రీయ పాల బ్రాండ్‌పై విస్తృత ప్రచారం చేపట్టి మహిళలకు అవగాహన కల్పించాలి.

### లబ్ధిదారులకు పాడి పశువులు, గొర్రెలు, మేకల పంపిణీ ఇలా

**2020 నవంబర్ 26**
- ప్రకాశం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లోని 400 గ్రామాల్లో దాదాపు 7 వేల యూనిట్ల గేదెలు, ఆవుల పంపిణీ

**2020 డిసెంబర్ 5 - 2021 ఫిబ్రవరి 28 మధ్య**
- దాదాపు లక్ష యూనిట్ల ఆవులు, గేదెల పంపిణీ

**ఆగస్టు 2021 - ఫిబ్రవరి 2022 మధ్య**
- 3.69 లక్షల యూనిట్ల ఆవులు, గేదెల పంపిణీ

**2021 నవంబరు 30 నుంచి - 2021 డిసెంబర్ 31 వరకు**
- గొర్రెలు, మేకల యూనిట్లు పంపిణీ

### పశువులకు ఆరోగ్య కార్డులు

ప్రతి పశువునూ పశు సంవర్ధక శాఖ అధికారులు భౌతికంగా తనిఖీ చేశాక లబ్ధిదారులకు అందచేయనున్నారు. లబ్ధిదారుల జాబితాను ఆర్బీకేల పరిధిలో నమోదు చేసి ప్రతి నెలా పశువుల ఆరోగ్యాన్ని వైద్యులు పరిశీలిస్తారు. పాడి పశువులకు ఇచ్చే ఆరోగ్య కార్డులో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేస్తారు. పాల దిగుబడి వివరాలు కూడా ఇందులో పొందుపరుస్తారు.

### 6.29 లక్షల మంది చిరు వ్యాపారులకు

# రూ.627 కోట్ల వడ్డీలేని రుణం

- 'జగనన్న తోడు' కింద ఒక్కొక్కరికి రూ.10 వేల వరకు ఇప్పటికే అందజేత
- రాష్ట్రవ్యాప్తంగా 9.69 లక్షల మంది వ్యాపారుల నుంచి అందిన దరఖాస్తులు
- ఈ నెల 24వ తేదీలోగా మిగతా వారికి బ్యాంకుల నుంచి రుణం మంజూరు
- 25న పథకం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ములో ఎక్కువ భాగం ప్రైవేటు వడ్డీ వ్యాపారులకు వడ్డీ చెల్లించేందుకే పోతుండటంతో.. వీరికి 'జగనన్న తోడు' పథకం కింద రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణాలిచ్చి ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు.. ఈ నెల 25వ తేదీన ప్రారంభించనున్న ఈ పథకంలో అసలు మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లిస్తే, వడ్డీని మాత్రం బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 9.69 లక్షల మంది చిరు వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. అర్హతల మేరకు లబ్ధిదారులను గ్రామ, వార్డు వలంటీర్లు గుర్తించి వారి దరఖాస్తులను బ్యాంకులకు సమర్పిస్తున్నారు. ఇప్పటికే 8.57 లక్షల దరఖాస్తులను ఈ విధంగా బ్యాంకులకు పంపించారు. ఇందులో 6.29 లక్షల మందికి బ్యాంకులు రూ.627.01 కోట్ల మేర వడ్డీ లేని రుణాలను మంజూరు చేశాయి.

### జగనన్న తోడు గుర్తింపు కార్డులు

మిగతా దరఖాస్తులను కూడా వెంటనే బ్యాంకులకు పంపించి 24వ తేదీలోగా రుణాలు మంజూరు చేయించాల్సిందిగా సీఎం జగన్ బుధవారం ఈ పథకంపై సమీక్ష సందర్భంగా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఫుట్‌పాత్‌లు, తోపుడు బండ్లపై, రహదారుల పక్కన చిన్న చిన్న వస్తువులు, కూరగాయలు, తినుబండారాలు అమ్ముకునే వారికి, కలంకారీ పనులు చేసేవారికి, ఏటి కొప్పాక బొమ్మలు, తోలు బొమ్మలు, బొబ్బిలి వీణ వంటి సంప్రదాయ హస్తకళలపై ఆధారపడి జీవిస్తున్న వారికి జగనన్న తోడు కింద రుణాలు మంజూరు చేస్తున్నారు. కాగా ఈ పథకం కోసం గుర్తించిన చిరు వ్యాపారులకు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు గుర్తింపు కార్డులు పంపిణీ చేయనున్నారు. ఈ పథకంతో చిరు వ్యాపారుల గురించి పట్టించుకున్న తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ గుర్తింపు పొందారు.

**జిల్లాల వారీగా చిరు వ్యాపారుల నుంచి వచ్చిన దరఖాస్తులు, మంజూరైన రుణం (రూ.కోట్లలో) వివరాలు..**

| జిల్లా పేరు | మొత్తం దరఖాస్తులు | మంజూరైన దరఖాస్తులు | మంజూరైన రుణం | జిల్లా పేరు | మొత్తం దరఖాస్తులు | మంజూరైన దరఖాస్తులు | మంజూరైన రుణం |
|---|---|---|---|---|---|---|---|
| అనంతపురం | 73,855 | 40,994 | 40.86 | నెల్లూరు | 66,658 | 39,152 | 39.09 |
| చిత్తూరు | 72,202 | 52,542 | 52.49 | శ్రీకాకుళం | 42,844 | 37,690 | 37.53 |
| తూర్పుగోదావరి | 91,556 | 67,960 | 67.78 | విశాఖపట్నం | 87,581 | 61,935 | 61.86 |
| గుంటూరు | 1,04,579 | 73,659 | 73.38 | విజయనగరం | 44,204 | 33,153 | 32.51 |
| కృష్ణా | 62,297 | 41,754 | 41.73 | ప.గోదావరి | 1,10,058 | 68,005 | 67.57 |
| కర్నూలు | 60,593 | 34,894 | 34.82 | వైఎస్సార్ | 68,984 | 42,210 | 42.13 |
| ప్రకాశం | 84,413 | 35,474 | 35.26 | మొత్తం | 9,69,824 | 6,29,422 | 627.01 |

## యరపతినేని నివాసాల్లో సీబీఐ దాడులు

▶ మొదటి పేజీ తరువాయి

పలు కీలక పత్రాలు, మొబైల్ ఫోన్లు, సామగ్రి, నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది.

**17 కేసులపై దర్యాప్తు..**

టీడీపీ నేత యరపతినేని శ్రీనివాసరావు సహా ఆయన అనుచరులు 17 మంది సాగించిన అక్రమ సున్నపురాయి తవ్వకాలపై నమోదైన 17 కేసులపై సీబీఐ దర్యాప్తు జరుపుతోంది. గుంటూరు జిల్లా దాచేపల్లి, పిడుగురాళ్ల మండలాల్లోని కేసానుపల్లి, నడికుడి, కోనంకి గ్రామాల పరిధిలో నిందితులు అక్రమ మైనింగ్, క్వారీ తవ్వకాలు, విలువైన సున్నపురాయిని మోసపూరితంగా తరలించడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు. పెద్ద ఎత్తున సహజ వనరుల దోపిడీకి పాల్పడ్డారు. 2014 నుంచి 2018 వరకు అనేక లక్షల టన్నుల సున్నపురాయిని అక్రమంగా తవ్వేశారు. మొత్తంగా అనేక కోట్ల రూపాయల మేర విలువైన సహజ వనరులు దోచుకున్నారు. ఈ వ్యవహారంపై వేగంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీబీఐ పేర్కొంది.

### శాటిలైట్ చిత్రాలతో నష్టం అంచనా..

అక్రమ మైనింగ్ కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. నష్టం అంచనా వేయడానికి దేశంలోనే తొలిసారిగా శాటిలైట్ చిత్రాలను ఉపయోగించుకుంటోంది. అక్రమ మైనింగ్‌కు ముందు, ఆ తర్వాత.. శాటిలైట్ చిత్రాలను తీసుకొని వాటిని సాంకేతిక పద్ధతుల్లో పరిశీలించి ఏ మేరకు అక్రమ మైనింగ్ చేశారనే దానిని సీబీఐ అంచనా వేస్తోంది. కాగా, సీబీఐ అధికారులు వచ్చారన్న విషయం తెలుసుకున్న కొందరు నిందితులు పరారైనట్లు సమాచారం. మరోవైపు ఈ వ్యవహారంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయమున్న వ్యక్తులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది.

### టీడీపీ పాలనలో యరపతినేని ఇష్టారాజ్యం

- కేసానుపల్లి, కోనంకి, నడికుడి గ్రామాల్లో రూ.10వేల కోట్ల విలువైన తవ్వకాలు
- యరపతినేని, ఆయన అనుచరులు సహా మొత్తం 17 మందిపై కేసులు
- రాష్ట్ర ప్రభుత్వమే సీబీఐ విచారణ కోరవచ్చు కదా అన్న హైకోర్టు
- అసలు లైసెన్సులే లేకుండా నచ్చినచోట తవ్వేశారన్న సీఐడీ
- సీబీఐ దర్యాప్తు కోరుతూ గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

## అధికారం అండతో అక్రమ మైనింగ్

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారమే అండగా ఆ పార్టీ నేత యరపతినేని శ్రీనివాసరావు, ఆయన అనుచరులు సాగించిన అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని తవ్వితే విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తాయి. గుంటూరు జిల్లా గురజాల ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో యరపతినేని, ఆయన అనుచరులు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారనే అభియోగాలు వెల్లువెత్తాయి. ఆయనపై అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో పలువురు హైకోర్టును ఆశ్రయించడంతో కేసులు నమోద అయ్యాయి.

**గ్రామాలకు గ్రామాలు తవ్వేశారు..**

యరపతినేనిపై 2016లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దీంతో అప్పుడే సీఐడీ దర్యాప్తు ప్రారంభించింది. యరపతినేనితో పాటు గుంటూరు జిల్లా దాచేపల్లి, కొండమూడు, పిడుగురాళ్ల, నడికుడి, అమరావతి ప్రాంతాలకు చెందిన మరో 16 మందిపై 2018లో మొత్తం 17 కేసులు పోలీసులు నమోదు చేశారు. పిడుగురాళ్ల మండలం కేసానుపల్లి, కోనంకిలో సున్నపురాయి అక్రమ తవ్వకం, రవాణా, దాచేపల్లి మండలం నడికుడి గ్రామాల్లో అక్రమ మైనింగ్ జరిగినట్టు గుర్తించారు. కోనంకిలో సర్వే నంబర్ 690, 691, 692లోను, కేసనుపల్లిలోని 324/ఎ, 336/1బి, 336/5, 336/6లో, నడికుడి 17/4, 17/5, 17/6, 17/7, 15 సర్వే నంబర్లలో జరిగిన అక్రమ మైనింగ్‌ను నిర్ధారించారు. గత సర్కారు హయాంలో 2014 నుంచి 2018 వరకు నాలుగేళ్లపాటు యరపతినేని కనుసన్నల్లో దాదాపు రూ.10వేల కోట్లకుపైగా విలువైన అక్రమ మైనింగ్ జరిగినట్టు అంచనా.

**హైకోర్టు సూచన నేపథ్యంలో సీబీఐ దర్యాప్తు..**

గతేడాది ఈ కేసుల విచారణ సమయంలో రాష్ట్ర ప్రభుత్వమే సీబీఐ విచారణ కోరవచ్చు కదా అంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో సీఐడీ కూడా అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించింది. అసలు లైసెన్సు(అనుమతి)లే లేకుండా నచ్చిన చోట అక్రమ మైనింగ్‌కు పాల్పడం జరిగిందని సీఐడీ దర్యాప్తులో గుర్తించారు. దీనికితోడు తక్కువ విస్తీర్ణానికి తక్కువ మొత్తం లీజుగా చెల్లించి అధిక విస్తీర్ణంలో అనుమతి లేకుండా పెద్ద ఎత్తున మైనింగ్ జరిపినట్టు నిర్ధారణ అయ్యింది. మరోవైపు మైనింగ్ లీజులు దక్కించుకున్న ఇతరులను పిలిచి బెదిరించి వాటిని యరపతినేని అనుచరులు కబ్జా చేసి కొల్లగొట్టారనే అభియోగాలున్నాయి. ఇలా ఆయన అక్రమ మైనింగ్ కొనసాగగా.. ఇందులో టీడీపీ ప్రభుత్వ పెద్దలకు భారీగా వాటాలు వెళ్లాయనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలోనే అక్రమ మైనింగ్ కేసుల పూర్తిస్థాయి దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. పోలీసులు నమోదు చేసిన కేసులపై విచారణ చేపట్టాలని సీబీఐని కోరుతూ ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1948 (సెంట్రల్ యాక్ట్) సెక్షన్ 6 ప్రకారం నిర్ణయం తీసుకుంది.

**అక్రమ మైనింగ్‌పై గత కేసుల వివరాలు**

| పేరు | కేసుల వివరాలు |
|---|---|
| యరపతినేని శ్రీనివాసరావు | 170/2016 |
| మీనిగ అంజిబాబు | 308/2018 |
| తిప్పవజ్జుల నారాయణశర్మ | 309/2018 |
| గ్రంధి అజయ్‌కుమార్ | 310/2018 |
| తిప్పవజ్జుల నారాయణశర్మ | 311/2018 |
| రాజేటి జాకబ్ | 312/2018 |
| గుదె వెంకట కోటేశ్వరరావు | 313/2018 |
| వర్సు ప్రకాశ్ | 314/2018 |
| వర్ల రత్నం దానయ్య | 315/2018 |
| నంద్యాల నాగరాజు | 316/2018 |
| నీరుమళ్ల శ్రీనివాసరావు | 317/2018 |
| ఆలపాటి నాగేశ్వరరావు | 318/2018 |
| వేముల శ్రీనివాసరావు | 181/2018 |
| వర్సు వెంకటేశ్వరరావు | 182/2018 |
| వేముల ఏడుకొండలు | 183/2018 |
| ఈర్ల వెంకటరావు | 184/2018 |
| బతుల నరసింహారావు | 185/2018 |
| వేముల శ్రీనివాసరావు | 186/2018 |

నోట్: తిప్పవజ్జుల నారాయణశర్మలు ఇద్దరూ వేర్వేరు వ్యక్తులు

# తుంగభద్రకు పుష్కర శోభ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేకంగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

### కర్నూలు జిల్లాలో 23 ఘాట్లు..

తుంగభద్ర నది ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లాలో మాత్రమే ప్రవహిస్తుంది. కర్ణాటకలో ప్రవహించిన అనంతరం మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం మేళిగనూరు(నదిచాగి) వద్ద ఆంధ్రలో ప్రవేశిస్తుంది. 156 కిలోమీటర్ల మేర మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, నందికొట్కూరు నియోజకవర్గాలలో ప్రవహించాక కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. నది పరీవాహక ప్రాంతంలో 23 పుష్కర ఘాట్లను ప్రభుత్వం నిర్మించింది. ఘాట్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పుష్కరాలకు అనుమతి ఇచ్చింది. కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పుష్కరఘాట్ల వరకూ 43 బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. ఘాట్ల వద్ద తాత్కాలిక బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేశారు. తుంగభద్ర నదిలో ప్రస్తుతం 5 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. పుష్కరాల సమయంలో నీటి సమస్య లేకుండా చూసేందుకు అదనంగా రోజుకు 3 వేల క్యూసెక్కుల చొప్పున తుంగభద్ర డ్యాం నుంచి నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది.

### స్నానాలకు అనుమతి లేదు..

కోవిడ్ ప్రభావం తీవ్రంగా ఉండటం, రెండో దశ మొదలవ్వడం, నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. భక్తులు నదిలో పుష్కరస్నానాలు ఆచరించేందుకు అనుమతి నిరాకరించింది. అయితే పిండప్రదానాలకు అవకాశం కల్పించింది.



సంకల్‌భాగ్ పుష్కర ఘాట్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు బుగ్గన, జయరాం, కలెక్టర్ వీరపాండియన్

ఈ-టికెట్ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న వారికి అనుమతి ఇచ్చింది. ఈ-టికెట్ వెబ్‌సైట్ (https://tungabhadra pushkaralu 2020.ap.gov.in)ను మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ వీరపాండియన్, ఎమ్మెల్యేలు గురువారం కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లో ప్రారంభించారు. వెబ్‌సైట్ ద్వారా భక్తులు తమకు నచ్చిన పుష్కర ఘాట్‌లలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. సంప్రదాయ పూజలకు, పిండప్రదానాలకు 23 ఘాట్లలో 350 మంది పురోహితులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో పురోహితుడు రోజుకు 16 స్లాట్ల చొప్పున (ఒక్కో స్లాట్‌లో ఇద్దరు) పూజలు చేస్తారు. ఈ టికెట్ బుక్ చేసుకోకుండా నేరుగా వస్తే పిండప్రదానాలకు అనుమతి ఉండదు. కృష్ణా, గోదావరి పుష్కరాల్లో నిర్వహించినట్లుగా ఇప్పుడు కూడా పుష్కరాలు జరిగే 12 రోజుల పాటు అన్ని ఘాట్లలో గంగాహారతి ఇవ్వనున్నారు. కాగా, సీఎం పర్యటన సందర్భంగా సంకల్‌భాగ్ వీఐపీ పుష్కర ఘాట్‌లో ఏర్పాట్లను మంత్రులు బుగ్గన, జయరాం, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్, తొగురు ఆర్థర్ పరిశీలించారు.

### పుష్కరాలను విజయవంతం చేయాలి

''కోవిడ్ నేపథ్యంలో కఠిన పరిస్థితుల్లో పుష్కరాలు నిర్వహిస్తున్నాం. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అత్యంత భక్తిభావంతో నిర్వహిస్తాం. ఈ-టికెట్ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న వారు పిండప్రదానాలు చేసుకోవచ్చు. ప్రత్యేక పరిస్థితుల్లో జరిగే ఈ చారిత్రక ఘట్టాన్ని విజయవంతం చేసేందుకు భక్తులు సహకరించాలి'' అని కర్నూలు కలెక్టర్ వీరపాండియన్ విజ్ఞప్తి చేశారు.

### కేంద్ర నిబంధనలతో నియంత్రణ చర్యలు



కరోనా కట్టడికి కేంద్రం సూచించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాల్సి రావడంతోనే తుంగభద్ర పుష్కరాల్లో కొన్ని నియంత్రణ చర్యలు చేపడుతున్నామని, భక్తులు సహకరించాలని మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు కోరారు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి, కృష్ణా పుష్కరాలకు రూ. వేల కోట్లు ఖర్చు చేసి అవినీతికి పాల్పడితే, తమ ప్రభుత్వం అవసరమైన మేరకు పొదుపుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కర్ణాటక, తెలంగాణ కూడా ఈ పుష్కరాల్లో భక్తుల పుణ్య స్నానాలకు అనుమతి తెలపలేదన్నారు. రాష్ట్రంలో పేదలకు డిసెంబర్ 25న ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తుంటే.. ఆరోజు క్రిస్మస్ అంటూ కొందరు విమర్శలు చేయడం సరికాదని, ఆరోజు ముక్కోటి ఏకాదశి కూడా అనే విషయం తెలుసుకోవాలన్నారు.

### నాడు తండ్రి.. నేడు కుమారుడు..

గత తుంగభద్ర పుష్కరాలు 2008 డిసెంబర్ 10న ప్రారంభమయ్యాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి డిసెంబర్ 11న కర్నూలు నగరంలోని సంకల్‌భాగ్ ఘాట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, నదికి హారతి ఇచ్చారు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో సంకల్‌భాగ్ ఘాట్‌లోనే పుష్కరాలు ప్రారంభించనున్నారు. తండ్రి, తనయులు ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో వరుస పుష్కరాలు రావడం అరుదైన ఘట్టంగా భక్తులు భావిస్తున్నారు.



2008లో జరిగిన తుంగభద్ర పుష్కరాల్లో పూజలు చేస్తున్న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)



వైఎస్సార్‌సీపీ నేతలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

# మీ నిర్ణయం మాకు శిరోధార్యం

- తిరుపతి లోక్‌సభ అభ్యర్థి ఎంపిక బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌కే అప్పగించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- అంతకుముందు అందరి అభిప్రాయాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: తిరుపతి ఎస్సీ రిజర్వుడు లోక్‌సభా స్థానం ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు పార్టీ అభ్యర్థి ఎంపిక బాధ్యతను వైఎస్సార్‌సీపీ నేతలు సీఎం వైఎస్ జగన్‌కే అప్పగించారు. గురువారం సాయంత్రం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, పలువురు మంత్రులు, తిరుపతి లోక్‌సభా స్థానం పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యేలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. అభ్యర్థి విషయంలో అందరి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి మీడియాతో మాట్లాడారు. తిరుపతి అభ్యర్థి విషయంలో సీఎం ప్రతి ఒక్కరి అభిప్రాయం తీసుకున్నారని, అందరం ఏకగ్రీవంగా సీఎంకే ఎంపిక బాధ్యతను అప్పగించామని తెలిపారు.

**భారీ మెజారిటీతో గెలిపిస్తాం: కాకాణి**

సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ విస్తృత ప్రయోజనాలు, స్థానిక పరిస్థితులపై సీఎం జగన్‌కు పూర్తి అవగాహన ఉంది కనుక అభ్యర్థి ఎంపికపై నిర్ణయాన్ని ఆయనకే వదిలిపెట్టామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి ఎవరిని ఖరారు చేసినా అందరమూ కలసికట్టుగా పనిచేసి భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. అభ్యర్థి ఎవరు? అనే ప్రస్తావనే సమావేశంలో రాలేదని వెల్లడించారు. తాము కేవలం నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులను సీఎంకు వివరించామన్నారు. గతంలో కన్నా ఎక్కువ మెజారిటీతో గెలిపిస్తామని మాట ఇచ్చామన్నారు. అభ్యర్థి విషయంలో సీఎం ఏరోజు నిర్ణయం తీసుకుంటే ఆరోజు నుంచే క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగుతామని చెప్పారు. మీడియా సమావేశంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కొడాలి నాని, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కె.ఆదిమూలం, బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు జరిగిన సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బాలినేని శ్రీనివాసరెడ్డి, పి.అనిల్‌కుమార్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వి.వరప్రసాద్, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# రాజోలి, జోలదరాశి టెండర్లలో

# రూ. 82.87 కోట్లు ఆదా




**టెండర్ అంచనాతో పోలిస్తే ఖజానాకు రూ.10.33 కోట్ల మిగులు**

కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ, కృష్ణానదికి వరద వచ్చే 30 నుంచి 40 రోజుల్లోనే రాయలసీమ, నెల్లూరు ప్రాజెక్టులను నింపడం ద్వారా కరువును రూపుమాపడానికి రాయలసీమ కరువు నివారణ ప్రణాళికను ప్రభుత్వం చేపట్టింది. దీన్లో భాగంగా బీసీఆర్ నుంచి నిప్పులవాగు, గాలేరు, కుందూనది ప్రవాహ సామర్థ్యం 35 వేల క్యూసెక్కులకు పెరిగేలా అభివృద్ధి చేయడం, పరిసర గ్రామాల వద్ద హైలెవల్ బ్రిడ్జిలు, కరకట్టలు నిర్మించడం.. కుందూపై రాజోలి ఆనకట్టకు ఎగువన 2.95 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం, జోలదరాశి వద్ద 0.80 టీఎంసీల సామర్థ్యంతో మరో జలాశయం నిర్మించే పనులకు రూ.1,769.15 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ టెండర్లలో ఎమ్మార్కేఆర్ కన్‌స్ట్రక్షన్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్, పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థలు బిడ్‌లు దాఖలు చేశాయి. ఈనెల 17న ఆర్థిక బిడ్‌ను తెరిచారు. కాంట్రాక్టు అంచనా విలువ రూ.1,769.15 కోట్ల కంటే 4.1 శాతం అధికంగా అంటే రూ.1,841.69 కోట్లకు కోట్ చేసిన సంస్థ ఎల్–1గా నిలిచింది. ఆర్థిక బిడ్‌లో ఎల్–1గా నిలిచిన సంస్థ కోట్ చేసిన రూ.1,841.69 కోట్లనే కాంట్రాక్టు విలువగా పరిగణించి ఈ–ఆక్షన్ (రివర్స్ టెండరింగ్) నిర్వహించారు. రివర్స్ టెండరింగ్‌లో మూడుసంస్థలు పోటాపోటీగా తలపడ్డాయి. ఈ ప్రక్రియ గడువు ముగిసే సమయానికి రూ.1,758.82 కోట్లకు కోట్‌చేసిన ఎమ్మార్కేఆర్–రిత్విక్ ప్రాజెక్ట్స్ (జేవీ) ఎల్–1గా నిలిచింది. అంటే.. రివర్స్ టెండరింగ్‌లో రూ.82.87 కోట్లు ఆదా అయ్యాయి. మొత్తంమీద టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న అంచనా వ్యయం రూ.1,769.15 కోట్ల కంటే 0.584 శాతం తక్కువకు అంటే రూ.1,758.82 కోట్లకు పనులను కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. దాంతో ప్రభుత్వ ఖజానాకు రూ.10.33 కోట్లు మిగిలాయి. ఈ టెండర్ల ప్రక్రియను ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి నేతృత్వంలోని ఎస్‌ఎల్‌టీసీకి పంపారు. నిబంధనల ప్రకారం టెండర్ల ప్రక్రియ జరిగిందా లేదా అనే అంశాన్ని ఎస్‌ఎల్‌టీసీ పరిశీలించి.. ఆమోదం తెలుపుతుంది. అనంతరం పనుల్ని ఎమ్మార్కేఆర్–రిత్విక్ ప్రాజెక్ట్స్ (జేవీ)కి అప్పగిస్తూ కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ వర్క్ ఆర్డర్ జారీ చేయనున్నారు. దీంతో.. ఇప్పటివరకు జలవనరులశాఖ పనుల్లో రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.1,232.62 కోట్లు ఆదా అయ్యాయి.

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లాలో బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ (బీసీఆర్) నుంచి నిప్పులవాగు, గాలేరు, కుందూనది ప్రవాహ సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు అభివృద్ధి చేయడం, కుందూనదిపై రాజోలి వద్ద, జోలదరాశి వద్ద జలాశయాల నిర్మాణపనులకు నిర్వహించిన రివర్స్ టెండర్లలో రూ.82.87 కోట్లు ఆదా అయ్యాయి. ఈ పనులను రూ.1,758.82 కోట్లకు ఎమ్మార్కేఆర్–రిత్విక్ ప్రాజెక్ట్స్ (జేవీ) దక్కించుకుంది. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్‌ఎల్‌టీసీ) అనుమతితో పనులను ఆ సంస్థకు అప్పగిస్తూ కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ మురళీనాథ్‌రెడ్డి వర్క్ ఆర్డర్ జారీ చేయనున్నారు.

- రూ.1,758.82 కోట్లకు పనులు దక్కించుకున్న ఎమ్మార్కేఆర్–రిత్విక్ ప్రాజెక్ట్స్ (జేవీ)
- ఎస్‌ఎల్‌టీసీ ఆమోదంతో ఆ సంస్థకు వర్క్ ఆర్డర్
- నిప్పులవాగు సామర్థ్యం పెంపు, రాజోలి, జోలదరాశి పనులకు రూ.1,769.15 కోట్ల అంచనాతో టెండర్ నోటిఫికేషన్ జారీచేసిన సర్కార్
- ఆర్థిక బిడ్‌లో ఎల్–1గా నిలిచిన సంస్థ కోట్ చేసింది రూ.1,841.69 కోట్లు
- రూ.1841.69 కోట్లనే కాంట్రాక్టు విలువగా పరిగణించి రివర్స్ టెండరింగ్
- గడువు ముగిసే సమయానికి రూ.1,758.82 కోట్లకు దక్కించుకున్న ఎమ్మార్కేఆర్–రిత్విక్ ప్రాజెక్ట్స్ (జేవీ)

**ఇప్పటివరకు జలవనరుల శాఖలో రివర్స్ టెండరింగ్ ద్వారా ఆదా అయిన సొమ్ము 1,232.62 కోట్లు**

# బీసీల స్వయం ఉపాధికి 3,800 మినీ ట్రక్కులు



- సబ్సిడీపై అందజేత..
- ఈబీసీలకు 1,800 మినీ ట్రక్కుల పంపిణీ

సాక్షి, అమరావతి: బీసీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం నాలుగు చక్రాల మినీ ట్రక్కులను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేయనుంది. పేదలకు జనవరి నుంచి ఇంటింటికీ సబ్సిడీ సరుకులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ఇందుకోసం పెద్ద ఎత్తున అవసరమయ్యే మినీ ట్రక్కులను సబ్సిడీపై ఇవ్వడం ద్వారా నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు స్వయంఉపాధి కల్పించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా 3,800 మినీ ట్రక్కులను నిరుద్యోగులైన బీసీ యువతకు ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై అందజేస్తారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.ప్రవీణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులిచ్చారు. బీసీ యువతకు స్థిరమైన జీవనోపాధి, ఆర్థిక అభ్యున్నతి కల్పించేదిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఆ మేరకు శ్రీకాకుళం జిల్లా–395, విజయనగరం–298, విశాఖపట్నం–415, తూర్పు గోదావరి–467, పశ్చిమ గోదావరి–317, కృష్ణా–293, గుంటూరు–243, ప్రకాశం–139, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు–125, చిత్తూరు–240, వైఎస్సార్ కడప–165, కర్నూలు–343, అనంతపురం–360 చొప్పున వాహనాలను బీసీ నిరుద్యోగ యువతకు సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేయనున్నది. వాహనం ఖరీదు రూ.5,81,190గా ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారుని వాటా 10 శాతం, బ్యాంకు లోన్ 30 శాతం, సబ్సిడీ 60 శాతం ఉంటుంది. దరఖాస్తులు చేసుకునేందుకు బీసీ కార్పొరేషన్ మండల, మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ స్థాయిల్లో నోటిఫికేషన్ ఇస్తుంది. నోటిఫికేషన్ శుక్రవారం వెలువడుతుంది. ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**ఈబీసీలకూ..**

మరోవైపు ఈబీసీలకూ రాష్ట్ర ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై 1,800 మినీట్రక్కులను అందజేసేందుకు వీలుగా ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. శ్రీకాకుళం జిల్లా–19, విజయనగరం–27, విశాఖ–141, తూర్పుగోదావరి–246, పశ్చిమగోదావరి–179, కృష్ణా–184, గుంటూరు–236, ప్రకాశం–160, నెల్లూరు–97, చిత్తూరు–165, వైఎస్సార్–131, కర్నూలు–89, అనంతపురం–126 వాహనాలు చొప్పున ఈబీసీలకు అందజేస్తారు.



# మద్యం షాపుల అద్దెల్లో రూ. 108.84 కోట్లు ఆదా



- రివర్స్ టెండరింగ్‌తో రూ.55.92 కోట్ల నుంచి రూ.46.85 కోట్లకు తగ్గిన నెల అద్దెలు
- ఎక్సైజ్‌లో ట్రాన్స్‌పోర్టు టెండర్లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల వసూళ్లపై విచారణ
- జీఎస్టీ పాత బకాయిలు 53.42 శాతం వసూలు
- మీడియాతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సాక్షి, అమరావతి: మద్యం షాపుల అద్దెలకు రివర్స్ టెండర్లు నిర్వహించడంతో రూ.108.84 కోట్లు ఆదా అయినట్లు డిప్యూటీ సీఎం, ఎక్సైజ్‌శాఖ మంత్రి నారాయణస్వామి చెప్పారు. ఆయన గురువారం వెలగపూడిలోని సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. గతేడాది మద్యం పాలసీ ప్రకటన సమయంలో ప్రభుత్వ మద్యం దుకాణాల అద్దెల రూపంలో నెలకు రూ.55.92 కోట్ల చొప్పున ఏడాదికి రూ.671.04 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఈ ఏడాది రివర్స్ టెండర్లు నిర్వహించి నెలకు రూ.46.85 కోట్ల చొప్పున ఏడాదికి రూ.562.20 కోట్లు అద్దెలకు ఖరారు చేశామన్నారు.

**ఆయన ఇంకా ఏమన్నారంటే..**

- గతేడాది కంటే అద్దెల రూపంలో రూ.108.84 కోట్లు ఆదా అయింది. గతం కంటే మద్యం దుకాణాల అద్దెలు 16.22 శాతం తగ్గాయి.
- ఎక్సైజ్‌శాఖలో ట్రాన్స్‌పోర్టు టెండర్లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల అక్రమ వసూళ్లపై విచారణకు ఆదేశించాం.
- మద్యం షాపుల్లో సిబ్బందిని రెన్యువల్ చేయాలంటే డబ్బు ఇవ్వాలని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఇబ్బందులు పెడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారంపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించా.
- అసలు ఏ ఏజెన్సీలు పనిచేస్తున్నాయో నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులకు సూచించా.
- జీఎస్టీ పాత బకాయిలు రూ.961.9 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం విధించగా, 50 రోజుల్లో అధికారులు రూ.513.89 కోట్లు వసూలు చేశారు. 53.42 శాతం లక్ష్యం సాధించాం.
- చంద్రబాబు అబద్ధాల్లో పుట్టి వాటిలో పెరిగి ఇంకా అలాగే జీవిస్తున్నారు.

## రాష్ట్రంలో నేడు, రేపు అక్కడక్కడా వర్షాలు



- నైరుతి అరేబియాలో అల్పపీడనం
- వాయుగుండంగా మారే అవకాశం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): నైరుతి అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది రాగల 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని, ఫలితంగా శుక్రవారం, శనివారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో తక్కువ ఎత్తులో ఈశాన్య, తూర్పుదిశల నుంచి చల్లటి గాలులు వీస్తున్నాయి. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. మన్యం ప్రాంతాల్లో మంచు కురుస్తోంది. అనేక ప్రాంతాల్లో రెండు నుంచి మూడు డిగ్రీల తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

## 'పునర్వ్యవస్థీకరణ' కమిటీ సభ్యుడిగా డీజీపీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రస్తుతమున్న జిల్లాలను పునర్వ్యవస్థీకరించేందుకు గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల కమిటీలో సభ్యుడిగా డీజీపీని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని గురువారం ఉత్తర్వులిచ్చారు.

## కొత్త జిల్లాల ఏర్పాటును స్వాగతిస్తున్నాం

ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అనువుగా కొత్త జిల్లాల ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నామని ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటులో ఉద్యోగుల కేటాయింపు, సదుపాయాలపై ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక ప్రకటించాలని ఆయన కోరారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ముందుగా ఉద్యోగ సంఘాలతో సీఎం సమావేశం నిర్వహించాలని కోరారు. ఈ మేరకు గురువారం బొప్పరాజు ఓ ప్రకటన విడుదల చేశారు.

## జ్యుడీషియల్ ప్రివ్యూకు 'కళాశాలల' టెండర్

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా పిడుగురాళ్ల, వైఎస్సార్ జిల్లా పులివెందుల, విశాఖ జిల్లా పాడేరులో ఏర్పాటు చేయనున్న వైద్య కళాశాలల పనుల టెండర్ ఫైలు జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్లింది. ఒక్కో కాలేజీ నిర్మాణాన్ని రూ.500 కోట్లతో చేపడుతున్నామని, జ్యుడీషియల్ ప్రివ్యూ పరిశీలన పూర్తవగానే టెండర్లకు వెళ్తామని రాష్ట్ర మౌలిక, వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గురువారం తెలిపారు. టెండర్ ఫైల్‌ను ఏపీఎంఎస్ఐడీసీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కాంట్రాక్టర్లకు ఏమైనా సూచనలు గానీ, అభ్యంతరాలు గానీ ఉంటే తెలియజేయాలన్నారు.

## టీడీపీ హయాంలో రాష్ట్రాన్ని నాశనం చేశారు

ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు మండిపాటు



శ్రీకాకుళం న్యూకాలనీ: టీడీపీ హయాంలో రాష్ట్రాన్ని నాశనం చేసేశారని, కేంద్ర నిధులతో చంద్రన్న పేరిట సోకులు చేశారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శించారు. మందస మాజీ ఎంపీపీ కొర్ల కన్నారావు బీజేపీలో చేరిన సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిని భ్రమరావతిగా చేశారని చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ఎత్తు తగ్గిస్తున్నట్టు టీడీపీ అనవసరమైన రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ నుంచి భారీగా వలసలు మొదలయ్యాయని.. దాదాపు ఆ పార్టీ మూతపడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ అభివృద్ధికి సహకారాన్ని అందించటానికి బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసులు దేశంలోనే ఆదర్శం

- తప్పు చేస్తే సొంత సిబ్బందినీ ఉపేక్షించని గొప్ప వ్యవస్థ
- 'స్పందన'లో సీఎం వైఎస్ జగన్ అభినందన

సాక్షి, అమరావతి: తప్పు చేస్తే పోలీసులను సైతం అరెస్టు చేసి కేసులు నమోదు చేసిన వ్యవస్థ మనదని, చట్టం ఎవరికీ చుట్టం కాదని నిరూపిస్తూ దేశంలోనే ఆదర్శంగా ఏపీ పోలీస్ వ్యవస్థ పని చేస్తోందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో బుధవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సీఎం అభినందించిన వీడియో క్లిప్‌ను రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం గురువారం మీడియాకు విడుదల చేసింది. ఏపీ పోలీసులు దేశానికి మార్గదర్శకంగా నిలిచారని గర్వంగా చెబుతున్నట్లు సీఎం తెలిపారు. తప్పు చేస్తే సొంత సిబ్బందిని సైతం ఉపేక్షించకపోవడం వల్ల పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం, గౌరవం పెరుగుతోందన్నారు.

**సీఎం అభినందన మరింత స్ఫూర్తి నింపింది: డీజీపీ గౌతమ్ సవాంగ్**



ఏపీ పోలీస్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ అభినందించడం మరింత స్ఫూర్తిని నింపిందని డీజీపీ గౌతమ్ సవాంగ్ 'సాక్షి'కి తెలిపారు. శాంతి భద్రతల నిర్వహణలో రాజీ లేకుండా వ్యవహరించాలని సీఎం సూచించారన్నారు. తప్పు చేస్తే పోలీసులపైనా చర్యలు తప్పవని పలు సందర్భాల్లో నిరూపించామన్నారు. ప్రజలకు పోలీసు సేవలను అందుబాటులోకి తెస్తూ సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభమైన 'ఏపీ సేవా యాప్' ఫలితాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఏపీ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా పని చేస్తోందనేందుకు ఏడాది వ్యవధిలో సాధించిన జాతీయ అవార్డులే నిదర్శనమన్నారు.

# ఎన్‌డీబీ రెండో విడత రీ టెండర్లలో 16 బిడ్లు

సాక్షి, అమరావతి: న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) సాయంతో తలపెట్టిన రాష్ట్రంలోని రహదారులు, వంతెనల పునర్నిర్మాణ పనులకు సంబంధించిన రెండో దశ రీ టెండర్లలో 16 బిడ్లు వచ్చాయి. తొలిదశలో నాలుగు జిల్లాల కోసం పిలిచిన రూ.682.16 కోట్ల విలువైన రీ టెండర్ల టెక్నికల్ బిడ్లను ఆర్ అండ్ బీ అధికారులు ఇటీవలే తెరిచారు. ఇప్పుడు రెండో దశలో భాగంగా ఐదు జిల్లాలకు సంబంధించిన రూ.792.76 కోట్ల విలువైన టెండర్లను గురువారం తెరవగా, 16 బిడ్లు దాఖలయ్యాయి. అధికారులు వీటిని పరిశీలించి అర్హత సాధించిన సంస్థల వివరాలను త్వరలో ప్రకటిస్తారు. అనంతరం రివర్స్ టెండర్లు నిర్వహిస్తారు.

**ఐదు జిల్లాల్లో పనుల విలువ, టెండర్లు దాఖలు చేసిన సంస్థలు**

| జిల్లా | టెండరు విలువ (రూ.కోట్లలో) | బిడ్లు దాఖలు చేసిన సంస్థలు |
|---|---|---|
| వైఎస్సార్ కడప | 122.19 | లెక్మాన్ అండ్ నితిన్ సాయి(జేవీ), కేపీసీ ప్రాజెక్ట్స్ |
| అనంతపురం | 128.39 | కేసీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రై.లి., సుధాకర ఇన్‌ఫ్రా, కేఎన్నార్ కన్‌స్ట్రక్షన్స్ |
| ప్రకాశం | 187.21 | రామలింగం కన్‌స్ట్రక్షన్స్, జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్, ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్స్, బాపూజీ సివిల్ కన్‌స్ట్రక్షన్స్ |
| చిత్తూరు | 126.15 | పీఎల్ఆర్-ఆర్‌సీఐపీఎల్ (జేవీ), కేఎన్నార్ కన్‌స్ట్రక్షన్స్, రిత్విక్ ప్రాజెక్ట్స్ |
| కర్నూలు | 228.82 | ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్, బీఎస్‌వీఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఎన్ఎస్‌పీఆర్ కన్‌స్ట్రక్షన్స్ |
| మొత్తం | 792.76 | |

## నిమ్మగడ్డ జిమ్మిక్కులు మానుకోవాలి

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



పెనగలూరు: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేష్ జిమ్మిక్కులు మానుకోవాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. వైఎస్సార్‌జిల్లా కొండూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ స్వగృహంలో గురువారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. కొరముట్ల మాట్లాడుతూ.. ఎస్ఈసీ టీడీపీకి సానుకూలంగా వ్యవహరిస్తూ ఎన్నికలు జరిపిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు ఆడించినట్లు ఎస్ఈసీ ఆడటం సరికాదని, ఆయన తన పదవికి రాజీనామా చేసి టీడీపీ తరఫున ఎంపీటీసీకో, జెడ్పీటీసీకో పోటీ చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. కొన్ని తోక పత్రికలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వం ఎన్నికలకు సన్నద్ధంగా లేకపోయినా ఎన్నికలు జరిపిస్తానని చెప్పడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ, మాజీ జెడ్పీటీసీ విజయ్‌రెడ్డి మాట్లాడారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు జరగవు: జేసీ



అనంతపురం క్రైం: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి జోస్యం చెప్పారు. గురువారం అనంతపురంలోని డీపీవోలో గన్‌మెన్ల కోసం ఎస్పీ బి.సత్యయేసు బాబును కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని నిమ్మగడ్డ ప్రయత్నిస్తున్నారని, అయితే ఎస్ఈసీపదవీ కాలం వచ్చే ఏడాది మార్చికి అయిపోతుందని, కానీ సీఎం వైఎస్ జగన్ పాలన మరో మూడేళ్లు ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్, ఆయన మంత్రులు, అనుచరులు ఎన్నికలపై కోర్టుకెళ్తారన్నారు. నంద్యాలలో సలాం కుటుంబం ఆత్మహత్యకు రాజకీయ రంగు పులమొద్దని జేసీ అన్నారు.

## కరోనాతో ప్రాణాలు పోతుంటే ఎన్నికలా?

**ఎన్నికల విధులకు సిద్ధంగా లేము: పీఆర్టీయూ**

సాక్షి, అమరావతి: కరోనాతో ప్రాణాలు పోతున్న సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకోవడం సరికాదని ప్రోగ్రెసివ్ రికగ్నయిజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి ప్రసాద్, మల్లు శ్రీధర్ రెడ్డిలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత కరోనా నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల విధులకు టీచర్లు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. గతంలో అతి తక్కువ కరోనా కేసులు ఉన్న సమయంలో ఎన్నికలు వాయిదా వేసి, ప్రస్తుతం వేలాది కేసులు ఉన్నప్పుడు ఎన్నికలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. కరోనాతో ఇటీవల అనేక మంది ఉపాధ్యాయులు మృతి చెందారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల భద్రతను దృష్టిలో పెట్టుకుని, తదనుగుణంగా ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నికి మెయిల్ ద్వారా లేఖ పంపినట్లు పేర్కొన్నారు.

# రెండో రోజూ రద్దు



- మరోసారి సమావేశాన్ని రద్దు చేసుకున్న ఎస్ఈసీ నిమ్మగడ్డ
- పలుమార్లు సంప్రదించాక రద్దు అయినట్లు సమాచారం

సాక్షి, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేష్‌కుమార్ నిర్వహించ తలపెట్టిన వీడియో కాన్ఫరెన్స్ మరోసారి రద్దు అయింది. తొలుత ఈ సమావేశం నాటకీయ పరిణామాల మధ్య బుధవారం నాడు రద్దు కాగా దీన్ని గురువారం నిర్వహిస్తామని పేర్కొన్న ఎస్ఈసీ తర్జనభర్జనల అనంతరం చివరికి రద్దు చేసుకున్నారు.

**చాంబర్‌లోనే నిమ్మగడ్డ..**

రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం పై అంతస్తులో ఉన్న ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఉదయం 10 – 12 గంటల మధ్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు కమిషనర్ కార్యాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే సమావేశాన్ని రద్దు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం అధికారులెవరూ సమాచారం ఇవ్వకపోవడంతో కొద్దిసేపు హైడ్రామా నడిచింది. ఎస్ఈసీ నిమ్మగడ్డ నిర్ణీత సమయానికి అక్కడకు వెళ్లకుండా తన చాంబర్‌లోనే ఉండిపోయారు. 10.10 గంటల ప్రాంతంలో ఎన్ఐసీ కార్యాలయ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌పై ఆరా తీశారు. తొలుత గంట తర్వాత సమావేశం ప్రారంభమవుతుందని ఎస్ఈసీ కార్యాలయ వర్గాలు సమాచారం ఇవ్వగా 11.45 వరకు కూడా అలాంటి సూచనలు లేకపోవడంతో ఎన్ఐసీ అధికారులు మరోసారి ఫోను ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందన లేదని తెలిసింది. అనంతరం 11.50 గంటల ప్రాంతంలో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం రద్దు అయినట్లు ఎస్ఈసీ కార్యాలయ వర్గాలు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

**కరోనా సమయంలో సరికాదన్న సీఎస్**

తొలిరోజు రద్దు చేసుకున్న సమావేశాన్ని మర్నాడు నిర్వహిస్తానంటూ నిమ్మగడ్డ బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇవ్వగా ఆమె అదే రోజు వెంటనే బదులిచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో నెలకొన్న కరోనా పరిస్థితుల వల్ల ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించేందుకు అనువైన పరిస్థితులు లేవని తెలియచేసిన సీఎస్.. ఎన్నికల నిర్వహణపై ఎస్ఈసీ ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు సిద్ధం కావటంపై అభ్యంతరం తెలిపారని పేర్కొన్నాయి. మరోవైపు ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్ గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్లినట్లు తెలిసింది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

శ్రీ బయో ఎస్థెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా గల ప్రముఖ అగ్రి బయోటెక్ కంపెనీ వారికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అన్ని జిల్లాల అగ్రిసెంటర్స్‌లలో పనిచేయుటకు ఈ క్రిందివారు కావలెను.
ఫీల్డ్ & సేల్స్ అసిస్టెంట్స్
అర్హత : 10వ తరగతి లేదా ఇంటర్ పాస్ / ఫెయిల్. పెస్టిసైడ్స్, సీడ్స్ ఫెర్టిలైజర్స్ మరియు బయో సేల్స్ నందు అనుభవం గలవారికి ప్రాధాన్యత.
ఆసక్తిగలవారు తమ బయోడేటాను e-mail:sribioaesthetics2017@gmail.com కు లేదా 6309981055 కు పంపగలరు.
Plot No.50, Jayabheri Enclave, Saanvi Classic, 1st floor, Gachibowli, Hyderabad-500032. Ph : 6309981055

WANTED LECTURERS
To teach B.Sc., BCA, BBA, B.Com. classes in the following subjects in our Degree Colleges at North Andhra and Godavari Districts.
MATHS · PHYSICS · CHEMISTRY · COMPUTERS · STATISTICS · ELECTRONICS · MICROBIOLOGY · BIOCHEMISTRY · BIOTECHNOLOGY · FORENSIC SCIENCE · COMMERCE · MANAGEMENT · ARTIFICIAL INTELLIGENCE · HOTEL MANAGEMENT · DATA SCIENCES · ANIMATION · ENGLISH & TELUGU · LIBRARY SCIENCE
ARITHMETIC · REASONING · SOFTSKILLS
ATTRACTIVE SALARY FOR DESERVING CANDIDATES
Interested candidates may send their resume to career@aditya.ac.in within 5 days
ADITYA DEGREE COLLEGES
H.O. KAKINADA | www.aditya.ac.in/degree
Ph:0884-2376665, 2385359, 9704376667

SRI VASAVI ENGINEERING COLLEGE
(An Autonomous Institute permanently affiliated to JNTUK, Kakinada)
(Accredited by NAAC with 'A' Grade & NBA Accreditation for 4 UG Programmes)
Pedatadepalli, TADEPALLIGUDEM - 534 101. W.G.Dist. (A.P.)
Ph: 08818-284355, 94400 72234 Web: www.srivasaviengg.ac.in
WALK-IN-INTERVIEW
'Sri Vasavi' a reputed institution in technical education, is looking for qualified and committed persons for Faculty position in various engineering departments of our college. Interested candidates can attend for Walk-in Interviews to be conducted on the date mentioned below.

| Post | Department | Qualification Details | Interview Date |
|---|---|---|---|
| Asst. Professor | EEE, MECH, CSE & CST | As per AICTE Norms. Preference will be given for the candidates who have 1st Class in both UG & PG Levels. | 22-11-2020 (Sunday) 10.00 AM |

Pay Scales: As per the Norms. Higher starting pay may be offered to deserving candidates on recommendation of the selection committee.
Candidates are informed to bring their resume, original certificates of qualifications, experience, one set of xerox copies of certificates, project work of their UG/PG and a passport size photograph.
Ch.V.V. Subba Rao, B.Sc., Secretary & Correspondent.

సాక్షి

శుక్రవారం, నవంబర్, 20

# మళ్లీ మహమ్మారి విజృంభణ

కరోనా వైరస్ మహమ్మారి ఇప్పట్లో విరగడయ్యేలా లేదని తాజాగా దేశ రాజధాని నగరం తల్లడిల్లుతున్న తీరు చూస్తే అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోసహా చాలాచోట్ల ఆ వైరస్ బాధితుల సంఖ్య గణనీయంగా తగ్గిన మాట వాస్తవమే. కొత్తగా వస్తున్న కేసుల సంఖ్య, రికవరీ రేటు గమనిస్తే అది శాంతించిన వైనం కనబడుతోంది. కానీ ఏమాత్రం నిర్లక్ష్యంగా వుండటం మంచిది కాదని ఢిల్లీ పరిణామాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఢిల్లీలో స్వైరవిహారం చేస్తున్న కరోనా వైరస్ ఏ దశకు సంబంధించిందో నిర్ధారణగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. అది రెండో దశ అని కొందరూ, మూడో దశ అని కొందరూ అంటున్నారు. దశ ఏదైనా అది ఇంతకుముందుకన్నా రెచ్చిపోతున్నదని తెలుస్తూనేవుంది. కరోనా ముప్పు తప్పిందని ఢిల్లీ ఆరోగ్యమంత్రి ఈ నెల మొదట్లో ప్రకటించారు. అందులో అసత్యమేమీ లేదు. ఆయన ప్రకటించిననాటికి అక్కడ మరణాల రేటు కేవలం 0.3శాతం. కానీ ఆ తర్వాతినుంచి అంతా తారుమారైంది. గురువారంనాటి గణాంకాలే ఇందుకు సాక్ష్యం. గత 24 గంటల్లో ఆ మహానగరంలో 131మంది మరణిస్తే యాక్టివ్ కేసుల సంఖ్య 42,458. ఈ నెల 11న అక్కడ రికార్డు స్థాయిలో 8,593 కేసులు నమోదయ్యాయి. అటు తర్వాత ఆ సంఖ్య పెరుగూనేవుంది. బుధవారం కూడా 7,486 కేసులు బయటికొచ్చాయి. మొత్తంగా పక్షంరోజుల్లో లక్ష కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రత తెలుస్తుంది. అత్యవసర కేసుల్ని సైతం చూడలేమని అక్కడి ఆసుపత్రులు చేతులెత్తేస్తున్నాయి. గడ్డుస్థితిలో వున్నవారికి ఐసీయూ సంగతలావుంచి...సాధారణ బెడ్ ఇవ్వడం కూడా సాధ్యపడదని చెబుతున్నాయి. రోగుల కోసం వెయిటింగ్ లిస్టులు రూపొందిస్తున్నాయి. గుండెపోటు వచ్చి ఆసుపత్రికి వచ్చిన ఒక రోగి గంటల తరబడి కారిడార్‌లోని కుర్చీలో కూలబడి చికిత్స కోసం ఎదురుచూస్తున్న దిగ్భ్రాంతికర దృశ్యం జాతీయ చానెళ్లలో ప్రసారమైంది. రోగికేమైనా జరిగితే వైద్యుల్ని నిందిస్తారు గనుక... వచ్చిన రోగుల్ని వెనక్కు పంపేస్తున్నామని ఒక ఆసుపత్రి సంజాయిషీ ఇస్తోంది. ఢిల్లీలోని ప్రధాన ఆసుపత్రుల్లో ఐసీయూ బెడ్‌లలో 90 శాతంమించి ఇప్పటికే నిండిపోయాయి. సాధారణ బెడ్‌లు సైతం 95శాతం పైనే నిండివున్నాయని గణంకాలు చెబుతున్నాయి. రోజుకు దాదాపు 8,000 కేసులు నమోదవుతుంటే...అందులో కనీసం 600మంది వరకూ ఐసీయూలో చేరవలసిన అవసరం కనబడుతోంది.

నవంబర్ నెల వచ్చిందంటే ఢిల్లీకి ఏటా గండమే. అప్పటికల్లా చలిపులి తడాఖా మొదలవుతుంది. సరిగ్గా అప్పుడే పండగల సీజన్ కూడా ప్రవేశిస్తుంది. ప్రార్థనా మందిరాలవద్ద, దుకాణ సముదాయాల్లో జనసందోహం పెరుగుతుంది. దీపావళి వంటి వేడుకల గురించి చెప్పనవసరమే లేదు. పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా అప్పుడే. మరోపక్క ఎప్పుడూ వుండే వాహనాల కాలుష్యం మామూలే. ఇవన్నీ ఒకేసారి విరుచుకుపడి అసలే అంతంతమాత్రంగా వున్న పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి. ప్రజలకు నచ్చజెప్పి ఒప్పించాల్సిన నాయకులే అర్థరహితమైన తర్కాలకు దిగి వారిని రెచ్చగొడుతున్నారు. కరోనా చుట్టుముట్టి కబళించడానికి సిద్ధమైన ఈ తరుణంలో కూడా తమ రాజకీయ స్వప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి వెరవడం లేదు. వీటన్నిటి పర్యవసానంగానే ఇప్పుడు ఢిల్లీ ప్రమాదంలో పడింది. ఈ కారణాలేవీ ప్రభుత్వాల ఊహకందనివి కాదు. దేశ రాజధాని కావడం వల్ల అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఢిల్లీ ప్రభుత్వమూ కూడా తమ తమ స్థాయిల్లో పరిస్థితులేమిటన్నది పర్యవేక్షిస్తుంటాయి. కానీ కరోనాను అరికట్టే విషయంలో ఆ రెండూ విఫలమయ్యాయి. ఆ వైరస్ చుట్టుముట్టి ఇప్పటికి తొమ్మిది నెలలు దాటుతోంది. అందరికీ అది కావలసినన్ని చేదు అనుభవాలు మిగిల్చింది. పైపెచ్చు ప్రపంచ దేశాలన్నిటా మళ్లీ అది పంజా విసురుతోంది. ఇవి చాలదా అప్రమత్తంగా వుండటానికి, ముందస్తు చర్యలు తీసుకోవడానికి? కానీ ఢిల్లీలో అవి కాస్తయినా కనబడలేదు. మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని చెప్పారే తప్ప, అవి చాలినంతగా లేవని ఇప్పుడు నెలకొన్న పరిస్థితులు చెబుతున్నాయి. ముప్పు ముంచుకొచ్చాక కారణం మీరంటే మీరని ఇప్పుడు కేంద్రమూ, ఢిల్లీ ప్రభుత్వమూ పరస్పరం నిందించుకుంటున్నాయి. ఢిల్లీ ప్రజల్లో కరోనా ప్రమాదం గురించిన అవగాహన ఏమేరకుందో ఈమధ్య జరిగిన సర్వేయే తెలియజెప్పింది. ఇమ్యూనిటీ పెంచుకున్నాం గనుక కరోనా తమనేం చేయదని కొందరంటే... అది అందరికీ వస్తుంది, భయమెందుకని మరికొందరు చెప్పారు. చాలామందికి అసలు మాస్క్ అవసరమే తెలియలేదు. మాస్క్ ధరించనివారికి రూ. 2,000 జరిమానా విధిస్తామని వ్యాధి విజృంభణ మొదలయ్యాక ఢిల్లీ ప్రభుత్వం చెబుతోంది.

వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనను దశాబ్దాలుగా పాలకులు నిర్లక్ష్యం చేశారు. అదిప్పుడు శాపంలా వెంటాడుతోంది. ఎంతటి అనారోగ్య సమస్య ఏర్పడినా పౌరులు ఆర్థికపరమైన చిక్కుల్లో పడకుండా దాన్నుంచి సురక్షితంగా బయటపడాలని ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలకు నిర్దేశించింది. అందుకోసం 2030నాటికల్లా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఒకటైన 'అందరికీ అన్నిచోట్లా సార్వత్రిక ఆరోగ్య సదుపాయం' లభించాలని... ఆ దిశగా ప్రభుత్వాలు మౌలిక రంగ సదుపాయాలను మెరుగుపరుచుకోవాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో ప్రక్షాళన ప్రారంభించింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో సమూల మార్పులు తెచ్చి 1.42 కోట్ల కుటుంబాలకు ఆరోగ్యభరోసా కల్పించాలని సంకల్పించింది. పాఠశాలల మాదిరే ఆరోగ్యరంగంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రులను తీర్చిదిద్దబోతున్నారు. ఇప్పుడు ఢిల్లీ మాత్రమే కాదు...ఉత్తరాదిలోని మరికొన్ని నగరాలకు కూడా కరోనా ముప్పు పొంచివుందని గత నాలుగైదురోజుల పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఈ విషయంలో మిగిలిన రాష్ట్రాలు కూడా మేల్కొని ముందస్తు చర్యలకు ఉపక్రమించాలి.

# అమెరికా ఎన్నికలు.. ఆంధ్రా రాజకీయం!

విశ్లేషణ



దానీ

**తను ఓడిపోతే అమెరికాలో అరాచక శక్తులు రాజ్యం చేస్తాయనీ, శ్వేతజాతీయులకు భద్రత కరువవుతుందని ట్రంప్ గట్టిగా ప్రచారం చేసినా.. అమెరికా ఓటర్లు ట్రంప్‌నే పక్కన పడేశారు. అలాగే తనకు ఓటేయకపోతే రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులు ఆగిపోతాయని, అరాచక శక్తులు రాజ్యం చేస్తాయనీ చంద్రబాబు కూడ గత ఎన్నికల్లో ఉధృతంగా ప్రచారం చేశారు. కానీ ఆంధ్రప్రదేశ్ ఓటర్లు ఆయన్నే అధికారం నుండి తొలగించారు. రాజధానిని మూడు విభాగాలుగా చేసి మూడు ప్రాంతాలకు పంచుతూ కొత్త ప్రభుత్వం తెచ్చిన ఆంధ్రప్రదేశ్ వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి బిల్ వెనుక 'వైవిధ్యం, భాగస్వామ్యం, అందర్నీ కలుపుకునిపోవడం' అనే సూత్రం ఉంది. దీన్ని పట్టించుకోకుండా ప్రజల ఆకాంక్షలను వమ్ముచేసి.. భద్రలోకం కోసం మాత్రమే పనిచేసే ప్రభుత్వాలకు అమెరికాలో అయినా, ఆంధ్రప్రదేశ్‌లో అయినా ప్రజలు ఒకేలా బుద్ధి చెబుతారు. అభద్రలోకం కోసం పనిచేసే ప్రభుత్వాలకు ప్రజలు పట్టం కడతారు.**

అమెరికాలో మార్క్సిస్టుల ప్రభావంతో 'బ్లాక్ లైవ్స్ మేటర్' అంటూ మొదలయిన ఉద్యమంలో ఫాసిస్టు వ్యతిరేక బృందాలు (యాంటిఫా), ముస్లింలు, శ్వేతజాతీయుల్లోని ఉదారవాదులు, డెమొక్రాట్స్ తదితరులు కలవడంతో అది ''ఆల్ లైవ్స్ మేటర్'' ఉద్యమంగా మారింది. ట్రంపిజాన్ని మొత్తంగా ఓడించకపోయినా దాన్ని అధిగమించి అధికార పీఠాన్ని మార్చగల శక్తిగా ఆవిర్భవించింది. అమెరికా ఉద్యమం ముందుకు తెచ్చిన 'వైవిధ్యం, భాగస్వామ్యం, అందర్నీ కలుపుకునిపోవడం' అనే విలువలకు వర్తమాన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ప్రాసంగికత వుంది. గత ప్రభుత్వాధినేత చంద్రబాబు తన బ్రాండ్ ఇమేజ్‌గా ప్రచారం చేసుకున్న పోలవరం, అమరావతి ప్రాజెక్టుల్లో ఈ సంబంధాన్ని మరింత స్పష్టంగా చూడవచ్చు.

పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం – 2014లో జాతీయ హోదా కల్పించారు. ఇందులో ఇరిగేషన్, హైడల్ పవర్ అనే రెండు కాంపోనెంట్లు వున్నాయి. హైడల్ పవర్ యూనిట్‌ను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించకూడదనుకున్న రాష్ట్ర ప్రభుత్వం దాన్ని తానే స్వయంగా నిర్మించాలనుకుంది. ఇక ఇరిగేషన్ కాంపోనెంట్ వరకు ఎంత ఖర్చయితే అంత నూటికి నూరు శాతం నిధుల్ని కేటాయించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. ఈ చట్టబద్ధ బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పించుకోజాలదు. ఇరిగేషన్ కాంపోనెంట్లో మళ్ళీ రెండు విభాగాలున్నాయి. మొదటిది ఆర్‌ఆర్ ప్యాకేజీ, రెండోది డ్యామ్ నిర్మాణం. 2019 ఫిబ్రవరి 18 నాటికి ఈ రెండు విభాగాల నిర్మాణ వ్యయం 55,548.87 కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. ఇందులో, ఆర్–ఆర్ ప్యాకేజీ, డ్యామ్ నిర్మాణ వ్యయాలు దాదాపు 60 శాతం, 40 శాతంగా వుంటాయి.

పోలవరం నిర్వాసితుల్లో అత్యధికులు ఆదివాసులు. 2013లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్రాజెక్టు ఆయకట్టులోనే పునరావాసం ఏర్పాటు చేయాలి. సహాయక, పునరావాస (ఆర్&ఆర్) ప్యాకేజీని సంపూర్ణంగా అమలు పరిచాకే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. కేంద్ర జలవనరుల శాఖకు చెందిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) నుండి నిర్మాణ బాధ్యతల్ని తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం ఆర్&ఆర్ ప్యాకేజీని పక్కన పెట్టి ఇరిగేషన్ కాంపోనెంట్ మీద దృష్టిని సారించింది. ఆ విభాగంలో దాదాపు 16 వేల కోట్ల రూపాయల ఖర్చుతో దాదాపు 70 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పుకుంది. అయితే ఆర్&ఆర్ ప్యాకేజీ విభాగంలో ఇప్పటివరకు నాలుగో వంతు కూడా ఖర్చుపెట్టలేదు.

దాదాపు ఈ కాలంలోనే రాజధాని ప్రాంత అభివృద్ధి సాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ద్వారా రాజధాని అమరావతి ప్రాజెక్టును చంద్రబాబు ప్రభుత్వం చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి చారిత్రకంగా కొన్ని ఒప్పందాలున్నాయి. 1937 నవంబర్ 16 నాటి శ్రీభాగ్ ఒప్పందంలో 'వైవిధ్యం, భాగస్వామ్యం, అందర్నీ కలుపుకుని పోవడం' అనే ప్రాతిపదికన రాయలసీమ, మధ్య ఆంధ్రా, ఉత్తరాంధ్రాలకు రాజధాని, హైకోర్టు, యూనివర్శిటీలను పంచుకున్నారు. ఆ ప్రకారం 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. 1956లో మరో



పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం హైదరాబాద్ స్టేట్‌లోని తెలంగాణ ప్రాంతం, ఆంధ్రరాష్ట్రం కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడ్డాయి. 2014 లో మళ్ళీ పునర్ వ్యవస్థీకరణ జరిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి అలనాటి ఆంధ్రరాష్ట్రం విడిపోయింది. అంటే శ్రీభాగ్ ఒప్పందం మళ్ళీ అమల్లోకి రావాలి. కానీ, అలా జరగలేదు. రాజధాని విభాగాల మీద రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు హక్కులు లేకుండా శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలన్నింటినీ అమరావతిలోనే నెలకొల్పే ప్రయత్నాలు సాగాయి. ఇవి అత్యంత సహజంగానే రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో నిరసనలకు దారి తీశాయి. వారు తమదైన రోజు కోసం ఎదురు చూశారు. ఆ ప్రాంతాల 'విద్యావంతుల వేదికలు', 'డెవలప్‌మెంట్ ఫోరం'ల నినాదాల సారాంశం కూడా 'వైవిధ్యం, భాగస్వామ్యం, అందర్నీ కలుపుకునిపోవడం'.

గత ప్రభుత్వం పోలవరం, అమరావతుల్లో అనుసరించిన అభివృద్ధి నమూనాలను గమనిస్తే అడవి, మైదానాల మధ్య వివక్ష ఏ స్థాయిలో సాగిందో అర్థం అవుతుంది. అమరావతి ప్రాజెక్టులో సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ అంటూ భూ సమీకరణ పథకాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయ భూముల్ని పారిశ్రామిక, వాణిజ్య, నివాస భూములుగా మార్చి స్థానిక భూ యజమానుల సంపదను పెంచే పథకాలను రచించారు. పోలవరంలో ల్యాండ్ పూలింగ్ స్కీమూ లేదు; భూసేకరణ పథకాన్ని అమలుచేసే నిజాయితీ లేదు. స్థానికుల సంపదను పెంచే ఊసే లేదు. ఫలితంగా, పోలవరం ముంపు మండలాల్లో 'వైవిధ్యం, భాగస్వామ్యం, అందర్నీ కలుపుకునిపోవడం' వంటి నినాదాలు ముందుకు వచ్చాయి.

తను ఓడిపోతే అమెరికా కమ్యూనిస్టుల పాలవుతుందని, అరాచక శక్తులు రాజ్యం చేస్తాయనీ, శ్వేతజాతీయులకు భద్రత కరువవుతుందని ఈసారి ఎన్నికల్లో ట్రంప్ గట్టిగా ప్రచారం చేశారు. కానీ అమెరికా ఓటర్లు ట్రంప్‌నే పక్కన పడేశారు. దాదాపు ట్రంప్ పద్ధతుల్లోనే తనకు ఓటేయకపోతే రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులు ఆగిపోతాయని, అరాచక శక్తులు రాజ్యం చేస్తాయనీ చంద్రబాబు కూడా గత ఎన్నికల్లో ఉధృతంగా ప్రచారం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఓటర్లు వారినే అధికారం నుండి తొలగించారు.

ఆ ప్రాంతాల్లోని 87 శాతం అసెంబ్లీ సీట్లలో గత అధికార పార్టీ ఓడి పోయింది. ఎన్నికల్ని ప్రజాభీష్టానికి భారమితిగా భావిస్తే, అమరావతి పోలవరం ప్రాజెక్టుల గురించి బాబు చేసిన ప్రచారంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆసక్తి లేదని తేలిపోయింది. యాదృచ్ఛి కమే కావచ్చు గానీ, రాజధానిని మూడు విభాగాలుగా చేసి మూడు ప్రాంతాలకు పంచుతూ కొత్త ప్రభుత్వం తెచ్చినది ఆంధ్రప్రదేశ్ డీసెం ట్రలైజేషన్ అండ్ ఇంక్లూజివ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆల్ రీజియన్స్ బిల్ వెనుక 'వైవిధ్యం, భాగస్వామ్యం, అందర్నీ కలుపుకునిపోవడం' అనే సూత్రం వుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అధికశాతం రాజకీయ పార్టీలకు విజయవాడ, గుంటూరుల్లో ఆర్థిక పునాదులున్నాయి. అవి విజయవాడ, గుంటూరు రంగు కళ్ళద్దాల నుండి రాష్ట్రాన్ని చూడడం మొదలెట్టాయి. రాష్ట్రంలో మరో 11 జిల్లాలున్నాయని గత ఎన్నికల్లో ప్రజలు గుర్తు చేసినా ఆ పార్టీలకు అర్థం కాలేదు. రాజధానికి చెందిన రెండు విభాగాలను అమరావతి నుండి తరలించడాన్ని నిలిపివేయాలంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు ఇటీవల హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. అంతటి స్థిర నిర్ణయాన్ని వారు పోలవరం ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీ విషయంలో ప్రదర్శించలేకపోయారు. ఏమిటీ దీని అర్థం?

పెట్టుబడిదారీ వ్యవస్థ పుంజుకుంటున్న దశలో ప్రాజెక్టులకు గొప్ప గౌరవం వుండేది. ఆధునిక దేవాలయాలు అని కొనియాడేవారు. అదొక దశ. సరళీకృత ఆర్థిక విధానం విజృంభించాక ప్రాజెక్టుల లోపల దాగున్న చీకటి కోణాలు వెలుగులోనికి రావడం మొదలయింది. ప్రాజెక్టులు భౌగోళికంగా ధనిక, పేద వర్గాల మధ్య ఒక విభజన రేఖను గీస్తాయి. పోలవరం ప్రాజెక్టు ఆయకట్టులోని భూ యజమానులకు నిస్సందేహంగా వరమే; కానీ రిజర్వాయర్ ముంపు ప్రాంత నివాసులకు అది శాపం. నీటిపారుదల ప్రాజెక్టులు వ్యవసాయ భూములున్నవారి సంపదను పెంచడమేగాక భూమిలేనివాళ్ళ కష్టాలనూ పెంచుతాయి. అమరావతి ప్రాజెక్టు వల్ల విజయవాడ గుంటూరు నగరాల్లో భూముల ధరలు, ఇళ్ళ అద్దెలు భారీగా పెరిగిన మాట వాస్తవం. కానీ, స్వంత భూమిలేక అద్దె ఇళ్లలో వుండేవాళ్ళ పరిస్థితి ఏమిటీ? అంచేత, ఆధునికానంతర కాలంలో ప్రాజెక్టుల మీద పునరాలోచనలు మొదలయ్యాయి. ప్రాజెక్టులవల్ల లబ్ధిపొందని సామాజిక వర్గాలకు నగదు బదిలీ చేయాలనే ప్రతిపాదనలు ఈ నేపథ్యంలోనే వచ్చాయి.

ఈ సందర్భంలో ప్రస్ఫుటంగా కనిపించే అమానుషం ఏమంటే ప్రాజెక్టులవల్ల లబ్ధిపొందిన వర్గాలు నగదు బదిలీ పథకాలని 'పప్పు బెల్లాలు' అంటూ హేళన చేస్తాయి. 'పప్పుబెల్లాల' పంపిణీలవల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిపోతున్నదని పెద్ద గోల చేస్తాయి. ఇది ఆర్థిక అహంకారం. వాళ్ళ దృష్టిలో అభివృద్ధి అంటే భద్రలోకం సంపదను మరింతగా పెంచడం మాత్రమే. ఇది అసలు సిసలు ఆర్థిక అహంకారం. భద్రలోకం కోసం పనిచేసే ప్రభుత్వాలకు అమెరికాలో అయినా, ఆంధ్రప్రదేశ్‌లో అయినా ప్రజలు ఒకేలా బుద్ధి చెపుతారు. అభద్రలోకం కోసం పనిచేసే ప్రభుత్వాలకు ప్రజలు పట్టం కడతారు.

రచయిత సీనియర్ పాత్రికేయులు, సమాజ విశ్లేషకులు
మొబైల్ : 90107 57776

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## అభినయం



అందరినీ ట్రోల్ చేసే బీజేపీ నేతల తీరు చిత్రంగా ఉంటుంది. దేశంలో అందరి కన్నా వారికే కండబలం, ధనబలం దండిగా ఉన్నా.. బాధితుల్లా మాట్లాడతారు. బానిసత్వాన్ని, బాధలను, వివక్షను... ఇలా అన్నిటినీ ఒకేసారి ఎదుర్కొంటున్నట్టు అరుస్తారు. – ధ్రువ్ రాఠీ, యూ ట్యూబర్

## వాస్తవం



ఎగుమతులు పడిపోయాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. అంతర్జాతీయంగా సహ పోటీదారులకన్నా మన దేశం బాగా వెనకబడింది. కేంద్రం ప్రచారం చేస్తున్న అసత్యాల ముసుగు తొలగిపోయింది. – సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

## బహుపరాక్



ఇండోర్‌లో ఒక ఆభరణాల దుకాణంలో పనిచేసే మొత్తం 31 మందికీ కరోనా వైరస్ సోకిందని తాజా వార్త. దీపావళి, ధన్‌తేరస్‌లలో ఆ దుకాణానికెళ్లి ఆభరణాలు కొనుగోలు చేసినవారి జాడ తెలుసుకునేందుకు ఇప్పుడు స్థానిక ఆరోగ్య విభాగం అధికారులు ప్రయత్నిస్తున్నారు. కరోనా వైరస్‌ను తేలిగ్గా తీసుకుంటున్నవారు ఇకనైనా అప్రమత్తంగా వుండాలి. జనం గుమిగూడే చోట్లకు అసలు వెళ్లకూడదు. – అజయ్‌కామత్, కంటి వైద్యుడు

## స్కాం బాబు



దేశంలో బొగ్గే లేనట్టు కమీషన్ల కోసం ఇనామీలతో దిగుమతి చేయించాడు బాబు. ప్రైవేటు కరెంటు కంపెనీలకు యూనిట్‌కు రూ. 4 ఎక్కువ చెల్లించి వాటాలు తీసుకున్నాడు.ఏడాదిలో విద్యుత్తు రంగాన్ని దేశంలోనే 3వ స్థానంలో నిలపడం సీఎం వైఎస్ జగన్ పాలనా దక్షతకు నిదర్శనం. – వి. విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

## మారిన మనిషి



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్ నిరుడు ఒక సమావేశంలో చైనా గురించి ఎవరో ప్రశ్నిస్తే అది మనకు పోటీయే కాదని, వారివల్ల ప్రమాదమేమీ వుండదని కొట్టిపారేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పుడాయన ఇండో–పసిఫిక్ వ్యూహం గురించి మాట్లాడుతున్నారు. అంటే చైనా నుంచి ప్రమాదం వున్నదని ఆయన గుర్తించారన్న మాట. – బ్రహ్మ చెలానీ, కాలమిస్టు

## అమానుషం



అఫ్గానిస్తాన్‌లో ఆస్ట్రేలియా దళాలు సాగించిన హత్యాకాండ ఊహకందనిది. అర్ధరాత్రుళ్లు దాడులు చేసి 39 మంది సాధారణ పౌరులను అపహరించి, చిత్రహింసలు పెట్టి హతమార్చడం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఐసిస్ ఉగ్రవాదులకన్నా వీరేమాత్రం తీసిపోరని ఈ ఘాతుకాలు నిరూపిస్తున్నాయి. 2014లో బ్రిటన్ దళాలు సైతం అఫ్గాన్‌లో ఇలాగే చేశాయి. ఇంతవరకూ వారిపై ఎలాంటి చర్యలూ లేవు. – నికోలా కరీం, బీబీసీ జర్నలిస్టు

## వహ్వా!



ఢిల్లీలోని మహిళా కానిస్టేబుల్ సీమా ధాకా తన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా అత్యంత సాహసోపేతంగా పనిచేసి అదృశ్యమైన 76 మంది పిల్లలను 3 నెలల్లో ముష్కరుల బారి నుంచి కాపాడింది. ఇప్పుడు వారంతా తమ కుటుంబాలతో సంతోషంగా ఉన్నారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ నిబంధనలు కూడా పక్కన బెట్టి ఈ సాహసికి పదోన్నతి కల్పించడం హర్షించదగ్గది. ఇలా పదోన్నతి ఇవ్వడం ఢిల్లీలో అత్యంత అరుదైనది. సీమ నిజంగా అద్భుతమైన పోలీస్. – రోహిణి సింగ్, సీనియర్ జర్నలిస్టు

## గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, తిథి శు.షష్ఠి రా.1.55 వరకు, తదుపరి సప్తమి నక్షత్రం ఉత్తరాషాఢ ప.2.21 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం సా.6.22 నుంచి 8.01 వరకు, దుర్ముహూర్తం ఉ.8.23 నుంచి 9.10 వరకు, తదుపరి ప.12.06 నుంచి 12.51 వరకు అమృతఘడియలు... ఉ.8.03 నుంచి 9.34 వరకు.

**సూర్యోదయం :** 6.11
**సూర్యాస్తమయం:** 5.20
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

## ఇన్‌బాక్స్

### అచ్చెన్నాయుడు డూడూ బసవన్నేనా?

తిరుపతి లోక్‌సభకు జరగనున్న ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిగా పనబాక లక్ష్మి పేరును టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బీసీలకు చెందిన అచ్చెన్నాయుడిని చేశామని టీడీపీ గొప్పలు చెప్పుకొంటోంది. మరి, తిరుపతి లోక్‌సభకు ఉప ఎన్నికలో, పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థిని ప్రకటించడంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిపేరు, ప్రమేయం ఎక్కడా కనబడకపోవడం విచిత్రం. బీసీ తదితర పీడిత కులాలకు చెందిన వ్యక్తులు ఏ స్థానంలో ఉన్నా ఆధిపత్య కుల పార్టీల నాయకుల వ్యవహారశైలి ఎలా ఉంటుందో, బహుజన వర్గాల వ్యక్తుల పదవులు ఎంతటి డొల్ల పదవులో చంద్రబాబు తాజా ప్రకటన బహిర్గతం చేస్తోంది. 'గులాంగిరీ'కి అలవాటు పడిపోయిన అచ్చెన్నాయుడు ఉలకడు, పలకడు. మరిప్పుడూ 'డూడూ బసవన్న'లాగే తల ఊపుతాడా?

అణచబడ్డ కులాల యెడల ఆధిపత్య కులాల పార్టీల నాయకులు ఒలకపోసే ప్రేమలూ, అభిమానాలూ, పొగడ్తలూ, లేదా, విదిలించే పదవులూ, రాయితీలూ–అన్నీ ఓటు బ్యాంక్ రాజకీయాల్లో అంతర్భాగమే. కనుక బహుజనులు డొల్ల పదవులూ, తాత్కాలిక రాయితీలతో సంతోషించకుండా, ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధన దిశగా సాగిపోవాలి.

వై. కె., సామాజిక న్యాయ కేంద్రం,
రాష్ట్ర కన్వీనర్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్
మొబైల్ : 98498 56568

# అసమానతల ఫలితమే ఆ ఆత్మహత్య

సందర్భం



నీరా చాందోకె

ఢిల్లీలోని కులీనవర్గాలు చదువుకునే ఒక కాలేజీలో తెలంగాణ విద్యార్థిని ఐశ్వర్యారెడ్డి విషాద మరణం రాజకీయ, విద్యాపరమైన అజెండాలకు సంబంధించి భయానకమైన ప్రశ్నలను సంధించింది. ఆ విద్యార్థిని మరణాన్ని తప్పించలేకపోవడం కంటే మించిన గుండెపగిలే అంశం మరొకటి ఉండదు. ఆమె దుస్థితిని, దురవస్థను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కాస్తయినా అర్థం చేసుకుని ఉంటే ఆ విషాదమరణం సంభవించి ఉండేది కాదు. ఆత్మహత్యలు అకారణంగా సంభవించవు. అవి కుంగుబాటు, ఆందోళన, నిరాశకు సంబంధించిన ప్రతిఫలనాలుగా మాత్రమే కనిపించవు. ఈ డిజిటల్ యుగంలో సమానురాలిగా తాను పాల్గొనలేకపోవడంపై ఈ ప్రతిభావంత విద్యార్థినిని ఆవరించిన దుఃఖిత మనస్సును ఏ ఒక్కరూ ఎందుకు గమనించలేకపోయారు? నవ భారతాన్ని ప్రతిబింబించే డిజిటలీకరణ ఇప్పటికే సమాజంలో ముందంజలో ఉన్న వర్గాలకు కొత్త సౌకర్యం గానూ, అవకాశాలే లేని వర్గాలకు అత్యంత అసౌకర్యంగానూ దాపురించింది. సంపన్నులకు, నిరుపేదలకు మధ్య అగాధాన్ని పెంచడంలో డిజిటల్ డివైడ్ ఇప్పటికే స్పష్టంగా ప్రభావం చూపుతోంది.

దారిద్ర్యంపై గణాంకాలు ప్రపంచానికి కొత్తేం కాదు. దారిద్ర్యం అంటే గణాంకాలు మాత్రమే కాదు. అది సామాజికంగా ఉత్పత్తి, పునరుత్పత్తితో సంబంధముండే విశిష్ట దృగ్విషయం. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి, అధికోత్పత్తి, అల్పవినియోగం తయారుచేసిన వ్యవస్థ ఫలితమిది. ఇలాంటి అసమాన వ్యవస్థలో సామాజిక నిచ్చెన మెట్ల మీది నుంచి పేదలను అనివార్యంగా తోసివేస్తుంటారు. సమాజంలోని ఇతర పౌర బృందాలు పొందే అన్ని రకాల ప్రయోజనాలనుంచి పేదలను దూరం పెడుతుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే, దారిద్ర్య సృష్టి, పునఃసృష్టికి సంబంధించిన నేరవ్యవస్థే మన సమాజం. దీని ఫలితాలు గుండెల్ని పిండేస్తుంటాయి. ఇలాంటి ఒక పర్యవసానం ఒక విద్యార్థినిని తన ప్రాణం తీసుకునేలా ప్రేరేపించింది. ఆమె అసాధారణ ప్రతిభావంతురాలు. కానీ ఆమె ప్రతిభ, నైపుణ్యాలు, ఆమె ప్రయాణం చివరకు మరణం వైపే ఆమెను లాక్కుపోయాయి. అన్నీ కలిసివచ్చి ఉంటే ఆమె జీవితంలో సుదీర్ఘకాలం ప్రయాణించేది. గణిత శాస్త్రజ్ఞురాలిగా భారత విజయగాథల్లో ఆమె పేరు లిఖితమయ్యేది. కానీ తాను చదువుకుంటున్న కాలేజీలో తోటి విద్యార్థులకు ఉన్న సౌకర్యాలు లేకపోవడం వల్లే ఆమె జీవితం నుంచి తప్పుకుంది. ఒక ల్యాప్‌టాప్, ఒక స్మార్ట్‌ఫోన్ కూడా పొందలేకపోవడమే ఆమె జీవితాన్ని బలిగొంది. డిజిటల్ అవకాశాలను పొందలేకపోతున్న ఆ అవమాన భారంనుంచి ఆమె ఎంతగానో బాధపడి ఉంటుంది. తన నియంత్రణలో లేని పరిస్థితుల కారణంగా ఆమె డిజిటల్ భారత్‌లో భాగం కాలేకపోయింది. ఎలాంటి సౌకర్యాలూ లేని కుటుంబంలో పుట్టిన కారణంగా ఆమె ప్రతిభ, కఠోర శ్రమ విధివేతిలో వంచనకు గురయ్యాయి.

ఇతర సామాజిక అంశాలనుంచి దారిద్ర్యాన్ని మాత్రమే విడదీసి మనం మాట్లాడుకోవడం లేదు. మన రాజకీయ ప్రక్రియలో కానీ, మన విద్యా ప్రక్రియలో కానీ సమానత్వం ఘోరంగా వెనుకడుగు



వేస్తోంది. సమాజం తన సభ్యులకు ఏం ఇస్తోంది, సభ్యులు పరస్పరం ఎలా ఉంటున్నారు అనే కీలకమైన అంశంపై చర్చలేదే? తమ కండబలాన్ని ప్రదర్శించే జాతీయవాదంపైనే అందరూ దృష్టిపెడుతున్నారు. మన సొంత ప్రజానీకంలో ఎంతమంది నిరుపేదల విభాగంలో ఉంటున్నారో, ఎంతమంది దారిద్ర్యరేఖకు అతి సమీపంలో జీవనం సాగిస్తున్నారో ఈరోజు చాలా కొద్దిమందికే తెలుసు. ఇతరులతో సమాన స్థాయిలో ఉన్నప్పుడే, ఇతరులు గౌరవించడం ద్వారానే తమ స్వీయ గౌరవం నిలబడుతుందని భావించినప్పుడే శ్రమజీవులు తమ పని గొప్పతనాన్ని అర్థం చేసుకోగలరు.

కొంతమంది నమ్మశక్యం కానంత పేదలుగా ఉంటూ, మరికొంతమంది నమ్మశక్యం కానంత సంపన్నులుగా ఉంటున్న సమాజంలో ఏ ఒక్కరూ ఆత్మగౌరవాన్ని సాధించలేరు. అవకాశాలు పొందడంలో వెనుకబడిన వారు గౌరవప్రదమైన జీవితం గడిపగలిగే కనీస అవసరాలను కూడా తీర్చుకోలేరు. వీరు సామాజికంగా అడుగంటిపోతారు. అవమానాల పాలవుతారు. జీవితంలోని ప్రతి దశలోనూ అమర్యాదకు, అగౌరవానికి పాత్రులవుతుంటారు. పేదరికంలో ఉండటం అంటే సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వ్యవహారాల్లో సమానత్వ ప్రాతిపదికన అవకాశాలకు దూరమైపోవడమే.

సమాజంలో అంతర్గతంగా ఉంటున్న ఈ అసమానతలను తెలుసుకోకుండా దారిద్ర్యాన్ని మనం పరిశీలించగలమా? ఇలాంటి అసమానతలకో సంఘర్షించకుండా ఉన్నంతవరకు దారిద్ర్యం అనేది అసమాన సమాజంలోని ఉత్పత్తి, పునరుత్పత్తికి అనుగుణంగా మళ్లీ మళ్లీ ఉత్పత్తవుతూ, పునరుత్పత్తి చెందుతూ కొనసాగుతూనే ఉంటుంది. పౌరులు ఇతరుల అభిప్రాయాలను అంగీకరించి, గౌరవించే క్రమాన్ని విశ్వవిద్యాలయాలు తమ విద్యార్థులకు నేర్పుతూ వారిని ఉత్తమ పౌరులుగా మలుస్తుంటాయి. నేను సుదీర్ఘకాలంపాటు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయి తరగతులకు బోధిస్తూ వచ్చాను. కానీ మా విధిలో మేం విఫలమయ్యామనే వేదన నన్ను దహిస్తుంటుంది. తమ విద్యార్థులకు మంచి సమాచారం అందించడమొక్కటే టీచర్ పని కాదు. ఇప్పుడు విస్తృత సమాచారాన్ని పిల్లలు ఇంటర్నెట్ నుంచే పొందుతున్నారు. ఆ డేటాను విజ్ఞతతో ఉపయోగించడం ఎలాగో విద్యార్థులకు టీచర్ నేర్పాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవిత సూత్రాలను ఆ సమాచారం నుంచి ఎలా గ్రహించుకోవాలని అని పిల్లలకు చెప్పడమే టీచర్ బాధ్యత.

విప్లవాలను క్లాస్ రూమ్‌లు మాత్రమే బోధించే స్థితి పోయింది. నేటి ప్రపంచంలో విప్లవం అంటే రాజద్రోహం, దేశద్రోహం అయిపోతోంది. న్యాయమైన సామాజిక వ్యవస్థను రూపొందించడంలో ఇప్పుడు ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. కాని ఒక మార్గం మాత్రం మన మనస్సులను విశాలం చేసే కీలక బాధ్యత గురించి అప్రమత్తంగా ఉంటోంది. ఇతరులందరినీ గౌరవభావంతో చూస్తూ తాము కూడా గౌరవం పొందే జీవన సంస్కృతి వైపు ఈ కొత్త మార్గం విద్యార్థులను ప్రేరేపిస్తుంది. జాతుల సంపద గ్రంథ కర్త ఆడమ్ స్మిత్ ఏనాడో చెప్పినట్లు వ్యక్తి సమాజం కోసం కృషి చేస్తూనే తనకోసం కూడా స్వార్థ కాంక్షను కలిగి ఉంటాడన్నది వాస్తవం. అదే సమయంలో ప్రజల పట్ల సానుభూతి ప్రాధాన్యతను కూడా ఆయన ఎంత వివరంగా విశదీకరించారు. సానుభూతి అనేది ప్రజల మధ్య సౌహార్ద సంబంధాలను నెలకొల్పుతుంది. ఇతరుల కష్టాల పట్ల స్పందించే తత్వాన్ని అది ప్రేరేపిస్తుంది. తోటి మనిషికి జరిగిన హాని పట్ల మనం స్పందించేలా చేస్తుంది.

సమాజ భవిష్యత్తే ప్రజల భవిష్యత్తుగా భావించే దేశంలో మనం పుట్టి పెరిగాం. కరోనా మహమ్మారి సరిగ్గా దీన్నే స్పష్టం చేసింది. మన తోటి పౌరులు అభద్రతలో ఉన్నప్పుడు మనం భద్రతలో ఉండలేం. అందుకే సానుభూతికి చెందిన నైతిక మనోభావాన్ని మనం పెంచిపోషించాలి. సమానత్వానికి చెందిన శిఖరస్థాయి సూత్రం పైనే ఈ సానుభూతి నిర్మితమవ్వాలి. వర్శిటీలు ఇతరులతో అనుసంధానం చేసే సానుభూతి మార్గంలో నడిచేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సి ఉంది. దారిద్ర్యాన్ని, అధిగమించే ప్రయత్నంలో మరింత మంది విద్యార్థులు బలిదానాలు చేయడాన్ని భారత్ అనుమతించరాదు.

వ్యాసకర్త మాజీ ప్రొఫెసర్,
ఢిల్లీ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం
(ది వైర్ సౌజన్యంతో)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
# ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 20-11-2020



రేణు వాసావె

# పడవ మీద తిరిగే ప్రాణదాత

**మహారాష్ట్ర నందుర్బర్ జిల్లాలోని చిమల్‌ఖడీ అనే అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తుంది రేణు వాసావె. నర్మదా నది పరీవాహం చుట్టుపక్కల పల్లెల నుంచి గర్భిణులు, నవజాత శిశువులు ఆమె దగ్గరకు పరీక్షకు, ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారానికి వచ్చేవారు. కాని లాక్‌డౌన్ తర్వాత గత ఆరు నెలల నుంచి గర్భిణులు కరోనా భయంతో రావడం లేదు. అయితే వారిని నిర్లక్ష్యం చేయదలుచుకోలేదు రేణు. నర్మదా నదిలో తానే పడవ మీద తిరుగుతూ వారి వద్దకే వెళ్లి వస్తోంది. గత ఆరు నెలలు ఆమే వారి ఇంటికి వచ్చే ప్రాణదాతగా నిలిచింది.**

'సాయంత్రమైతే నా చేతులు లాగేస్తాయి. కాని పట్టించుకోను. గిరిజన మహిళల కోసం సేవ చేస్తున్నాన్న తృప్తి ఉంది నాకు' అంటుంది రేణు వాసవె. ఆమె ఒక సాదా సీదా అంగన్‌వాడీ వర్కర్. ప్రభుత్వం ఇచ్చే జీతం తీసుకుంటూ తను చేయవలసిన పనులేవో చేస్తే ఆమెకు వచ్చే ఢోకా ఏమీ లేదు. ఆమెకు వీలు లేని పని చేయకపోతే ఎవరూ ఏమీ అనరు కూడా. కాని ఆమె అలా ఊరికే ఉండలేదు. తన డ్యూటీ తాను సక్రమంగా చేయాలనుకుంది. నది మీద తిరిగే ప్రాణదాతగా మారింది.

**అడవి స్త్రీల కోసం**

రేణు పని చేస్తున్నది చిమల్‌ఖడి అనే ఏజెన్సీ ప్రాంతంలో. అక్కడి అంగన్‌వాడి కేంద్రానికి గతంలో అయితే చుట్టుపక్కల గర్భిణులు, బాలింతలు వచ్చి తమకు కావ



లిసిన పరీక్షలు చేయించుకుని ఇచ్చే రేషన్‌ను తీసుకెళ్లేవారు. కాని కోవిడ్ వల్ల వారి రాక పోకలు హటాత్తుగా ఆగిపోయాయి. కొత్తగా గర్భం దాల్చినవారు, పిల్లల్ని కన్నవారు అంగన్‌వాడి కేంద్రాలకు రావడం మానుకున్నారు. కాని వారి ఆరోగ్యాన్ని పరీక్షించడం, వారికి ప్రభుత్వం నుంచి అందే ఆహారం, సౌకర్యాలు అందించడం అంగన్‌వాడి వర్కర్‌గా రేణు విధి. అందుకే ఆమె తానే వారి దగ్గరకు వెళ్లాలని నిశ్చయించుకుంది. అయితే ఆ గిరిజన పల్లెలకు రోడ్లు సరిగా ఉండవు. కాని వాటన్నింటి గుండా నర్మదా నది ప్రయాణిస్తుంది. అందుకే రేణు తన ప్రాంత బెస్తవాళ్ల దగ్గర పడవను అద్దెకు తీసుకుంది. ఆ పడవలో తెడ్డు వేసుకుంటూ పల్లెలకు తిరగసాగింది.

**18 కిలోమీటర్లు**

రోజూ ఉదయం ఏడున్నరకే రేణు వాసవె తన అంగన్ వాడీ కేంద్రానికి వెళుతుంది. అక్కడి రోజువారీ పనులు ముగించుకుని మధ్యాహ్నం భోజనం చేసి పడవ మీద నర్మదా నదికి బయలుదేరుతుంది. నదిలో దాదాపు 9 కిలోమీటర్లు వెళ్లి 9 కిలో మీటర్లు వచ్చి, అంటే 18 కిలోమీటర్లు తిరుగుతుంది. ఆమె తిరిగేది మర పడవ కాదు. తెడ్లు వేయాల్సింది. ఒక్కోసారి ఆమె బంధువు, మరో అంగన్‌వాడి కార్యకర్త సంగీత తోడు వస్తుంది. పడవలో ఆమె రోజు గర్భిణులకు, చంటి పిల్లలకు ఇవ్వాల్సి ఆహారం, బరువు తూచే మిషన్ తీసుకువెళుతుంది. 'ప్రస్తుతం నేను 25 మంది చంటిపిల్లలను, 7 మంది గర్భిణులను పర్యవేక్షిస్తున్నాను' అంటోంది రేణు.

**ఈత వచ్చు**

రేణుకు నర్మద నదిపై ఒక్కతే పడవ నడపడం అంటే భయం లేదు. ఎందుకంటే చిన్నప్పటి నుంచి ఆమెకు ఈత వచ్చు. నది పై పడవ నడపడం కూడా వచ్చు. 'మా ఆయనకు ఈత రాదు. కొంచెం భయపడుతుంటాడు నా గురించి. నాకు ఇద్దరు పిల్లలు. వాళ్లు నన్ను మెచ్చుకుంటారు' అంటుంది రేణు. గత ఆరు నెలలుగా వారంలో ఐదు రోజులు పడవ మీద తిరుగుతున్న రేణుని చూసి గిరిజన మహిళలు చాలా సంతోషపడతారు. ఆమెను తమ ఆత్మీయురాలిగా భావిస్తారు. చంటి పిల్లల్ని చేతుల్లోకి తీసుకుని 'అత్త వచ్చింది చూడు' అని రేణును చూపిస్తారు.

అందరు ఉద్యోగులు ఇలా ఉండరు. ఇలాంటి వారే ఉద్యోగాలకు గొప్పతనాన్ని తెస్తారు. రేణు ఒక ఆత్మీయ బంధువు.

– సాక్షి ఫ్యామిలీ



**జ్యోతిని 'స్టార్' మదర్ అని గానీ..**
**'బిగ్' మదర్ అని గానీ.. అనాలి!**
**ఆమె కూతురు హారిక యూట్యూబ్ స్టార్.**
**అందుకే ఆమె స్టార్ మదర్.**
**హారిక ప్రస్తుతం బిగ్‌బాస్ కంటెస్టెంట్.**
**అందుకే ఆమె బిగ్ మదర్.**
**సింగిల్ మదర్‌గా అయితే మాత్రం..**
**జ్యోతిని బిగ్ స్టార్ మదర్ అనాలి!**
**ధైర్యంగా నిలబడ్డారు.**
**పిల్లల్ని తన సమాధానంగా పెంచారు.**

జ్యోతి, 'దేత్తడి' ఫేమ్ హారిక తల్లి. (హారిక ప్రస్తుతం బిగ్ బాస్ రియాల్టీ షో కంటెస్టెంట్‌గా బిగ్ బాస్ హౌస్‌లో ఉన్నారు)

# బిగ్ స్టార్ మదర్

''నా కూతురు అని చెప్పుకోవడం కాదు గానీ ఎంత క్రియేటివ్‌గా ఆలోచిస్తుందో.. అంత హార్డ్ వర్క్ చేస్తుంది. ఇంటి పరిస్థితులను, నన్ను బాగా అర్థం చేసుకుంటూ పెరిగింది. ఎవరైనా ఏ కొంచెం తనను ఇన్‌సల్ట్ చేసినా గెలిచి చూపాల్సిందే అని పట్టుపడుతుంది'' అని కూతురు హారిక గురించి చెబుతూ మురిసిపోయారు జ్యోతి. ఆమె సింగిల్ మదర్. కూతురు అలేఖ్య హారిక, కొడుకు వంశీ కార్తీక్‌తో హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రధానంగా సింగిల్ మదర్‌గా ఆమె ఎదుర్కొన్న ఆటుపోట్లు, పిల్లల పెంపకం గురించి 'సాక్షి' ఆమెతో ముచ్చటించింది.

**చదువు గురించే ఆలోచన**

''పిల్లలకు డబ్బు విలువ బాగా తెలుసు. అమ్మ కష్టపడుతుంది. మనం ఇంకా ఎక్కువ కష్టపెట్టకూడదు అనేది ఇద్దరూ చిన్నతనం నుంచీ అర్థం చేసుకున్నారు. పిల్లలు చదివే స్కూల్‌లోనే టీచర్‌గా చేశాను. బ్యాంక్ ఉద్యోగిగా కొన్నాళ్లు పనిచేశాను. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేశాను. కుటుంబ పెద్ద ఇంటిని పట్టించుకోకపోతే ఎలాంటి అవస్థలు ఎదుర్కోవలసి వస్తుందో అన్నీ ఎదుర్కొన్నాను. తప్పనిసరై తొమ్మిదేళ్ల క్రితం ఓ రోజు పిల్లల్తో పాటు ఇంటి నుంచి బయటకు వచ్చేశాను. ఆ సమయంలో మొదటగా ఆలోచించింది వాళ్ల చదువులు, వాళ్ల ఫీజుల గురించే. గత మేదైనా అది పిల్లల చదువులపై ప్రభావం పడకూడదు అని ఆ రోజే గట్టిగా అనుకున్నాను.

**వేలెత్తి చూపినవారే..!**

''నా చేతిలో ఎం.ఏ సర్టిఫికెట్ తప్ప మరే ధైర్యమూ లేదు. ఎవరి సాయమూ లేదు. రెండు మూడేళ్లు చిన్నా చితకా ఉద్యోగాలు చేశాను. దగ్గర ఉన్న కొంత బంగారం కొన్ని రోజులు ఆదుకుంది. సింగిల్ మదర్‌గా సమాజంలో వివక్షను ఎదుర్కోవడం చాలా కష్టం. ఆ కష్టం అద్దె ఇంటిని వెతుక్కోవడంతో మొదలైంది. ఎవరో ఒకరి రికమెండేషన్ ఉంటే తప్ప ఇల్లు అద్దెకు ఇచ్చేవారు కాదు. పిల్లలు ఎదిగే సమయంలో వేరుపడి బయటికి రావడం అవసరమా అని అన్నవాళ్లూ ఉన్నారు. ఆ మాటలన్నీ పడుతూ కుమిలిపోతుంటే పిల్లలు డిస్టర్బ్ అవుతారని అనిపించింది. ఎంత కష్టమొచ్చినా పిల్లల కోసం నిలబడాలని బలంగా అనుకున్నాను. గతంలో చేసిన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు బొటిక్ పెట్టుకోడానికి ఉపయోగపడింది. ఆరేళ్లుగా బొటిక్ నడుపుతున్నాను. మొదట్లో వేలెత్తి చూపిన వారే.. ఇప్పుడు 'మా వాళ్లు' అని మాట్లాడుతుంటారు. సమాజం నన్ను అన్న మాటలన్నిటికీ నా పిల్లలు సరైన సమాధానం ఇచ్చారు అనుకుంటాను.

**నా ధైర్యమే వచ్చింది**

''ఈ పనే చేయాలి, ఇది చేయకూడదు.. అని నేనెప్పుడూ పిల్లలకు ఆంక్షలు పెట్టలేదు. వాళ్లు అడిగినవన్నీ ఇవ్వగలిగాను.



కూతురు హారిక,
కొడుకు వంశీ (హారతి అన్న)తో జ్యోతి

ఏదైనా నా శక్తికి మించినది, అంతగా అవసరం లేదని అనుకున్నదీ అడిగినప్పుడు మాత్రం వాళ్లకు నచ్చచెబుతాను. లేదంటే, వాయిదా వేస్తాను. మెల్లగా వాళ్లే అర్థం చేసుకుంటారు. స్నేహితుల ఎంపికలోనూ వాళ్లకు కండిషన్స్ పెట్టలేదు. వంశీకన్నా హారికకు స్నేహితులు ఎక్కువ. అందరితోనూ బాగుంటుంది. ఈ కాలం పిల్లలు చాలా బాలెన్సింగ్‌గా ఉంటున్నారు. తనూ అలాగే ఉంటుంది. నా బిడ్డలపై అపోహలు, అపనమ్మకాలు, భయాలు.. ఏవీ పెట్టుకోను. ఏ వర్క్ చేయాలన్నా ధైర్యంగా మొదలు పెట్టమంటాను. వాళ్లు కూడా నాలాంటి వాళ్లే. ఒకటి అనుకుంటే వెనుకంజ వేయరు. (నవ్వుతూ).

**హారిక సర్‌ప్రైజ్**

హారిక బిబిఎ మొదటి సంవత్సరంలో ఉన్నప్పటి నుంచీ పార్ట్ టైమ్ జాబ్స్ చేస్తూ వచ్చింది. తనకు నెలకు ఏడు వేల రూపాయలు వచ్చేవి. అందులో రెండు వేలు తను పాకెట్‌మనీగా పెట్టుకొని ఐదు వేలు ఇంటికి ఇచ్చేది. ఆ రెండువేలను కూడా పొదుపు చేసి నా బర్త్‌డేకి ఏదో ఒక బహుమతి తెచ్చి నన్ను సర్‌ప్రైజ్ చేసేది. ఇప్పటికీ అదే అలవాటు ఉంది తనకు. నా కూతురే నాకు నటనలో ఓనమాలు నేర్పింది. నిజానికి తను కూడా ఎక్కడా యాక్టింగ్ క్లాస్‌కు వెళ్లింది లేదు. చిన్నప్పుడు కొంత వరకు సంగీతం నేర్చుకుంది. మోడ్రన్ డ్యాన్సులంటే తనకు బాగా ఇష్టం. ఆరేడు గంటలు విరామం లేకుండా డ్యాన్స్ చేయమన్నా చేస్తుంది. ఎక్కువ సమయం పిల్లలతో ఉంటుంటాను కాబట్టి ఇద్దరూ వాళ్ల వర్క్‌లో నన్నూ ఇన్‌వాల్వ్ చేస్తుంటారు. ఆ విధంగానే హారిక తను చేసే స్కిట్‌లలోకి నన్నూ తీసుకుంది. వంశీని కూడా. వంశీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. హారిక క్రియేటివ్ సైడ్ ఎంచుకొని వెళుతోంది. ''ఇంక వర్క్ చేయకమ్మా! నీకేం కావాలో చెప్పు.. రెస్ట్ తీసుకో'' అని పిల్లలు అంటుంటారు. ''నేను డిజైన్ చేసే దుస్తుల్లో నువ్వింకా మెరవాలి కదా! అప్పుడే రెస్ట్ ఎందుకు?'' అని హారికతో అంటూ నవ్వేస్తాను. పిల్లల పెళ్లిళ్ల గురించి అప్పుడప్పుడు మాట్లాడుతుంటాను. తమను అర్థం చేసుకున్నవాళ్లు, అందరం కలిసి ఉమ్మడి కుటుంబంగా కొనసాగడానికి ఇష్టపడేవారైతే నెక్స్ట్ స్టెప్ అంటుంటారు పిల్లలిద్దరూ. ఇద్దరూ వారు ఎంచుకున్న రంగంలో వృద్ధిలోకి రావాలన్నదే నేను కోరుకునేది'' అని ముగించారు జ్యోతి.

– నిర్మలారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: నోముల రాజేష్‌రెడ్డి

**22 అనేది చాలా చిన్న నంబర్ అనిపించొచ్చుగాని అటు 11 మంది ఇటు 11 మంది ఉండేలా 22 మందితో రెండు ఆడపిల్లల క్రికెట్ టీమ్‌లు ఏర్పాటు కావడానికి ఆ ఊరిలో పెద్ద ప్రతిఘటన చేయాల్సి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ సమీపంలోని ముర్రైలాపూర్‌లో 10-18 సంవత్సరాల మధ్య ఉన్న ఆడపిల్లలు క్రికెట్ ఆడాలనుకున్నారు. వంట గది గ్రౌండుగా, అంట్లే ఆటవస్తువులుగా పెరిగే అక్కడి ఆడపిల్లలు ఇలా అడగడం గ్రౌండ్‌లో కనిపించడం వింత. 'మగవాళ్ల ఆట' అయిన క్రికెట్ ఆడటం ఇంకా వింత. కాని బాలికలు దానిని సాధించారు. ఇప్పుడు ఊరే వారికి గ్రౌండ్ శుభ్రం చేసి 'ఆడుకోండి తల్లులూ' అంటోంది.**

# బ్యాట్ పట్టిన బాలికా దండు



ఆమిర్ ఖాన్ 'లగాన్' సినిమాలో ఫక్తు పల్లెటూరి భారతీయులు క్రికెట్ తెలిసిన ఇంగ్లిష్ వారిని క్రికెట్‌లో ఓడిస్తారు పట్టుదలతో. ఆ సినిమా ఒక సంచలనం. ఇటీవల తమిళంలో నిర్మితమై, తెలుగులో రీమేక్ అయిన 'కౌసల్యా కృష్ణమూర్తి'లో ఒక రైతు కూతురు భారత మహిళా క్రికెట్ జట్టులో చోటు సంపాదించి ఇంటర్నేషనల్ మేచ్ ఆడే స్థాయికి ఎదగడానికి సంఘర్షణ చేయడం కథ. ఇప్పుడు ఉత్తర ప్రదేశ్‌లోని ముర్రైలాపూర్ అనే కుగ్రామంలో ఆడపిల్లలు చేస్తున్నది అంతకు తక్కువ కథ కాదు. ఎందుకంటే ఉత్తరప్రదేశ్‌లో ఉన్న చైతన్య స్థాయి అలాంటిది, ఆడపిల్లల పట్ల వివక్ష అలాంటిది.





**అత్తింటి కోసం శిక్షణ**

ఉత్తరప్రదేశ్ పటానికి పాదాల దగ్గర ఉండే మిర్జాపూర్‌కు గంట దూరంలో ఉండే ముర్రైలాపూర్ అనే ఏముంది అలాంటి సవాలక్ష గ్రామాల్లో ఆడపిల్లల గురించి ఒకటే ఆలోచన. ఆమెను పెద్ద చేసి అత్తారింటికి పంపడం ఎలా? అనేదే. వంట, అంట్లు, ఊడ్చడం, బట్టలు ఉతకడం, తమ కంటే వయసులో చిన్న అయిన తమ్ముళ్లో చెల్లెల్నో చూసుకోవడం ఇవి మాత్రమే అక్కడ ఆడపిల్లలు నేర్చుకుంటారు. స్కూళ్లకు దాదాపు పంపరు. పంపినా 5వ తరగతి తర్వాత ఆపేస్తారు. అలాంటి ఊళ్లలో కొన్ని ఎన్.జి.ఓలు బాలికా వికాసానికి ప్రయత్నాలు చేయడం, ప్రభుత్వం కూడా వాటిని ప్రోత్సహించడం జరుగుతోంది. ఢిల్లీలోని 'బ్రేక్‌త్రూ' అనే సంస్థ ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని గ్రామాలను ఎంచుకుని అక్కడ లైంగిక వివక్ష గురించి, గృహ హింస గురించి, బాలికా విద్య గురించి, బాలికల సంపూర్ణ వికాసం గురించి చైతన్యవంతమైన కార్యక్రమాలు మొదలెట్టింది. అది మెల్లగా ఫలితాలు ఇవ్వడం మొదలెట్టింది.

**తల్లులతో మొదలు**

ఇంటి ఆడపిల్ల స్కూలుకు వెళ్లాలంటే మొదట తల్లిని ఒప్పించాలి. ఆ తల్లి తండ్రిని ఒప్పించాలి. అప్పుడే సాధ్యం. కాని తల్లి సాధారణంగా ఒప్పుకోదు. ఎందుకంటే ఇంట్లో ఉండే చాకిరిని ఇంటి ఆడపిల్ల కొద్దో గొప్పో పంచుకుంటుంది. పిల్ల స్కూల్‌కి వెళితే తను అవస్థ పడుతుంది. అది గమనించిన ఎన్.జి.ఓ కార్యకర్తలు పిల్లలు తల్లుల కోసం చేయాల్సిన పనిని చేసేకే స్కూళ్లకు రమ్మని కోరారు. అలా పిల్లలు మెల్లగా స్కూళ్లకు వచ్చారు. పాఠాలు బుద్ధికి. మరి శరీరానికి? వ్యాయామం కావాలి. 'ఏవో ఒక ఆటలు ఆడండి' అంటే ఆ ఊరి ఆడపిల్లలు మాకు క్రికెట్ ఇష్టం. క్రికెట్ ఆడతాం అన్నారు. క్రికెట్ నేర్పించడానికి ఎన్.జి.ఓ కార్యకర్తలు ఉన్నారు. కాని ఆడటానికి ఊరి వాళ్లతోనే సమస్య.

**మగవాళ్ల ఆట మీకెందుకు**

ఊరి ఆడపిల్లలు దాపున ఉన్న ఖాళీ చేలలో క్రికెట్‌కు దిగారు అని ఊళ్లో తెలిసిన వెంటనే తండ్రులు, అన్నయ్యలు రంగంలోకి దిగారు. 'ఆడపిల్లలు ఈ ఆట ఎందుకు' అని తండ్రులు అంటే 'గ్రౌండ్‌లో దిగితే కాళ్లు విరగ్గొడతాం' అని ఆ ఆడపిల్లల అన్నయ్యలు బెదిరించారు. 'అబ్బాయిలు ఆడుతున్నారు కదా మేమెందుకు ఆడకూడదు' అని అమ్మాయిలు అడిగారు. అంతేనా? తండ్రులకు అన్నయ్యలకు బెదరక అచ్చు సినిమాల్లో లాగా ఒక్కో అమ్మాయిని కలుపుకుంటూ టీమ్‌లు తయారు చేశారు. అయితే రెండు టీములకు అవసరమైన 22 మంది అమ్మాయిలు దొరకలేదు. ఇద్దరు ముగ్గురు తగ్గారు. ఆట ముఖ్యం కాని టీమ్ సంఖ్యదేముంది అని ఉన్నవాళ్లనే రెండు టీమ్‌లకు పంచారు. ఊరి మొత్తం టీమ్‌కు 'మోర్ని క్రికెట్ టీమ్' అని పేరు పెట్టారు. మోర్ని అంటే ఆడ నెమలి. ఊరి అమ్మాయి సంజనా చౌహాన్ ఆ టీమ్‌కు కెప్టెన్ అయ్యింది.

**ఆట చూసి...**

'మేము గ్రౌండ్లో ఆడతాం. చూసి వద్దంటే చెప్పండి' అని అడిగారు ఆడపిల్లలు తమ అన్నయ్యలని, తండ్రులని. బ్యాట్లు, వికెట్లు పట్టుకుని, క్రీజును గీసి, ఆటకు అనువైన బట్టలు తొడుక్కుని వాళ్లు ఆడుతుంటే చూసిన తండ్రులు, అన్నయ్యలు సంతోషపడ్డారు. తమ ఇంటి ఆడపిల్లల లోపల ఇంత శక్తి, ఆసక్తి, నైపుణ్యం ఉంటుందని వారు అర్థం చేసుకున్నారు. పూర్తిగా ఆడపిల్లలే ఆడుతున్నారు కనుక ఒకరి మధ్య ఒకరికి పోటీ ఏర్పడి ఇంకా బాగా ఆడటం, దాని వల్ల వారి శరీరాలు ఫిట్‌గా మారుతుండటం కూడా గమనించారు. ఇప్పుడు ఆ ఊరి తల్లిదండ్రులు ఈ ఆడపిల్లల ఆటను ఒప్పుకోవడమే కాదు చదువును కూడా అంగీకరిస్తున్నారు. 'పెళ్లికి తొందరేముంది. చదివేంతగా చదివిద్దాం' అంటున్నారు.

ఇప్పుడు ముర్రైలాపూర్ ఆడపిల్లలు చదువుకోడమే కాదు క్రికెట్‌కు సంబంధించి ప్రొఫెషనల్ అకాడమీలలో కూడా చేరాలనుకుంటున్నారు. 'ఒకరోజు మేము దేశానికి ఆడతాం' అని ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తున్నారు. చిన్న ఊళ్ల నుంచి ఎదిగిన పురుష క్రికెట్ ప్లేయర్ల గాథలు విన్నాం. ఒకనాడు మనం ఈ మోర్ని క్రికెట్ టీమ్ బయోపిక్ కూడా తప్పక చూస్తాం. వారి బ్యాట్ విసురు, బౌలింగ్ గురి అలా ఉంది మరి.

– సాక్షి ఫ్యామిలి

# చెవులకు గోడలు



**గోడలకు తగిలించుకునే పెయింటింగ్‌ల మీనియేచర్ రూపాలతో పూనమ్ డిజైన్ చేసిన చెవుల జూకాలు ఫ్యాషన్ ట్రెండ్‌గా మారాయి.**



పూనమ్

గోడకు అందమైన పెయింటింగ్ తగిలిస్తే ఆ ఇంటికే అందం వస్తుంది. ఇల్లాలి మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. చెవులకు తగిలించుకుంటే ఆ మహిళ చక్కటి అభిరుచికి, ఆధునికతకు ప్రతిరూపంగా కనిపిస్తుంది. అవునండీ! కర్ణాటకలోని కొడగులో పుట్టి న్యూయార్క్‌లో కెరీర్ వెతుక్కున్న పూనమ్ పెయింటింగ్ ఆభరణాలతో ఒక ప్రయోగం చేసింది. ఆ ప్రయోగం న్యూయార్క్, పారిస్ ఫ్యాషన్ వీక్‌లలో విజయవంతమైంది. పూనమ్ ఆభరణాల డిజైనర్‌గా మారడానికి దారి తీసిన పరిస్థితి మాత్రం అత్యంత బాధాకరం.

పూనమ్ 2017లో జేపీ మోర్గాన్ కంపెనీ న్యూయార్క్ ఆఫీస్‌లో పని చేసేది. గర్భిణి అని సంతోషించేలోపే ఆశాభంగం. ఉద్యోగంలో ఒత్తిడి కారణంగా గర్భస్రావం అయింది. ఎంత ప్రయత్నించినా మామూలు మనిషి కాలేకపోయిందామె. గాలి మార్పు కోసం మాతృదేశానికి వచ్చేసింది. ఆ రావడం... ఆమెను తిరిగి బాల్యంలోకి తీసుకెళ్లింది. ఆకులు, తీగలతో ఆభరణాలు చుట్టిన జ్ఞాపకాలు ఆమెను పసితనంలోకి తీసుకెళ్లాయి. చిన్నపిల్లలాగ కొడగు తోటల్లో విహరిస్తూ పూల మొగ్గలతో చెవులకు లోలాకులు అల్లడంలో ఎక్కడలేని ఆనందం కలిగేదామెకు. 'మళ్లీ కాలేజ్‌లో చేరి చదువుకుంటానని' అనడంతో ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయారు. కానీ, బాధ నుంచి బయటపడుతుందనే ఆశ వాళ్లందరిదీ. అలా మైసూర్‌లో జ్యువెలరీ కోర్సులో చేరింది. బంగారు, వెండి, వజ్రాలతో చేసేవి మాత్రమే ఆభరణాలు కాదు, మట్టి, లక్క, చెక్క, నూలు దారం, పట్టు దారాలతో కూడా అందమైన ఆభరణాలు తయారు చేయవచ్చు. దివ్యాంగులైన పిల్లలకు అలా ఆభరణాలు చేయడం నేర్పించింది. కోర్సులో నేర్చుకున్న వాటితోపాటు తనకు వచ్చిన ఒక్కొక్క ఆలోచనను చేరుస్తూ ఆభరణంలో పొదుగుతూ వచ్చింది. అలా తయారైనవే పెయింటింగ్ ఇయర్ హ్యాంగింగ్స్. గోడలకు తగిలించుకునే పెయింటింగ్‌ల మీనియేచర్ రూపాలతో చేసిన చెవుల జూకాలు అవి. కొద్ది నెలలకు తిరిగి న్యూయార్క్‌కు వెళ్లింది పూనమ్. అయితే మళ్లీ పాత ఉద్యోగం చేయదలుచుకోలేదు. తనకు సాంత్వననిచ్చిన ఆభరణాల తయారీని మాలిక్యులస్ అనే పేరుతో న్యూయార్క్‌కి పరిచయం చేసింది. న్యూయార్క్‌తోపాటు పారిస్ ఫ్యాషన్ వీక్‌లలోనూ ప్రదర్శించింది. జైపూర్ మామూలు లోహాలలో రాళ్లు పొదిగిన ఆభరణాల తయారీ కుటీర పరిశ్రమలోని పాతికమంది మహిళలను కూడా ఐడియాల కోసం సంప్రదించింది పూనమ్. ఇప్పుడు మొత్తం పద్నాలుగు దేశాల్లోని అరవైకి పైగా డిజైనర్‌లతో కలిసి పని చేస్తోంది. ఆభరణాలకు ఉపయోగించే క్లే, లక్కకు బదులుగా చేసిన పాలిమర్ క్లే ప్రయోగం కూడా ఆమెకు కలిసొచ్చింది.



వాల్ పెయింటింగ్ చెవి దుద్దులు



## జొకోవిచ్‌పై గెలుపుతో సెమీస్‌లో మెద్వెదేవ్‌

ఏటీపీ ఫైనల్స్‌ టెన్నిస్‌ సీజన్‌ ముగింపు టోర్నీలో డానిల్‌ మెద్వెదేవ్‌ (రష్యా) సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మ్యాచ్‌లో మెద్వెదేవ్‌ 6–3, 6–3తో వరల్డ్‌ నంబర్‌వన్‌ నొవాక్‌ జొకోవిచ్‌ (సెర్బియా)పై వరుస సెట్లలో గెలిచాడు. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరడం మెద్వెదేవ్‌కి ఇదే తొలిసారి. మ్యాచ్‌లో మెద్వెదేవ్‌ 9 ఏస్‌లు కొట్టగా... జొకోవిచ్‌ కేవలం మూడింటిని మాత్రమే సంధించాడు. మెద్వెదేవ్‌ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడు సార్లు బ్రేక్‌ చేయగా... జొకోవిచ్‌ ఒక్కసారి కూడా చేయలేకపోయాడు. 2009లో నికోలాయ్‌ డెవిడెంకో విజేతగా నిలిచిన తర్వాత ఒక రష్యా ఆటగాడు ఏటీపీ ఫైనల్స్‌ టోర్నీ సెమీస్‌ చేరడం ఇదే తొలిసారి. అయితే ఈ మ్యాచ్‌లో ఓడినంత మాత్రాన జొకోవిచ్‌ సెమీస్‌ ఆశలు గల్లంతు కాలేదు. నేడు అలెగ్జాండర్‌ జ్వెరెవ్‌ (జర్మనీ)తో జరిగే మ్యాచ్‌లో గెలిస్తే అతను సెమీస్‌కు అర్హత సాధిస్తాడు.

ట్రోఫీతో గత ఐఎస్‌ఎల్‌ విజేత ఏటీకే మోహన్‌ బగాన్‌ (ఫైల్‌)



# సూపర్‌ ఫుట్‌బాల్‌

| నేటి నుంచి ఇండియన్‌ లీగ్‌ ఏడో సీజన్‌ | కరోనా నేపథ్యంలో మ్యాచ్‌లన్నీ గోవాలోనే | అదృష్టం పరీక్షించుకోనున్న హైదరాబాద్‌ ఎఫ్‌సీ | తొలి మ్యాచ్‌లో తలపడనున్న కేరళ బ్లాస్టర్స్, ఏటీకే మోహన్‌ బగాన్‌ | రాత్రి గం. 7.30 నుంచి స్టార్‌ స్పోర్ట్స్‌–1లో ప్రత్యక్ష ప్రసారం |
|---|---|---|---|---|

**కళ్లు చెదిరే ఫ్రీ కిక్‌లు... కళాత్మకమైన పాస్‌లు... మతి పోగొట్టే హెడర్స్‌... ఒళ్లు గగుర్పాటుకు గురి చేసే డిఫెండర్ల విన్యాసాలు... వెరసి ప్రేక్షకుల్ని అలరించడానికి ఇండియన్‌ సూపర్‌ లీగ్‌ (ఐఎస్‌ఎల్‌) సిద్ధమైంది. కరోనా నేపథ్యంలో కట్టుబాట్ల నడుమ బుడగలో కాలికి, బంతికి జరిగే ఈ పోరాటంలో గెలిచేందుకు 11 జట్లు 'రెఢీ' అయ్యాయి... మనల్ని ఉత్సాహపరిచేందుకు ఫుట్‌బాల్‌ పండుగను తీసుకొచ్చాయి.**

**పనాజీ:** నాలుగు నెలల పాటు భారత ఫుట్‌బాల్‌ అభిమానులను అలరించడానికి ఇండియన్‌ సూపర్‌ లీగ్‌ (ఐఎస్‌ఎల్‌) వచ్చేసింది. నేడు కేరళ బ్లాస్టర్స్, ఏటీకే మోహన్‌ బగాన్‌ మ్యాచ్‌తో ఏడో సీజన్‌కు తెర లేవనుంది. కరోనా విరామం అనంతరం దేశంలో జరగనున్న తొలి క్రీడా ఈవెంట్‌ ఇదే కావడం విశేషం. దాంతో టోర్నీని ఒకే చోట నిర్వహించడానికి సిద్ధమైన లీగ్‌ నిర్వాహకులు... అందుకోసం గోవాను ఎంచుకున్నారు. అక్కడే 'బయో సెక్యూర్‌ బబుల్‌'ను ఏర్పాటు చేశారు. మొత్తం మూడు స్టేడియాల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. క్వారంటైన్‌ నిబంధనలు ఉండటంతో టోర్నీలో పాల్గొనే ప్లేయర్లు నెల రోజులు ముందుగానే గోవాకు చేరుకున్నారు. ఇక టైటిల్‌ కోసం పోటీ పడే జట్ల సంఖ్య ఈ సారి పెరిగింది. లీగ్‌లోకి కొత్తగా స్పోర్టింగ్‌ క్లబ్‌ ఈస్ట్‌ బెంగాల్‌ వచ్చి చేరడంతో... జట్ల సంఖ్య 11కు చేరింది. టైటిల్‌ ఫేవరెట్లుగా డిఫెండింగ్‌ చాంపియన్‌ ఏటీకే మోహన్‌ బగాన్, మాజీ చాంపియన్‌ బెంగళూరు ఎఫ్‌సీ కనిపిస్తున్నాయి. తమ తొలి సీజన్‌ (2019–20)లో అనుకున్నంత స్థాయిలో ప్రదర్శన కనబరచని హైదరాబాద్‌ ఫుట్‌బాల్‌ క్లబ్‌ (ఎఫ్‌సీ)... ఈ సారి మెరుగైన ప్రదర్శన ఇవ్వాలనే పట్టుదలతో ఉంది. ఇందుకోసం స్పెయిన్‌కు చెందిన మాన్యుయెల్‌ మార్క్వెజ్‌ను తమ హెడ్‌ కోచ్‌గా కూడా నియమించింది. గత సీజన్‌లో హైదరాబాద్‌ ఎఫ్‌సీ... రెండు విజయాలు మాత్రమే నమోదు చేసి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచి నిరాశ పరిచింది. రౌండ్‌ రాబిన్‌ లీగ్‌ పద్ధతిన జరిగే ఈ టోర్నీలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం సెమీ ఫైనల్స్‌ జరుగుతాయి. కరోనా ఉండటంతో ఈ సారి ఇంటా, బయట పద్ధతిలో కాకుండా ఒకే చోట సెమీస్‌ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇక్కడ విజేతలుగా నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఇప్పటి వరకు లీగ్‌ తొలి అంచె మ్యాచ్‌ తేదీలను మాత్రమే నిర్వాహకులు ప్రకటించారు. డిసెంబర్‌లో రెండో అంచె పోటీలతో పాటు సెమీస్, ఫైనల్‌ తేదీలను ప్రకటించే అవకాశం ఉంది.

### సబ్‌స్టిట్యూట్‌ల సంఖ్య పెరిగింది

కరోనా నేపథ్యంలో ఈ ఏడాది మే నెలలో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌ సంఘాల సమాఖ్య (ఫిఫా) ప్రతిపాదించిన 'ఐదుగురు సబ్‌స్టిట్యూట్‌' నిబంధన ఐఎస్‌ఎల్‌లో కొనసాగనుంది. దాంతో మ్యాచ్‌ మధ్యలో ఒక జట్టు గరిష్టంగా ఐదుగురు సబ్‌స్టిట్యూట్‌లను ఆడించవచ్చు. మ్యాచ్‌ జరుగుతున్న సమయంలో మూడు సందర్భాల్లో మాత్రమే వీరిని బరిలోకి దించాలి. అంతేకాకుండా సబ్‌స్టిట్యూట్‌ బెంచ్‌ను ఏడుగురి నుంచి తొమ్మిదికి పెంచారు.

**హైదరాబాద్‌ ఎఫ్‌సీ జట్టు:** గోల్‌ కీపర్లు: లాల్బి యాక్లువా జోంగ్టే, లక్ష్మీకాంత్, మానస్‌ దూబే, సుబ్రతా పాల్.
**డిఫెండర్లు:** ఆకాశ్‌ మిశ్రా, ఆశిష్‌ రాయ్, చింగ్లెన్‌సనా సింగ్, డింపిల్‌ భగత్, కిన్‌సైలాంగ్‌ ఖోంగ్సిట్, నిఖిల్‌ ప్రభు, ఒడి ఒనైందియా, సాహిల్‌ పన్వార్.
**మిడ్‌ ఫీల్డర్లు:** అభిషేక్‌ హల్దార్, ఆదిల్‌ ఖాన్, సాహిల్‌ తవోరా, హలిచరన్‌ నర్జారీ, హితేశ్‌ శర్మ, జావో విక్టోర్, లల్దాన్‌మవియా రాల్టే, లూయిస్‌ సస్త్రే, మార్క్‌ జొతాన్‌పుయా, మొహమ్మద్‌ యాసిర్, నిఖిల్‌ పూజారి, సౌవిక్‌ చక్రవర్తి, స్వీడెన్‌ ఫెర్నాండెస్.
**ఫార్వర్డ్స్‌:** సాంటానా, సాండ్రెజ్, ఇషాన్‌ డే, జోల్‌ చియానీస్, లాలాంపుయా, లిస్టన్‌ కొలాకో, రోహిత్‌ దను,
**హెడ్‌ కోచ్‌:** మాన్యుయెల్‌ మార్క్వెజ్.

# ఎన్‌సీఏలో రోహిత్‌

## ఫిట్‌నెస్‌ మెరుగుపర్చుకునే పనిలో భారత బ్యాట్స్‌మన్‌



రోహిత్‌ శర్మ

**బెంగళూరు:** 'రోహిత్‌ శర్మ 70 శాతం ఫిట్‌నెస్‌తో మాత్రమే ఉన్నాడు'...ఇటీవలే బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్‌ గంగూలీ చేసిన వ్యాఖ్య ఇది. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు మాత్రమే ఎంపికైన రోహిత్‌ ఫిట్‌నెస్‌పై సందిగ్ధత ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం కీలక పరిణామం చోటు చేసుకుంది. ఐపీఎల్‌ ముగిసిన వారం రోజుల తర్వాత రోహిత్‌ శర్మ జాతీయ క్రికెట్‌ అకాడమీ (ఎన్‌సీఏ) లోకి అడుగు పెట్టాడు. గాయాలపాలైన భా రత క్రికెటర్లకు ఇది పునరావాస కేంద్రం. బోర్డు వైద్యుల పర్యవేక్షణలో కోలుకోవడంతో పాటు ఆటగాళ్లు తమ ఫిట్‌నెస్‌ కూడా ఇక్కడే నిరూపించుకోవాల్సి ఉంటుంది. పేసర్‌ ఇషాంత్‌ శర్మ ఇప్పుడు అదే పనిలో ఉన్నాడు. రోహిత్‌ ఫిట్‌నెస్‌ పరీక్షకు హాజరయ్యేందుకు ఇక్కడకు వచ్చాడా...నిజంగా కండరాల గాయంతో బాధపడుతూ కోలుకునేందుకు వచ్చాడా అనే విషయంపై స్పష్టత లేదు. అయితే రోహిత్‌ పూర్తి ఫిట్‌గా లేడనేది మాత్రం వాస్తవం. అతను బోర్డు హెచ్చరికను ఖాతరు చేయకుండా అదే గాయంతో ఐపీఎల్‌లో మూడు మ్యాచ్‌లు కూడా ఆడాడు. చీఫ్‌ సెలక్టర్‌ సునీల్‌ జోషి పర్యవేక్షణలో రోహిత్‌ ఎన్‌సీఏలో తన ఫిట్‌నెస్‌ నిరూపించుకోవాల్సి ఉంటుంది.

**పుజారా కూడా ...**

**సిడ్నీ:** ఆస్ట్రేలియా గడ్డపై భారత క్రికెటర్ల సన్నాహకాలు జోరుగా సాగుతున్నాయి. టెస్టు స్పెషలిస్ట్‌ చతేశ్వర్‌ పుజారా కూడా గురువారం తన ప్రాక్టీస్‌ను ప్రారంభించాడు. జట్టు ప్రధాన బౌలర్లు ఉమేశ్‌ యాదవ్, అశ్విన్‌లతో పాటు నెట్‌ బౌలర్లుగా వెళ్లిన ఇషాన్‌ పొరెల్, కార్తీక్‌ త్యాగి విసిరిన బంతులను పుజారా సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఐపీఎల్‌ ఆడే అవకాశం రాని పుజారా చివరి సారిగా మార్చిలో సౌరాష్ట్ర తరఫున రంజీ ట్రోఫీ ఫైనల్లో బరిలోకి దిగాడు. సాధనలో పుజారా తనదైన శైలిలో కొన్ని చక్కటి షాట్లు ఆడుతుండటం బీసీసీఐ పెట్టిన వీడియోలో కనిపించింది. మరో వైపు కరోనా బారిన పడి భారత జట్టుతో పాటు వెళ్లలేకపోయిన త్రో డౌన్‌ స్పెషలిస్ట్‌ రఘు కోలుకొని ఇప్పుడు ఆసీస్‌ గడ్డపై అడుగు పెట్టాడు. నిబంధనల ప్రకారం రెండు వారాల క్వారంటైన్‌ తర్వాత అతను టీమిండియా ప్రాక్టీస్‌లో భాగమవుతాడు.

# భారత్‌కంటే ఆస్ట్రేలియా మెరుగు!

**ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ ర్యాంకింగ్స్‌**

**దుబాయ్‌:** ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ రేసులో ఇప్పటి వరకు భారత్‌ అగ్రస్థానంలో సాగింది. ఆడిన 9 మ్యాచ్‌లలో 7 గెలిచి 2 ఓడిన టీమిండియా... 360 పాయింట్లతో ముందంజలో నిలిచింది. అయితే కరోనా కారణంగా పలు సిరీస్‌లు రద్దు కావడంతో టెస్టు చాంపియన్‌షిప్‌ ఫైనల్‌ కోసం పాయింట్ల విధానాన్ని మార్చాలని అంతర్జాతీయ క్రికెట్‌ మండలి (ఐసీసీ) అధికారికంగా నిర్ణయించింది. ఆడిన మ్యాచ్‌ల సంఖ్య, అందుబాటులో ఉన్న మొత్తం పాయింట్ల సంఖ్యను చూస్తూ ఐసీసీ విజయ శాతాన్ని లెక్కించనుంది. దాంతో మొత్తం 480 పాయింట్ల (4 సిరీస్‌లు) ద్వారా 360 పాయింట్లు సాధించిన భారత్‌ విజయ శాతం 75 % గా ఉంది. అదే ఆస్ట్రేలియా అందుబాటులో ఉన్న 360 పాయింట్ల (3 సిరీస్‌లు) 296 పాయింట్లు సాధించడంతో జట్టు విజయ శాతం 82.2%గా నిలిచింది. దాంతో తాజా ర్యాంకింగ్స్‌లో ఆసీస్‌ నంబర్‌వన్‌ కాగా, టీమిండియా రెండో స్థానానికి పడిపోయింది. 60.8 శాతంతో ఇంగ్లండ్‌ మూడో స్థానంలో కొనసాగుతోంది. మరో వైపు నవంబర్‌ 2022లో జరగాల్సిన మహిళల టి20 ప్రపంచ కప్‌ను ఫిబ్రవరి 2023కి ఐసీసీ వాయిదా వేసింది. 2022లో ఇప్పటికే మహిళల వన్డే వరల్డ్‌ కప్, కామన్వెల్త్‌ క్రీడలు ఉండటంతో పాటు 2023లో ఒక్క ఐసీసీ ఈవెంట్‌ కూడా లేకపోవడమే దీనికి కారణం.

## క్వార్టర్స్‌లో ప్రజ్నేశ్‌

**న్యూఢిల్లీ:** ఒర్లాండో ఓపెన్‌ ఏటీపీ చాలెంజర్‌ టెన్నిస్‌ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్‌ ప్రజ్నేశ్‌ గుణేశ్వరన్‌ ముందంజ వేశాడు. అమెరికాలోని ఫ్లోరిడాలో జరుగుతోన్న ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌ విభాగంలో క్వార్టర్‌ ఫైనల్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌ మ్యాచ్‌లో నాలుగో సీడ్‌ ప్రజ్నేశ్‌ 5–7, 7–5, 2–0తో ముందంజలో ఉన్న సమయంలో ప్రత్యర్థి తంగ్‌ లిన్‌ వు (చైనీస్‌ తైపీ) గాయంతో వైదొలిగాడు. 2 గంటల 30 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఒక దశలో ప్రజ్నేశ్‌ 5–7, 2–5తో ఓటమి ముంగిట నిలిచాడు. వెంటనే అద్భుతంగా పుంజుకున్న అతను వరుసగా ఏడు గేమ్‌లను గెలుపొంది మ్యాచ్‌లో నిలిచాడు.

## దక్షిణాఫ్రికా క్రికెటర్‌కు కరోనా

**కేప్‌టౌన్‌:** స్వదేశంలో ఇంగ్లండ్‌తో వన్డే, టి20 సిరీస్‌లకు సన్నద్ధమవుతున్న సమయంలో దక్షిణాఫ్రికా క్రికెట్‌ జట్టును కరోనా తాకింది. జట్టులో సభ్యుడొకరు కోవిడ్‌–19 పాజిటివ్‌గా తేలాడు. దాంతో అతడిని బయో బబుల్‌నుంచి బయటకు పంపించివేశారు. అతనితో సన్నిహితంగా మెలిగిన మరో ఇద్దరు క్రికెటర్లకు వైరస్‌ లక్షణాలు లేనప్పటికీ ముందు జాగ్రత్తగా క్వారంటైన్‌కు తరలించినట్లు దక్షిణాఫ్రికా క్రికెట్‌ బోర్డు ప్రకటించింది. అయితే వారి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఆ ముగ్గురి స్థానాలను ఇతర క్రికెటర్లతో భర్తీ చేయబోమని చెప్పింది.

మరో వైపు తాజా సిరీస్‌లో మోకాలిపై కూర్చొని నల్లజాతివారికి సంఘీభావం తెలిపే కార్యక్రమానికి తాము దూరంగా ఉంటున్నామని దక్షిణాఫ్రికా కోచ్‌ మార్క్‌ బౌచర్‌ వెల్లడించాడు. తమ దేశంలో ఈ మొత్తం ఉద్యమంలో కీలకంగా ఉన్న జట్టు సభ్యుడు లుంగీ ఇన్గిడితో తాను మాట్లాడానని... కొన్నాళ్ల క్రితం జరిగిన 3టీసీ మ్యాచ్‌లో ఇలా చేశాం కాబట్టి ఇప్పుడు అవసరం లేదని వివరించినట్లు బౌచర్‌ తెలిపాడు.



బౌచర్‌

● తెలంగాణ

# ఓటుకు కోట్లు ఆశ చూపింది సెబాస్టియనే

**డిశ్చార్జ్‌ పిటిషన్‌పై ఏసీబీ కౌంటర్‌..నేడు విచారణ**

**సాక్షి, హైదరాబాద్‌:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి గెలుపు కోసం నామినేటెడ్‌ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రూ.5 కోట్ల లంచం ఇస్తామని ప్రలోభపెట్టింది ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న బిషప్‌ హ్యారీ సెబాస్టియన్‌ అని ఏసీబీ ప్రత్యేక కోర్టుకు నివేదించింది. ఇందుకు సంబంధించి అన్ని సాంకేతిక ఆధారాలున్నాయని తెలిపింది. ఈ మేరకు సెబాస్టియన్‌ దాఖలు చేసిన డిశ్చార్జ్‌ పిటిషన్‌పై గురువారం ఏసీబీ అదనపు ఎస్పీ రమణకుమార్‌ కౌంటర్‌ దాఖలు చేశారు. ''ఓటుకు కోట్లు కేసులో సెబాస్టియన్‌ పాత్రకు సంబంధించి స్పష్టమైన ఆధారాలున్నాయి. సెబాస్టియన్‌ ఫోన్‌లో కుట్రకు సంబంధించిన ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ కేసులో తనను అక్రమంగా ఇరికించారన్న సెబాస్టియన్‌ వాదనలో నిజం లేదు. స్టీఫెన్‌సన్‌తో ముందుగా ఫోన్‌లో మాట్లాడిందని సెబాస్టియన్‌. అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డితో కలసి సెబాస్టియన్‌ స్టీఫెన్‌సన్‌ సూచించిన అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న సండ్ర వెంకట వీరయ్య, రుద్ర ఉదయసింహ గత అక్టోబరు 12న డిశ్చార్జ్‌ పిటిషన్లు దాఖలు చేయగా..ఇతర నిందితులు డిశ్చార్జ్‌ పిటిషన్లు దాఖలు చేసుకోవాలని లేదా నేరుగా వాదనలు వినిపించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. అయితే సెబాస్టియన్‌ తరఫు న్యాయవాది పలు వాయిదాలు తీసుకుని, ఇప్పుడు డిశ్చార్జ్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. కోర్టు విచారణను జాప్యం చేసేందుకే ఒకరి తర్వాత ఒకరు డిశ్చార్జ్‌ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన డిశ్చార్జ్‌ పిటిషన్‌ను కొట్టివేయండి''అని కౌంటర్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం వాదనలు జరుగనున్నాయి.

## నత్తనడకన మెడికల్‌ ప్రవేశాలు

**28 నుంచి వెబ్‌ ఆప్షన్లు నిర్వహించేందుకు సన్నాహాలు**

**సాక్షి, హైదరాబాద్‌:** తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్‌ మెడికల్‌ అడ్మిషన్ల ప్రక్రియ మరింత ఆలస్యం అవుతోంది. ప్రవేశాలకు ప్రకటన వెలువడి దాదాపు 3 వారాలు పూర్తయినా ఇప్పటికీ వెబ్‌ ఆప్షన్లకు అవకాశం కల్పించకపోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ విద్యార్థుల సమక్షంలో జరగ్గా, ఇప్పుడు కరోనా కారణంగా ఆన్‌లైన్‌ వెరిఫికేషన్‌ జరుగుతోంది. దీంతో విద్యార్థులు ధ్రువపత్రాలు అప్‌లోడ్‌ చేయలేదని, చాలావరకు తప్పుల తడకగా ఉన్నాయని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు అంటున్నాయి. దీనివల్ల ఈసారి తీవ్రమైన జాప్యం జరుగుతోందన్నారు. కాగా కన్వీనర్‌ కోటా సీట్లకు వెబ్‌ ఆప్షన్లను ఈ నెల 28 నుంచి నిర్వహించడానికి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేస్తోంది.

**గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ పోరు**

# గల్లీ పార్టీయా.. ఢిల్లీ పార్టీయా?

- ఎవరు కావాలో ప్రజలు తేల్చుకోవాలి
- 'మీట్‌ ది ప్రెస్‌'లో టీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌



**సాక్షి, హైదరాబాద్‌:** ''తెలంగాణలో కొందరు విద్వేషపు విత్తనాలు నాటుతూ మత సామరస్యం దెబ్బతీసేవిధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఎవరైనా మత కలహాలు, బాంబు పేలుళ్ల వంటి పిచ్చి ప్రయత్నాలు చేస్తే ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తుంది. తెలంగాణకు ఆర్థిక యంత్రంగా ఉన్న హైదరాబాద్‌ బ్రాండ్‌ ఇమేజీని దెబ్బతీసే ప్రయత్నాలను సహించేది లేదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విద్వేషంతో నిండిన హైదరాబాద్‌ కావాలా లేక విజ్ఞతతో ఆలోచించే తెలంగాణ కావాలో ప్రజలు తేల్చుకోవాలి. 'హమారా హైదరాబాద్‌' అంటూ నగరాన్ని కొందరి హైదరాబాద్‌గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మేము గల్లీ పార్టీ.. వారిది ఢిల్లీ పార్టీ.. ఈ రెండింటిలో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలి'' అని రాష్ట్ర మంత్రి, టీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన 'మీట్‌ ది ప్రెస్‌'లో కేటీఆర్‌ మాట్లాడారు. గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేస్తామనే బీజేపీ నేతల ప్రకటనలపై స్పందిస్తూ.. అక్కడ కేసీఆర్‌ జాతీయ జెండా ఎగరేస్తారని, తాము మాత్రం బల్దియాపై గులాబీ జెండా ఎగరేస్తామన్నారు. గ్రేటర్‌ ఎన్నికల్లో తమకు ఎవరితోనూ దోస్తీ లేదన్నారు. దుబ్బాకలో ఓటమి ఒలికిపోయిన పాలలాంటివని, వాటి గురించి ఆలోచించదలుచుకోలేదని చెప్పారు.తాము ప్రజల ఆశీర్వాదాన్ని కోరుతూ ప్రచారంలోకి వెళ్తామని అన్నారు.

SRI KOTA ANJANEYA SWAMY TEMPLE
Chidambara Rao Street, KURNOOL.
e-Procurement Notice
Tender Notice No: 01/Endowment/FFM/KNL/20-21, Dt. 18.11.2020

| | |
|---|---|
| Name of the Scheme | CGF Aid (Funds |
| No. of Works | 01 |
| Bid document download starting Date | 18.11.2020 at 4.00 P.M. |
| Bid document download end date | 03.12.2020 at 3.00 P.M. |
| Last Date & Time for receipt of bids | 03.12.2020 at 5.00 P.M. |
| Commercial bid Opening date | 07.12.2020, at 6.00 P.M. |

Name and address of the Concerned The Founder Family Member Sri Kota Anjaneya Swamy Temple, Chidambararao Street, Kurnool - 93938 28204. www.apeprocurement.gov.in.
Sd/- Founder Family Member, Sri Kota Anjaneya Swamy Temple, KURNOOL.

# కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఇసుక రీచ్‌లు

- నిర్వహణకు ముందుకొచ్చిన రెండు సంస్థలు
- తక్కువ కోట్‌ చేసిన సంస్థకు రీచ్‌లను అప్పగిస్తాం
- చంద్రబాబు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు.. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండీసీ), మెటల్‌ స్క్రాప్‌ ట్రేడ్‌ కార్పొరేషన్‌ (ఎంఎస్‌టీసీ)లు ముందుకొచ్చాయని రాష్ట్ర భూగర్భ గనులు, పంచాయతీరాజ్‌ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇసుక మాఫియాకు చెక్‌ పెట్టి.. ప్రజలకు సరసమైన ధరలకు, సులువుగా ఇసుక అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా పాయింట్‌లో గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఇసుక రీచ్‌లను కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అప్పగించాలని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని చెప్పారు. ఈ మేరకు ఎనిమిది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు భూగర్భ గనుల శాఖ సంచాలకుల కార్యాలయం లేఖలు రాసిందన్నారు. దీంతో ఎన్‌ఎండీసీ, ఎంఎస్‌టీసీ ఇసుక రీచ్‌లను నిర్వహించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం సంప్రదింపులు చేస్తోందని, వీటిలో తక్కువకు కోట్‌ చేసిన సంస్థకు నిబంధనల మేరకు ఇసుక రీచ్‌లను అప్పగిస్తామన్నారు. వాస్తవం ఇదయితే కొందరు ప్రైవేటు వ్యక్తులకు ఇసుక రీచ్‌లను కట్టబెడుతున్నారంటూ చంద్రబాబు ఎల్లో మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే తనకు మిత్రుడైన శేఖర్‌రెడ్డిని తీసుకువచ్చారని, ఆయనకు టీటీడీ పాలక మండలి సభ్యుడిగా కూడా అవకాశం కల్పించారన్నారు. శేఖర్‌రెడ్డికి ఈ ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఇస్తోందంటూ ఊహాగానాలతో బాబు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

**అనుమతి లేని లేఔట్లను అడ్డుకోండి**

పట్టణాలు, నగరాలకు చుట్టుపక్కల ఉండే గ్రామాల్లో అనుమతి తీసుకోకుండా కొత్తగా వేసే లేఔట్ల విషయంలో ఆరంభంలోనే పంచాయతీరాజ్‌ శాఖ కఠినంగా వ్యవహరించాలని ఆ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్‌ కమిషనర్‌ కార్యాలయంలో అన్ని జిల్లాల పంచాయతీ అధికారులు (డీపీవోలు), జెడ్పీ సీఈవోలతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే వేసిన అక్రమ లేఔట్ల అనుమతుల విషయంలో నిబంధనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీపీవోలు, సీఈవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. టీడీపీ హయాంలో లేఔట్లు పెద్ద వ్యాపారంగా చేశారని, మన ప్రభుత్వంలో అలా జరగకూడదన్నారు. గ్రామాల్లో అందరికీ తాగునీటి వసతి కల్పనతోపాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎల్‌ఈడీ లైట్ల సమస్యను పరిష్కరించాలని చెప్పారు. పంచాయతీరాజ్‌ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్‌ గిరిజా శంకర్‌ పాల్గొన్నారు.

# 'శివరామకృష్ణన్‌' నివేదికలోనూ మూడు రాజధానులే..

**బహుజన పరిరక్షణ సమితి రిలే దీక్షలలో పాల్గొన్న ఐక్యవేదిక**



వికేంద్రీకరణకు మద్దతుగా నినాదాలు చేస్తున్న ఐక్య వేదిక నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులు, మహిళలు

**తాడికొండ:** అభివృద్ధి, వికేంద్రీకరణతోనే రాష్ట్రంలో సమాన న్యాయం జరుగుతుందని, రాజధాని ఏర్పాటుకు వేసిన శివరామకృష్ణన్‌ కమిటీ నివేదిక కూడా మూడు రాజధానుల ఏర్పాటుకే మొగ్గు చూపిందని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్య వేదిక నాయకులు అన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌ యాక్సెస్‌ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న 51వ రోజు రిలే నిరాహార దీక్షల్లో భాగంగా గురువారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ రాజధాని ఏ ఒక్కరి సొత్తూ కాదన్నారు. ఒకే సామాజిక వర్గం, చంద్రబాబు బినామీలు చేస్తున్న ఉద్యమాల్లో పెయిడ్‌ ఆర్టిస్టులతో ఎల్లో మీడియాలో ప్రచారం చేసుకుని ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. సీఆర్‌డీఏ చట్టంలో ఎక్కడైనా పేదలకు, దళితులకు రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని పొందుపరిచారేమో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు కె.రామరాజు, రాష్ట్ర భట్రాజు సంఘం అధ్యక్షుడు బి.కిరణ్‌ రాజు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

# ఫీజులతో రహదారుల అభివృద్ధి

**కొత్త నిబంధనల ఉత్తర్వులు జారీ**

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర రహదారులపై టోల్‌ ప్లాజాలను ఏర్పాటు చేసి నిర్ణీత ఫీజులను వసూలు చేయడం ద్వారా రోడ్లను అభివృద్ధి చేసేందుకు రోడ్లు భవనాల శాఖ కొత్త నిబంధనలు జారీ చేసింది. రహదార్లను కేటగిరీలుగా విభజించి వాటిని వెడల్పు చేసేందుకు, అభివృద్ధి చేసేందుకు ఈ ఫీజులు వినియోగిస్తారు. ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

**గత ప్రభుత్వ హయాంలో అప్పుల పాలు**

గత ప్రభుత్వం ఏపీ రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఏపీఆర్‌డీసీ)ను అప్పుల పాలు చేసింది. నిధులు మొత్తం వేరే పథకాలకు వినియోగించింది. ఈ పరిస్థితుల్లో నిధుల లభ్యత కోసం రోడ్‌ ఫీజు వసూలు నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్‌ ఎక్కువగా ఉన్న రోడ్లపై టోల్‌గేట్లు ఏర్పాటు చేసి ఫీజులు వసూలు చేస్తారు. వాహనాలను నాలుగు కేటగిరీలుగా విభజించి కిలోమీటర్‌కు ప్రాథమిక రేటును నిర్ణయించారు.

**ఫీజుల వివరాలు..**

- కారు, జీపు, వ్యాన్, తేలికపాటి మోటారు వాహనానికి కిలోమీటర్‌కు 90 పైసలు
- తేలికపాటి వాణిజ్య వాహనం, మినీ బస్సు, తేలిక పాటి గూడ్స్‌ వాహనానికి.. రూ.1.80
- టూ యాక్సిల్‌ బస్సు లేదా ట్రక్‌కు రూ.3.55
- భారీ నిర్మాణ రంగానికి సంబంధించిన మల్టీ యాక్సిల్‌ వాహనానికి.. రూ.8.90

## స్వచ్ఛ భారత్‌లో రాష్ట్రానికి మరో రెండు జాతీయ అవార్డులు

**ఉభయ గోదావరి జిల్లాలకు అవార్డులను అందజేసిన కేంద్ర మంత్రి**




**సాక్షి, అమరావతి/ న్యూఢిల్లీ:** జాతీయ స్థాయిలో మన రాష్ట్రం మరో రెండు అవార్డులు దక్కించుకుంది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ భారత్‌ కార్యక్రమాల అమలులో చూపుతున్న ప్రతిభకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను అవార్డులకు ఎంపిక చేసింది. మరుగుదొడ్ల వినియోగంలో ప్రజాచైతన్యం, అవగాహన కార్యక్రమాలను విశేషంగా అమలు చేసినందుకు గాను అవార్డులను ప్రకటించింది. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్‌ షెకావత్‌ గురువారం అవార్డులను వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు మురళీధర్‌రెడ్డి, ముత్యాలరాజుకు అందజేశారు. సీఎం వైఎస్‌ జగన్‌ ఆలోచనల మేరకు దేశంలోనే వినూత్నంగా సచివాలయ వ్యవస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని.. అందులో భాగంగానే రాష్ట్రం జాతీయ స్థాయిలో వరుస అవార్డులను గెలుచుకోగలుగుతోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఎండీ పి.సంపత్‌కుమార్‌ తెలిపారు. ఇటీవల గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్‌ కార్యక్రమాల అమలుకు గాను రాష్ట్రం మూడు జాతీయ అవార్డులు దక్కించుకున్న విషయం తెలిసిందే.

## 'బీఏఎస్‌' ప్రొసీడింగ్స్‌పై స్టేటస్‌ కో

**హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**

**సాక్షి, అమరావతి:** కార్పొరేట్‌ పాఠశాలల్లో బెస్ట్‌ అవైలబుల్‌ స్కూల్‌ (బీఏఎస్‌) పథకం కింద చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోకి మార్చేందుకు జిల్లా కలెక్టర్లకు వెసులుబాటు కల్పిస్తూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ విషయంలో యథాతథస్థితి (స్టేటస్‌ కో) కొనసాగించాలని హైకోర్టు గురువారం సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ హైకోర్టుకు వచ్చిన విద్యార్థులను ఇతర పాఠశాలలకు మార్చొద్దని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ ఉప్మాక దుర్గాప్రసాదరావు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబర్‌ 10కి వాయిదా వేశారు. బీఏఎస్‌ పథకం కింద కార్పొరేట్‌ పాఠశాలల్లో చదువుతున్న తమను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు వీలు కల్పిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ మాల మహానాడు ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి భీమారావు, మరికొందరు విద్యార్థులు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం జస్టిస్‌ దుర్గాప్రసాదరావు విచారణ జరిపారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
20-11-2020
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ | నిఫ్టీ |
| 580 ▼ | 167 ▼ |
| 43,600 | 12,772 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 11,836 | ▲ 34 |
| డోజోన్స్ | 29,296 | ▼ 142 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,334 | ▼ 51 |
| డాక్స్ | 13,086 | ▼ 117 |
| షాంఘై | 3,363 | ▲ 16 |
| నికాయ్ | 25,634 | ▼ 94 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

Bharathi CEMENT
SUPERIOR QUALITY. GUARANTEED.

# ఏడేళ్లు.. 10 సంస్థల లిస్టింగ్

- మహీంద్రా గ్రూప్ భారీ ప్రణాళికలు
- ఐపీవో లిస్టులో యాక్సెలో, బ్రిజిల్‌కోన్ తదితర సంస్థలు
- నష్టాల్లో ఉన్న కంపెనీల విక్రయం




**న్యూఢిల్లీ:** వాటాదారులకు మరింతగా రాబడులను అందించే దిశగా పారిశ్రామిక దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) పలు గ్రూప్ కంపెనీలను స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్ట్ చేయడంపై కసరత్తు చేస్తోంది. వచ్చే 2–7 సంవత్సరాల్లో 10 సంస్థలను లిస్ట్ చేయాలని భావిస్తోంది. గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అనీష్ షా ఈ విషయాలు వెల్లడించారు. ఆర్థిక సేవలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పర్యావరణహిత ఇంధనాలు తదితర వ్యాపార విభాగాలకు చెందిన సంస్థలు వీటిలో ఉన్నాయని ఆయన తెలిపారు. గ్రూప్ మొత్తం ఆదాయంలో విడివిడిగా ఒక్కో కంపెనీ వాటా భారీ స్థాయిలో లేకపోయినప్పటికీ.. వీటన్నింటి ద్వారా మాత్రం వచ్చే ఆదాయం రూ. 10,000 కోట్ల పైగానే ఉంటుందని షా చెప్పారు. 'ఇవన్నీ తమ తమ రంగాల్లో పటిష్టంగా ఉన్నాయి. ప్రాజెక్టుల అమలు, లాభాల ఆర్జన విషయంలో తమ సామర్థ్యాలను నిరూపించుకున్నాయి. వీటిలో చాలా మటుకు సంస్థలు లాభదాయకమైనవే. వృద్ధి ప్రణాళికల కోసం మాతృ సంస్థ నిధులపై ఆధారపడాల్సిన అవసరం లేనివే' అని ఆయన పేర్కొన్నారు. మధ్యకాలికంగా వివిధ వ్యాపార విభాగాల్లో వాటాదారులకు పెట్టుబడులపై 18 శాతం రాబడులు అందించాలని నిర్దేశించుకున్నట్లు, తదనుగుణంగానే సంస్థల లిస్టింగ్ ప్రయత్నాలు చేస్తున్నట్లు షా తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిటైర్ కానున్న ఎండీ, సీఈవో పవన్ గోయెంకా స్థానంలో షా బాధ్యతలు చేపట్టనున్నారు.

**రత్నాల్లాంటి కంపెనీలు..**

ఐపీవోకి ఎంపిక చేసిన 10 కంపెనీలు రత్నాల్లాంటివని షా అభివర్ణించారు. నిర్దేశించుకున్న స్థాయిలో వాటాదారులకు రాబడులు అందించే క్రమంలో నష్టాల్లో ఉన్న సంస్థలను వదిలించుకోవడంపైనా దృష్టి పెడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ జాబితాలో సాంగ్‌యాంగ్ మోటార్, ఎలక్ట్రిక్ బైక్ స్టార్టప్ జెన్‌జీ వంటివి ఉన్నాయి. ఇక ఐపీవో లిస్టులో మహీంద్రా యాక్సెలో, బ్రిజిల్‌కోన్, మహీంద్రా పవరాల్, క్లాసిక్ లెజెండ్స్ (జావా మోటార్‌సైకిల్స్ తయారీ సంస్థ) మొదలైనవి ఉన్నాయి. తమ యూజ్డ్ కార్స్ వ్యాపార విభాగంలో పెట్టుబడులకు ఇన్వెస్టర్ల కోసం అన్వేషిస్తున్నట్లు షా చెప్పారు. వచ్చే 2–3 ఏళ్లలో కనీసం 2–3 సంస్థలనైనా లిస్ట్ చేయొచ్చని, 3–5 ఏళ్లలో మరికొన్నింటినీ, మిగతా వాటిని 5–7 ఏళ్ల వ్యవధిలో లిస్ట్ చేయొచ్చని భావిస్తున్నట్లు షా చెప్పారు.

# వొడాఫోన్‌లోకి 2 బిలియన్ డాలర్లు

**ఓక్‌ట్రీ క్యాపిటల్ కన్సార్షియం ఆఫర్**




**న్యూఢిల్లీ:** నిధుల కొరతతో అల్లాడుతున్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియాలో (వీఐఎల్) పెట్టుబడి పెట్టడానికి ఓక్‌ట్రీ క్యాపిటల్ కన్సార్షియం ముందుకొచ్చింది. కనీసం 2 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తామని (సుమారు రూ. 15,000 కోట్లు) కంపెనీకి ఆఫర్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకోసం వర్డే పార్ట్‌నర్స్ తదితర దిగ్గజాలతో ఓక్‌ట్రీ చేతులు కలిపినట్లు పేర్కొన్నాయి. 2 బిలియన్ డాలర్ల నుంచి 2.5 బిలియన్ డాలర్ల దాకా ఇన్వెస్ట్ చేస్తామంటూ వీఐఎల్‌కు ఓక్‌ట్రీ కన్సార్షియం ప్రతిపాదన చేసినట్లు వివరించాయి. ఇతర టెల్కోలతో పోటీపడేందుకు అవసరమైన నిధులను సమకూర్చుకునే ప్రయత్నాల్లో ఉన్నామని, షేర్లు.. బాండ్ల విక్రయం ద్వారా దాదాపు రూ. 25,000 కోట్ల దాకా (సుమారు 3.3 బిలియన్ డాలర్లు) సమీకరించుకుంటామని కొద్ది రోజుల క్రితం వీఐఎల్ వెల్లడించింది. ఇందుకోసం ఇతరత్రా ఇన్వెస్టర్లతో చర్చలు కూడా జరుపుతోంది. అయితే, ఇవి ఎంతవరకూ ఫలప్రదమవుతాయన్నది చెప్పే పరిస్థితి లేదని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఓక్‌ట్రీ కన్సార్షియం ఆఫర్ ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్ లాభాలను దృష్టిలో ఉంచుకుని.. ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న భారతీయ వ్యాపార సంస్థల్లో ఓక్‌ట్రీ, వర్డే వంటి అంతర్జాతీయ దిగ్గజ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు.. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. వెంచర్ ఇంటెలిజెన్స్ అనే రీసెర్చ్ సంస్థ నివేదిక ప్రకారం సంక్షోభంలో ఉన్న సంస్థల్లో ఈ ఏడాది ఇప్పటిదాకా 1.5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేశాయి. 2019తో పోలిస్తే ఇది 55 శాతం అధికం.

**నిధులు కీలకం..**

ఉచిత కాల్స్, చౌక డేటా అంటూ 2016లో రిలయన్స్ జియో రంగంలోకి దిగినప్పట్నుంచి టెలికం పరిశ్రమలో పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలోని జియో, ఎయిర్‌టెల్‌తో పోలిస్తే ఆర్థికంగా బలహీనంగా ఉన్న సంస్థ వీఐఎల్. వొడాఫోన్ ఐడియా గత అనేక త్రైమాసికాలుగా నష్టాలు చవిచూస్తూనే ఉంది. భారీ స్థాయిలో స్పెక్ట్రం, లైసెన్సు ఫీజు బాకీలు కట్టాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలివ్వడం కంపెనీ కష్టాలను మరింతగా పెంచింది. దీంతో వీఐఎల్ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రుణదాతలతో చర్చలు ఫలవంతం కావడం, తగినన్ని నిధులు సమకూర్చుకోగలగడం వంటి అంశాలపై వ్యాపారాన్ని కొనసాగించడం ఆధారపడి ఉంటుందంటూ కంపెనీ ప్రకటించింది. బాకీల చెల్లింపునకు పదేళ్ల వ్యవధి లభించినప్పటికీ .. వ్యాపార నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడం ప్రస్తుతం వీఐఎల్‌కు చాలా కీలకంగా మారింది.

బీఎస్‌ఈలో వీఐఎల్ షేరు దాదాపు ఒక్క శాతం పెరిగి సుమారు రూ. 9 వద్ద క్లోజయ్యింది.

## బిర్లా గ్రూప్ సంస్థల నుంచి లోధా తొలగింపు



**ముంబై:** లోధా గ్రూప్, బిర్లా గ్రూప్‌ల మధ్య న్యాయ వివాదం మరింతగా ముదురుతోంది. తాజాగా నాలుగు సంస్థల నుంచి హర్షవర్ధన్ లోధాను డైరెక్టర్ హోదా నుంచి ఎంపి బిర్లా గ్రూప్ తప్పించింది. కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఎంసీఏ21 పోర్టల్‌కి ఇచ్చిన సమాచారం ప్రకారం .. ఈస్టిండియా ఇన్వెస్ట్‌మెంట్, బరోడా ఏజెన్సీస్ అండ్ ట్రేడింగ్ కంపెనీ, పంజాబ్ ప్రొడ్యూస్ అండ్ ట్రేడింగ్ కంపెనీ, పంజాబ్ ప్రొడ్యూస్ హోల్డింగ్స్ సంస్థల నుంచి ఆయన్ను తప్పించారు. అడ్మినిస్ట్రేటర్ (ఏపీఎల్) కమిటీ నిర్ణయం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయా సంస్థలు తెలియజేశాయి. మరోవైపు, నాలుగు సంస్థల డైరెక్టర్ పదవి నుంచి లోధాను తొలగించడాన్ని సవాల్ చేస్తూ లోధా గ్రూప్.. కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. దివంగత ప్రియంవద బిర్లా వీలునామా ప్రకారం బిర్లా ఎస్టేట్‌కి తానే వారసుణ్ని అంటూ హర్షవర్ధన్ తండ్రి ఆర్‌ఎం లోధా ప్రకటించుకోవడంతో వివాదం తలెత్తింది. ప్రస్తుతం ఈ ఎస్టేట్ విలువ సుమారు రూ. 25,000 కోట్ల పైనే.

# స్టాక్ మార్కెట్... రికార్డుల ర్యాలీకి బ్రేక్

- మళ్లీ తెరపైకి కోవిడ్ కేసుల భయాలు
- అధిక వెయిటేజీ షేర్లలో లాభాల స్వీకరణ
- 44వేల దిగువన ముగిసిన సెన్సెక్స్
- 167 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లలో భారీ విక్రయాలు

**ముంబై:** కోవిడ్ కేసుల పెరుగుదల భయాలు మార్కెట్‌ను మరోసారి తాకాయి. దీంతో సూచీల రికార్డుల ర్యాలీకి గురువారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 580 పాయింట్లు తగ్గి 44వేల దిగువన 43,600 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167 పాయింట్లను కోల్పోయి 12,772 వద్ద నిలిచింది. అధిక వాల్యుయేషన్లు, అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనతలు కూడా కలవరపెట్టడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పూనుకున్నారు. అధిక వెయిటేజీ కలిగిన బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు సూచీల భారీ పతనాన్ని శాసించాయి. మార్కెట్లో పట్టుకోసం బుల్స్, బేర్స్ మధ్య జరిగిన పోరులో మిడ్‌సెషన్ నుంచి బేర్స్ పూర్తి ఆధిపత్యాన్ని కనబరిచాయి. ఫలితంగా సెనెక్స్ ఒక దశలో 718 పాయింట్లు నష్టపోయి 43,518 వద్ద, నిఫ్టీ 218 పాయింట్ల కోల్పోయి 12,745 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకింది. ఎఫ్‌ఎంసీజీ, మీడియా షేర్లకు మాత్రం స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. భారీ పతనంలో సెనెక్స్ 44,230 వద్ద, నిఫ్టీ 12,963 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేయడం విశేషం.

**నష్టాలకు నాలుగు కారణాలు**

**● లాక్‌డౌన్ విధింపు ఆందోళనలు...**
అంతర్జాతీయంగా రెండో దశ కోవిడ్–19 కేసులు భారీగా పెరిగాయి. అమెరికాలో కరోనా మృతుల సంఖ్య 2.50 లక్షలను దాటింది. జపాన్‌లో కేసులు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. యూరప్‌లో చాలా దేశాల్లో వైరస్ రెండో దఫా విజృంభణ కొనసాగుతోంది. పెరుగుతున్న కేసులతో పలుదేశాలు లాక్‌డౌన్ విధింపు యోచన చేస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే రికవరీ అవుతున్న తరుణంలో లాక్‌డౌన్ ఆలోచనలు భయపెట్టాయి.

**ఆవిరైన రూ.1.41 లక్షల కోట్లు**

మార్కెట్ పతనంతో ఇన్వెస్టర్లు రూ.1.41 లక్షల కోట్లు నష్టపోయారు. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.171.44 లక్షల కోట్ల నుంచి రూ.170.03 లక్షల కోట్లకు తగ్గింది.



**● బలహీన అంతర్జాతీయ సంకేతాలు:**
రోజురోజుకూ పెరుగుతున్న కరోనా కేసులతో అంతర్జాతీయ మార్కెట్లలోనూ బలహీన సంకేతాలు నెలకొన్నాయి. ఆసియాలో జపాన్, హాంకాంగ్, సింగపూర్, తైవాన్ మార్కెట్లు అరశాతం నష్టపోయాయి. యూరప్‌లోనూ బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ సూచీలు ఒక శాతం వరకు క్షీణించాయి.

**● బ్యాంకింగ్ షేర్ల పతనం:**
అధిక వెయిటేజీ కలిగిన బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో విక్రయాలు సూచీల భారీ నష్టాలకు కారణమయ్యాయి. సెన్సెక్స్ కోల్పోయిన మొత్తం 580 పాయింట్లలో ఈ రెండు రంగ షేర్లవే 400 పాయింట్లు కావడం గమనార్హం. నిఫ్టీ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్ ఇండెక్స్‌లు నష్టపోయాయి.

**నేడే గ్లాండ్ ఫార్మా లిస్టింగ్..**

హైదరాబాద్ ఔషధ తయారీ కంపెనీ గ్లాండ్ ఫార్మా షేర్లు శుక్రవారం ఎక్స్చేంజీల్లో లిస్ట్ కానున్నాయి. ఈ ఇష్యూ నవంబర్ 9న ప్రారంభమై 11న ముగిసింది.

**12 శాతం లాభపడిన స్పైస్‌జెట్ షేరు...**

ఏడాదిన్నర కాలంగా నిలిచిపోయిన 737 మ్యాక్స్ విమానాల సర్వీసు పునరుద్ధరణకు యూఎస్ ఎఫ్‌ఏఏ ఆమోదం తెలపడంతో స్పైస్‌జెట్ షేరు 12% లాభపడి రూ.74 వద్ద ముగిసింది.

**● లాభాల స్వీకరణ**
ఈ నవంబర్ ప్రారంభం నుంచి సూచీలు సుదీర్ఘ ర్యాలీతో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. చివరి 13 రోజుల్లో సెన్సెక్స్ ఏకంగా 12 రోజులు లాభ పడటంతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగిపోతాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకే మొగ్గుచూపారు.

## 26 నుంచి అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సదస్సు




**న్యూఢిల్లీ:** పునరుత్పాదక ఇంధనంపై మూడవ అంతర్జాతీయ సదస్సు, ప్రదర్శనను ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 26వ తేదీన ప్రారంభించనున్నారు. భారత్‌కు పర్యావరణ సంబంధ పెట్టుబడుల ఆకర్షణ, ప్రోత్సాహం లక్ష్యంగా ''రీ–ఇన్వెస్ట్ 2020''పేరుతో ఈ సమావేశం జరగనుంది. 2022 నాటికి 175 జీడబ్ల్యూ పునరుత్పాదక సామర్థ్యాన్ని చేరుకోవాలన్నది భారత్ లక్ష్యంకాగా 2030 నాటికి దీనిని 450 గిగావాట్లకు పెంచుకోవాలన్నది భారత్ ప్రయత్నం. ప్రస్తుతం ఈ ఉత్పత్తి 136 గిగావాట్లు. గత ఆరేళ్లలో ఈ రంగంలోకి దాదాపు రూ.4.7 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2030 నాటికి ఏడాదికి ఈ రంగంలోకి రూ. లక్ష కోట్ల పెట్టుబడులు రావాలన్న లక్ష్యం. ఇంతక్రితం రీ–ఇన్వెస్ట్ సమావేశాలు 2015, 2018ల్లో జరిగాయి.

# ప్రైవేట్ రైళ్ల రెండో దశలో మేఘా, జీఎంఆర్



**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రైళ్ల నిర్వహణకు సంబంధించి రెండో దశ బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు మేఘా ఇంజనీరింగ్, జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ, వెల్‌స్పన్ తదితర సంస్థలు అర్హత సాధించాయి. 12 క్లస్టర్లకు సంబంధించి రిక్వెస్ట్ ఫర్ క్వాలిఫికేషన్ (ఆర్‌ఎఫ్‌క్యూ) రౌండ్‌లో మొత్తం 16 సంస్థల నుంచి 120 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 102 దరఖాస్తులు.. రెండో దశ అయిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)కి అర్హత పొందినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. అత్యధిక ఆదాయానికి అవకాశమున్న ఢిల్లీ, ముంబై క్లస్టర్లపై కంపెనీలు ఎక్కువగా ఆసక్తి చూపాయి. సికింద్రాబాద్ క్లస్టర్‌కు తొమ్మిది సంస్థలు అర్హత పొందాయి. 2023 నాటికి ప్రాథమికంగా 12 ప్రైవేట్ రైళ్లతో ప్రైవేట్ రైల్వే సర్వీసులు ప్రారంభించాలని రైల్వేస్ శాఖ భావిస్తోంది. 2027 నాటికి వీటిని 151 రైళ్లకు పెంచాలని యోచిస్తోంది. ఇందుకోసం రెండు దశల్లో (ఆర్‌ఎఫ్‌క్యూ, ఆర్‌ఎఫ్‌పీ) పారదర్శకమైన బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా కంపెనీల ఎంపిక చేపట్టింది. ఇందులో భాగంగానే జూలై 1న ఆర్‌ఎఫ్‌క్యూని ప్రకటించింది. వీటికి వచ్చిన దరఖాస్తులను అక్టోబర్ 7న తెరిచింది. దరఖాస్తు చేసుకున్న వాటిల్లో బీహెచ్‌ఈఎల్, మాలెంపాటి పవర్, ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ మొదలైనవి కూడా ఉన్నాయి.

## ఎల్‌ఎన్‌జీ స్టేషన్లపై రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు!




**న్యూఢిల్లీ:** దేశీయంగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) స్టేషన్ల ఏర్పాటుపై వచ్చే మూడేళ్లలో రూ. 10,000 కోట్ల పైచిలుకు పెట్టుబడులు రాగలవని కేంద్రం అంచనా వేస్తోంది. రవాణా స్వరూపాన్ని ఎల్‌ఎన్‌జీ ఇంధనం సమూలంగా మార్చేయగలదని భావిస్తోంది. తొలి 50 ఎల్‌ఎన్‌జీ డిస్పెన్సింగ్ స్టేషన్ల నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం ఈ విషయాలు తెలిపారు. ఇవి ఏడాది వ్యవధిలో అందుబాటులోకి రాగలవని ఆయన చెప్పారు. ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 20 దాకా, హిందుస్తాన్ పెట్రోలియం 11, భారత్ పెట్రోలియం 11, గెయిల్ 6, పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ రెండు స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాయి. గుజరాత్‌లో అత్యధికంగా 10, తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఆంధ్రప్రదేశ్‌లో 6, తెలంగాణలో 2 స్టేషన్లు ఉండనున్నాయి. నిర్వహణ వ్యయాలతో పాటు కర్బన ఉద్గారాలను కూడా ఎల్‌ఎన్‌జీ తగ్గిస్తుందని మంత్రి తెలిపారు.

# రిలయన్స్ రిటైల్ నిధుల సమీకరణ పూర్తి

**10.09 శాతం వాటా విక్రయం ● రూ. 47,265 కోట్ల విలువైన డీల్స్**

| కంపెనీ | వాటా(%) | పెట్టుబడి (కోట్లలో) |
|---|---|---|
| సిల్వర్ లేక్ పార్ట్‌నర్స్ | 1.60 | 7,500 |
| సిల్వర్ లేక్ పార్ట్‌నర్స్ – కో–ఇన్వెస్టర్స్ | 0.40 | 1,875 |
| కేకేఆర్ | 1.19 | 5,550 |
| ముబదాల | 1.33 | 6,247.5 |
| ఏడీఐఏ | 1.18 | 5,512.5 |
| జీఐసీ | 1.18 | 5,512.5 |
| టీపీజీ | 0.39 | 1,837.5 |
| జనరల్ అట్లాంటిక్ | 0.78 | 3,675 |
| పీఐఎఫ్ | 2.04 | 9,555 |




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ రూ.47,265 కోట్ల విలువైన నిధుల సమీకరణ పూర్తి చేసినట్టు బిలియనీర్ ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం తెలిపింది. ఇందుకోసం రిలయన్స్ రిటైల్ 10.09 శాతం వాటాలను విక్రయించిన సంగతి తెలిసిందే.

**రెండు నెలల్లో పూర్తి...**

రిటైల్ రంగంలో అతిపెద్ద నిధుల సమీకరణ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేసినట్టు రిలయన్స్ ప్రకటించింది. ఈ డీల్స్‌కు సంబంధించి నిధులు స్వీకరించినట్టు తెలిపింది. అందుకు తగ్గట్టుగా రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో (ఆర్‌ఆర్‌వీఎల్) ఈ సంస్థలకు 69,27,81,234 వాటాల కేటాయింపు సైతం పూర్తి అయిందని వివరించింది. సిల్వర్ లేక్ పార్ట్‌నర్స్, కేకేఆర్, ముబదాల, ఏడీఐఏ, జీఐసీ, టీపీజీ, జనరల్ అట్లాంటిక్, పీఐఎఫ్ కంపెనీలు ఆర్‌ఆర్‌వీఎల్‌లో మొత్తం 10.09 శాతం వాటాలకుగాను రూ.47,265 కోట్లు పెట్టుబడి చేశాయి. సెప్టెంబరు 25న మొదలై నవంబర్ 9 వరకు ఈ పెట్టుబడుల వరద కొనసాగింది. బలమైన, పేరున్న భాగస్వాములను ఆర్‌ఆర్‌వీఎల్‌లో కలిగి ఉన్నందుకు గర్వంగా ఉందని ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ ఇషా ముకేశ్ అంబానీ తెలిపారు.

## టెక్ రంగానికి ఉత్తేజం: క్రిస్ అంచనాలు



**బెంగళూరు:** రాబోయే రోజుల్లో అవుట్‌సోర్సింగ్ వ్యాపారం మరింతగా పెరగనుందని ఐటీ దిగ్గజం క్రిస్ గోపాలకృష్ణన్ తెలిపారు. ఈ నేపథ్యంలో టెక్ రంగానికి రానున్న 30 ఏళ్ల కాలం మరింత ఉత్తేజకరంగా ఉండబోతోందని బెంగళూరు టెక్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. కోవిడ్ సంక్షోభ సమయంలోనూ దేశీ ఐటీ రంగం మెరుగ్గా రాణించిందని, అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని చూరగొందని క్రిస్ తెలిపారు. వర్క్ ఫ్రం హోమ్ విధానానికి మళ్లినప్పటికీ ఐటీ కంపెనీలు, గ్లోబల్ డెలివరీ సెంటర్లు ఎక్కడా కూడా కస్టమర్లకు అందించే సేవల్లో అంతరాయం ఏర్పడకుండా కార్యకలాపాలు సాగించాయని ఆయన పేర్కొన్నారు.

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 73.55 | 75.20 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 96.72 | 100.05 |
| € | యూరో | | 86.53 | 89.64 |
| ¥ | జపాన్ ఎన్ (100) | | 70.39 | 73.01 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | | 53.14 | 55.42 |
| S$ | సింగపూర్ డాలర్ | | 54.42 | 56.29 |
| SAR | సౌదీ రియాల్ | | 18.91 | 20.52 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 18.38 | 21.41 |
| ¥ | చైనా యువాన్ | | 10.16 | 12.12 |

**బులియన్** రూ.లలో

| | | |
|---|---|---|
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 49,770 | ▼ 420 |
| బంగారం (22 క్యారెట్లు) | 47,400 | ▼ 400 |
| వెండి (కిలో) | 66,000 | ▼ 1700 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 52,070 | ▼ 450 |
| బంగారం (22 క్యారెట్లు) | 46,630 | ▼ 630 |
| వెండి (కిలో) | 63,500 | ▼ 1650 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 20-11-2020 | |
|---|---|
| విశాఖ | 470–00 |
| చిత్తూరు | 493–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 471–00 |
| విజయవాడ | 471–00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **19-11-2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 474–00 |
| వరంగల్ | 476–00 |
| రిటైల్ ధర | 5.35 |

# భారత్ ఎకానమీకి వెలుగు రేఖలు!

**గోల్డ్‌మన్ శాక్స్‌కు తోడయిన మూడీస్ ● క్షీణ రేటు అంచనా 11.5 శాతం నుంచి 10.6 శాతానికి తగ్గింపు**




**న్యూఢిల్లీ:** భారత్ ఆర్థిక రంగానికి సంబంధించి కొంత ఆశావహమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. క్రితం క్షీణ రేటు అంచనాల తగ్గింపు వరుసలో తాజాగా మూడీస్ నిలిచింది. కరోనా ప్రేరిత సవాళ్ల నేపథ్యంలో 2020 ఏప్రిల్–2021 మార్చి మధ్య భారత్ ఆర్థిక వ్యవస్థ 11.5 శాతం క్షీణిస్తుందన్న తన తొలి అంచనాలను మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ గురువారం మైనస్ 10.6 శాతానికి తగ్గించింది. తయారీ రంగానికి, ఉపాధి కల్పనకు కేంద్ర ఉద్దీపన చర్యలు దోహదపడతాయని సూచించింది. అంతర్జాతీయ బ్రోకరేజ్ దిగ్గజం–గోల్డ్‌మన్ శాక్స్ తన క్రితం భారీ 14.8 శాతం క్షీణ అంచనాలను 10.3 శాతానికి సవరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా మూడీస్ క్షీణ రేటు కుదింపునకు తగిన విశ్లేషణలతో ముందుకు వచ్చింది. 2020లోసైతం క్షీణ రేటు అంచనాలను మూడీస్ ఇంతక్రితం మైనస్ 9.6 శాతం అంచనావేయగా, తాజాగా దీనిని మైనస్ 8.9 శాతానికి తగ్గించింది. కరోనా వైరస్ సంక్షోభంతో దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం ధ్యేయంగా ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ (స్వావలంబన భారత్) 3.0 పేరుతో కేంద్రం నవంబర్ 12వ తేదీన 2.65 లక్షల కోట్ల ప్యాకేజీని ప్రకటించిన సంగతి తెలిసిందే. లాక్‌డౌన్ అమలు చేసినప్పట్నుంచీ ఇప్పటిదాకా ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీల మొత్తం పరిమాణం దాదాపు రూ. 30 లక్షల కోట్లుగా ఉంటుందని (స్థూల దేశీయోత్పత్తిలో 15 శాతం) ఈ ప్యాకేజ్ సందర్భంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. భారత తయారీ రంగంలో పోటీతత్వాన్ని పెంచడానికి, ఉపాధి కల్పనకు, మౌలిక రంగంలో పెట్టుబడులకు మద్దతునివ్వడానికి కేంద్రం తాజాగా ప్రకటించిన రూ.2.7 లక్షల కోట్ల ఉద్దీపన చర్యలు ''క్రెడిట్ పాజిటివ్''అని తెలిపింది. 2021–22లో భారత్ వృద్ధి సైతం 10.8 శాతంగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపింది. ఇంతక్రితం ఈ అంచనా 10.6 శాతం.

**పలు సంస్థల అంచనాలు ఇలా...**

కరోనా కల్లోల పరిస్థితులతో మొదటి త్రైమాసికం భారత్ ఆర్థిక వ్యవస్థ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 23.9 శాతం క్షీణ రేటును నమోదుచేసుకున్న నేపథ్యంలో... ఇప్పటికే పలు ఆర్థిక, రేటింగ్ సంస్థలు 2020–21లో భారత్ ఆర్థిక వ్యవస్థ క్షీణ రేటు 8 శాతం నుంచి 11% వరకూ ఉంటుందని అంచనావేశాయి.

**ఆయా అంచనాలను పరిశీలిస్తే (శాతాల్లో)**

| సంస్థ | క్షీణత అంచనా |
|---|---|
| కేర్ | 8.2 |
| యూబీఎస్ | 8.6 |
| ఎస్అండ్‌పీ | 9 |
| ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ | 9 |
| ఆర్‌బీఐ | 9.5 |
| ప్రపంచబ్యాంక్ | 9.6 |
| ఫిచ్ | 10.5 |
| ఎస్‌బీఐ ఎకోర్యాప్ | 10.9 |
| ఇక్రా | 11 |
| ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ | 11.8 |
| ఐఎంఎఫ్ | 10.3 |

**ఏడాదిలోనే ఆర్థిక రికవరీ: ఇండియాలెండ్స్ సర్వే భరోసా**

వచ్చే 12 నెలల్లో ఆర్థిక రికవరీ నెలకొంటుందన్న విశ్వాసం ఒక జాతీయ సర్వేలో వ్యక్తం అయ్యింది. సర్వేలో 77 శాతం మంది ఏడాదిలోపే రికవరీ ఉంటుందన్న భరోసాతో ఉంటే, వీరిలో 27 శాతం మంది మూడు నెలల్లోపే రికవరీ ఉంటుందన్న నమ్మకంతో ఉన్నారు. డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫాం ఇండియాలెండ్స్ ఈ సర్వే నిర్వహించింది. నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం లేదా సొంత వ్యాపారం ప్రారంభించే పనిలో చాలా మంది నిమగ్నమయ్యారని సర్వేలో తేలింది. ఈ సర్వేలో 18–55 ఏళ్ల వయసున్న వేతన జీవులు, స్వయం ఉపాధి పొందుతున్న 1,700 మంది పాల్గొన్నారు. వీరిలో 41 శాతం మంది 25–35 ఏళ్ల వయసున్న యువత ఉన్నారు.

**సెప్టెంబర్ త్రైమాసికంలో క్షీణత 9.5 శాతం: ఇక్రా**

జీడీపీ సెప్టెంబర్ త్రైమాసికంలో 9.5 శాతం క్షీణిస్తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేసింది. నవంబర్ 27న తాజా గణాంకాలు విడుదల కానున్న నేపథ్యంలో ఇక్రా ఈ అంచనాలను ఆవిష్కరించింది. ఉత్పత్తి వరకూ పరిగణనలోకి తీసుకునే జీవీఏ (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్) విషయంలో పరిశ్రమల క్షీణ రేటు అంచనాలను 38.1% నుంచి 9.3 శాతానికి తగ్గించింది. తయారీ, నిర్మాణ, సేవల రంగాలు తొలి అంచనాలకన్నా మెరుగుపడే అవకాశం ఉందని ఇక్రా ఈ సందర్భంగా పేర్కొంది.

**2020-25 మధ్య వృద్ధి 4.5 శాతమే: ఆక్స్‌ఫర్డ్ ఎకానమీస్**

భారత్ ఆర్థిక వ్యవస్థ 2020–25 మధ్య 4.5 శాతం వృద్ధి రేటునే సాధిస్తుందని ప్రపంచ గణాంకాల దిగ్గజ సంస్థ– ఆక్స్‌ఫర్డ్ ఎకానమీస్ గురువారం అంచనావేసింది. ఇంతక్రితం ఈ అంచనా 6.5 శాతం. కరోనా ప్రేరిత అంశాలే తమ అంచనాల సవరణకు కారణమని పేర్కొంది. ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు 2020–21 స్థూల దేశీయోత్పత్తిలో 7 శాతం ఉంటుందని సంస్థ విశ్లేషించింది.

# సినిమా


● కంగనా రనౌత్

**సినిమాను నడిపేది హీరో.
కథలో డ్రైవింగ్ సీట్ ఎప్పుడూ తనదే.
అయితే సినిమాలన్నీ ఆ దారిలోనే కాకుండా
వేరే రూట్ కూడా తీసుకున్నాయి.
స్టీరింగ్ సీట్‌ను హీరోయిన్‌కి ఇస్తున్నాయి.
కథను గమ్యం వరకు సురక్షితంగా నడిపించగలం అని
హీరోయిన్లు నిరూపిస్తున్నారు.
ఇప్పుడు గమ్యం ఆకాశం వైపు మారింది.
ఆకాశమే హద్దు అయింది.
హీరోయిన్లు పైలట్లు అవుతున్నారు.
టేకాఫ్‌కి ఆల్వేస్ రెడీ అంటున్నారు.
ఆ హీరోయిన్ల విశేషాలు.**

## ఆకాశమే హద్దు

### తొలి లేడీ పైలట్

జాన్వీ కపూర్ టైటిల్ రోల్‌లో ఈ ఏడాది విడుదలైన సినిమా 'గుంజన్ సక్సేనా'. ఫైటర్ పైలట్ నడిపిన తొలి మహిళ గుంజన్ సక్సేనా జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. గుంజన్ పాత్రలో జాన్వీ నటించారు. ఈ పాత్రలో ఒదిగిపోవడానికి హెలీకాప్టర్ నడపడం గురించి కొన్ని మెళకువలు తెలుసుకున్నారు జాన్వీ. ఒక పైలట్ బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి కొన్ని శిక్షణా తరగతులకు హాజరయ్యారు. జాన్వీ శ్రమ వృథా కాలేదు. బాగా నటించింది అనే ప్రశంసలు దక్కాయి.


● జాన్వీ కపూర్

### డిసెంబర్‌లో టేకాఫ్

'తేజస్' సినిమా కోసం పైలట్‌గా మారబోతున్నారు కంగనా రనౌత్. సర్వేష్ మేవార దర్శకత్వంలో కంగనా ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రం 'తేజస్'. ఇందులో ఎయిర్ ఫోర్స్ పైలట్‌గా కనిపించనున్నారామె. డిసెంబర్‌లో ప్రారంభం కానున్న సినిమాలోని పాత్ర కోసం కఠినమైన శిక్షణలో ఉన్నారు కంగనా. దివంగత నటి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ 'తలైవి' కోసం పెరిగిన బరువు తగ్గిస్తూ, పైలట్‌గా ఫిట్‌గా కనిపించడానికి శ్రమిస్తున్నారు. కంగనా కూడా హెలీకాప్టర్ నడిపే క్లాసులకు హాజరవుతున్నారు. ''ధైర్యవంతుల పాత్రను స్క్రీన్ మీదకు తీసుకురావడం చాలా గర్వంగా ఉంది'' అన్నారు కంగనా.

### కో పైలట్

అజయ్ దేవగన్ దర్శకత్వంలో అమితాబ్ బచ్చన్ హీరోగా 'మే డే' టైటిల్‌తో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతోపాటు ఓ కీలక పాత్రలో అజయ్ నటించనున్నారు. ఇందులో రకుల్ ప్రీత్ నటిస్తున్నారని గురువారం ప్రకటించారు. అమితాబ్ బచ్చన్ పైలట్, రకుల్ కో పైలట్‌గా కనిపిస్తారు. ''ఈ సినిమా చేయడం థ్రిల్లింగ్‌గా ఉంది. త్వరలోనే శిక్షణ ప్రారంభించి టేకాఫ్‌కి రెడీ అవుతాను'' అన్నారు రకుల్.

పాత్ర ఏదైనా పర్ఫెక్ట్ అనిపించుకోవడానికి కథానాయికలు ఇష్టంగా కష్టపడుతున్నారు. హీరోయిన్ల ప్రతిభను ఛాలెంజ్ చేసే పాత్రలు మరిన్ని రావాలి. హీరోయిన్ల పాత్రల మీద గీసిన హద్దులన్నీ చెరిపేసేలా దూసుకెళ్లాలి.


● రకుల్ ప్రీత్‌సింగ్

## డేట్ ఫిక్స్

షూటింగ్ ప్రారంభానికి కొబ్బరికాయ కొట్టనే లేదు.. అప్పుడే తెరపైకి సినిమాని తెచ్చే తేదీని కూడా ఫిక్స్ చేసేసింది 'ఆదిపురుష్' చిత్ర బృందం. ప్రభాస్ హీరోగా బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కించనున్న ఈ చిత్రాన్ని 2022 ఆగస్ట్ 11న విడుదల చేయనున్నారు. టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో భూషణ్ కుమార్, ఓం రౌత్, కిషన్ కుమార్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్ నిర్మించనున్న ఈ సినిమాతో ప్రభాస్ బాలీవుడ్‌లో డైరెక్ట్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆయన రాముడి పాత్ర పోషించనున్నారనే సంగతి తెలిసిందే. ''ప్రతీ పాత్రకు ఒక్కో ఛాలెంజ్ ఉంటుంది. కానీ ఈ సినిమాలో నేను చేయబోయే పాత్రకు ఛాలెంజ్‌తో పాటు చాలా బాధ్యత కూడా ఉంది'' అని ఈ సినిమాని ప్రకటించినప్పుడే ప్రభాస్ అన్నారు. ఈ పాత్ర కోసం కసరత్తులు కూడా మొదలుపెట్టారని టాక్. భారీ బడ్జెట్‌తో త్రీడీ చిత్రంగా రూపొందనున్న 'ఆదిపురుష్' ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. వచ్చే ఏడాది జనవరిలో షూటింగ్ ప్రారంభిస్తారు. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.


● ప్రభాస్

స్పెషల్ ఎడిషన్
సాక్షి SAKSHI TV

దేశంలో ఇందరు హీరోలు ఉండగా
గాంధీగిరిని హీరోగా చేశాడు అతడు.
సంజయ్ దత్ కథను
రణబీర్ కపూర్‌తో తీయగలడు అతడు.
హాస్పిటల్‌ను క్యారమ్స్ రూమ్‌గా
మార్చగలడు అతడు.
అంతరిక్ష జీవికి గంగా స్నానం
చేయించగలడు అతడు.
దర్శక మాంత్రికుడు
రాజ్‌కుమార్ హిరాణి బర్త్‌డే స్పెషల్



లగేరహో హిరాణి
ఈరోజు సాయంత్రం
4.30 గంటలకు
మళ్లీ రాత్రి 11.30
గంటలకు
మీ సాక్షి టివిలో

## అందరి కథ


● శ్రీకాంత్, సుమంత్ అశ్విన్

రోడ్డు ప్రయాణం నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇదే మా కథ'. (రైడర్స్ స్టోరీ అనేది ఉపశీర్షిక). సుమంత్ అశ్విన్, శ్రీకాంత్, భూమిక, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. గురుపవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్. సుబ్రహ్మణ్యం ఆశీస్సులతో మనోరమ గురప్ప సమర్పణలో గురప్ప పరమేశ్వర ప్రొడక్షన్స్ పతాకంపై జి.మహేష్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో 'ఇదే మా కథ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. గురుపవన్ మాట్లాడుతూ– ''నేను రైడర్‌ని. అందుకే ఆ నేపథ్యంలో కథ రాశా. డిసెంబర్‌లో షూటింగ్ పూర్తి చేస్తాం'' అన్నారు. ''ఇది మనందరి కథ. చాలా ఎమోషన్స్‌తో ట్రావెల్ అయ్యే స్క్రిప్ట్'' అన్నారు జి.మహేష్. శ్రీకాంత్ మాట్లాడుతూ– ''చిన్నప్పుడు చాలాసార్లు రైడింగ్‌కి వెళ్లాను. ఒకసారి హైదరాబాద్ నుండి లడక్‌కి కారులో వెళ్లాను. ఇప్పుడు ఈ టీమ్‌తో లడక్ వెళ్లడం ఒక మంచి అనుభూతి'' అన్నారు. ''బైక్ రైడింగ్ అంటే ఇష్టం కానీ నేను ప్రొఫెషనల్ రైడర్‌ని కాదు. గురుపవన్ నాకు శిక్షణ ఇచ్చారు'' అన్నారు సుమంత్ అశ్విన్. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చిరంజీవి ఎల్.

## అద్భుత మహిళ రాబోతోంది


● గాల్ గాడోట్

స్పైడర్ మేన్, సూపర్ మేన్, హీ మేన్, బ్యాట్ మేన్... ఏం మగవాళ్లకే అతీత శక్తులుంటాయా? ఆడవాళ్లకు ఉండవా అంటే.. 'నేనున్నాను' అంటూ 'వండర్ ఉమన్' తెరపైకి దూసుకొచ్చింది. ఈ అద్భుత మహిళ సృష్టికర్త ఎవరంటే దర్శకురాలు ప్యాటీ జెన్‌కిన్స్. స్పైడర్ మేన్, హీ మేన్.. ఇంకా వేరే పవర్ ఫుల్ మేన్లకు దీటుగా వసూళ్ల వర్షం కురిపించింది 'వండర్ ఉమన్'. 2017లో వచ్చిన ఈ చిత్రంలో గాల్ గాడోట్ కథానాయికగా నటించారు. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్ 'వండర్ ఉమన్ 1984'లో గాల్ గాడోట్‌నే కథానాయికగా ఎంపిక చేసి, ప్యాటీ జెన్ కిన్స్ తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని జూన్ 5న విడుదల చేయాలనుకున్నారు. కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఇంకా ఆగడం సరికాదని ప్రపంచవ్యాప్తంగా ఎక్కడెక్కడ థియేటర్లు రీఓపెన్ అయ్యాయో అక్కడ వచ్చే నెల 16న, హెచ్‌బీటీ మ్యాక్స్‌లో 25న విడుదల చేయాలని చిత్రనిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్ నిర్ణయించుకుంది.


● రాజారవీంద్ర, శ్రీముఖి, మనో, భరణి

## క్రేజీ అంకుల్స్

శ్రీముఖి, భరణి, మనో, పోసాని కృష్ణమురళి, రాజారవీంద్ర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ అంకుల్స్'. ఇ. సత్తిబాబు దర్శకత్వంలో శ్రీవాస్ 2 క్రియేటివ్ టీమ్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం పాట మినహా పూర్తయింది. ''ఇందులో మంచి ఎంటర్‌టైనింగ్ రోల్ చేశాను'' అన్నారు గాయకుడు మనో. ''యోగా టీచర్ పాత్ర చేశాను. కరోనా టైమ్‌లో పనులు లేక ఇబ్బందులు పడుతున్న ఆర్టిస్టులు, టెక్నీషియన్స్‌కి ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉపాధి కల్పించటం అభినందించాల్సిన విషయం'' అన్నారు పోసాని. దర్శకుడు, ఈ చిత్రనిర్మాత శ్రీవాస్ మాట్లాడుతూ– ''డార్లింగ్ స్వామి' చెప్పిన పాయింట్ నచ్చి ఈ సినిమా చేశాం. ఎంటర్‌టైన్‌మెంట్ బేస్ చేసుకుని చేసిన చిత్రమిది'' అన్నారు. ''ఇందులో నాది ఫుల్ లెంగ్త్ రోల్'' అన్నారు రాజారవీంద్ర. ''టీవీ షోల ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన నేను ఈ చిత్రంలో మంచి పాత్ర చేశాను'' అన్నారు శ్రీముఖి. ''సినిమా చేస్తున్నప్పుడు మేం ఎంత ఎంజాయ్ చేశామో, చూస్తున్నప్పుడు ఆడియన్స్ అంతే ఎంజాయ్ చేస్తారు'' అన్నారు ఇ. సత్తిబాబు. హేమ, డార్లింగ్ స్వామి, శ్రేయాస్ శ్రీను, భరణి తదితరులు పాల్గొన్నారు.

## రీమేకింగ్

అక్షయ్ కుమార్‌ని బాలీవుడ్‌లో ఖిలాడీ కుమార్ అంటుంటారు. ఇప్పుడైతే రీమేక్ కింగ్ అంటున్నారు. దానికి కారణం లేకపోలేదు. తెలుగు 'విక్రమార్కుడు'ని 'రౌడీ రాథోడ్'గా, తమిళ చిత్రాలు 'తుపాకీ'ని 'హాలిడే' పేరుతో, 'రమణ'ను 'గబ్బర్ ఈజ్ బ్యాక్' టైటిల్‌తో రూపొందిన హిందీ రీమేక్స్‌లో నటించారు అక్షయ్. ఇటీవల 'కాంచన' రీమేక్ 'లక్ష్మీ'లో నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తమిళ్ 'జిగర్తండా' రీమేక్ 'బచ్చన్ పాండే'లో నటిస్తున్నారు. ఇప్పుడు అర్థమయ్యే ఉంటుంది.. ఆయన్ను రీమే'కింగ్' అని ఎందుకు అంటున్నారో! తాజాగా మరో రీమేక్‌కి రెడీ అవుతున్నారని సమాచారం. సూర్య హీరోగా సుధ కొంగర దర్శకత్వం వహించిన 'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశమే నీ హద్దురా') రీమేక్‌లో అక్షయ్ నటించనున్నారని టాక్. ఈ చిత్రానికి మంచి ప్రశంసలు లభించిన విషయం తెలిసిందే. రీమేక్‌కి సుధ కొంగరనే దర్శకత్వం వహించే అవకాశం ఉందనే వార్త ప్రచారంలో ఉంది. నిజానికి దర్శకురాలిగా తన తొలి చిత్రం 'ఇరుది సుట్రు'ని ఏకకాలంలో తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కించారు సుధ. ఆ సినిమాకి కూడా అభినందనలు అందుకున్నారు. అదే చిత్రాన్ని వెంకటేశ్ హీరోగా 'గురు' పేరుతో తెలుగులో రీమేక్ చేసిన విషయం తెలిసిందే. మరి.. 'సూరరై...' హిందీ రీమేక్ ఉంటుందా? ఉంటే సుధానే తెరకెక్కిస్తారా? వేచి చూడాలి.


● అక్షయ్ కుమార్

## ....అయినా? క్వారంటైన్


● సల్మాన్ ఖాన్

కండలవీరుడు సల్మాన్ ఖాన్ 14 రోజులపాటు హోమ్ క్వారంటైన్‌లో ఉండాలని నిర్ణయించుకున్నారు. సల్మాన్ మాత్రమే కాదు.. ఆయన ఫ్యామిలీ మొత్తం క్వారంటైన్‌లో ఉంటున్నారు. ఈ మధ్యకాలంలో క్వారంటైన్ అనే పదం వినగానే గుర్తొచ్చే మరో పదం 'పాజిటివ్'. ఇప్పుడు సల్మాన్ ఈ నిర్ణయం తీసుకున్నారు కాబట్టి ఆయన కుటుంబం మొత్తానికి కరోనా పాజిటివ్ అని అనుకుంటున్నారా? పాజిటివ్ కాదు.. అయినా హోమ్ క్వారంటైన్‌లో ఉంటున్నారు. ఎందుకంటే సల్మాన్ కారు డ్రైవర్ శంకర్‌కు కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయింది. అతన్ని ఆసుపత్రిలో చేర్చి, ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు. శంకర్‌తో పాటు సల్మాన్ పర్సనల్ స్టాఫ్‌కు కూడా పాజిటివ్ అని తేలటంతో తనకు తానుగా ఫ్యామిలీ అందరితో కలిసి క్వారంటైన్‌కు వెళ్లారు సల్మాన్. కండలవీరుడు క్వారంటైన్‌కు వెళ్లటంతో ఈ వారం 'బిగ్‌బాస్–14' వీకెండ్‌వార్ ప్రోగ్రామ్‌ను నిర్వహించటానికి వస్తారా? లేక మరో స్టార్ ఎవరైనా ఈ షూట్‌లో పాల్గొంటారా అనే చర్చ జరుగుతోంది. ఈ విషయం గురించి సల్మాన్ నుంచి కానీ, 'బిగ్ బాస్' టీమ్ నుంచి కానీ ఎటువంటి సమాచారం లేదు.

## నవ్వించడానికి రెడీ


● ఇలియానా

'నవ్వించడానికి మేం రెడీ. నవ్వడానికి సిద్ధంగా ఉండండి' అంటున్నారు ఇలియానా. రణ్‌దీప్ హుడా, ఇలియానా జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'అన్ ఫెయిర్ అండ్ లవ్లీ'. బల్వీందర్ సింగ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ప్రస్తుతం సమాజంలో వర్ణ వివక్ష ఎలా ఉంది అనే కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో చూపించనున్నారు. వర్ణ వివక్ష చేసేవాళ్ల మీద ఇదో వ్యంగ్యాస్త్రం అని కూడా ఓ టాక్. ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. కోవిడ్ జాగ్రత్తలను పాటిస్తూ, పూర్తి చేశారు. ''ఈ చిత్రబృందాన్ని చాలా మిస్ అవుతాను. రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మీ అందర్నీ (ప్రేక్షకుల్ని) మా సినిమాతో నవ్వించడానికి రెడీ అయ్యాం'' అన్నారు షూటింగ్ ముగిసిన సందర్భంగా ఇలియానా. ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది.

## అపార సంపద కోసం వేట


● రాహుల్, ఆకాష్ పూరి, పృథ్వీ శేఖర్, సందీప్ మాధవ్

ఫైట్‌మాస్టర్ పృథ్వీ శేఖర్, సబీనా జాస్మిన్ జంటగా రమేష్ రాణా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'క్లూ'. సుబాని అబ్దుల్ నిర్మాత. ఈ చిత్రం ట్రైలర్‌ని 'జార్జి రెడ్డి' హీరో సందీప్ మాధవ్, హీరోలు ఆకాష్ పూరి, రాహుల్ విజయ్, దర్శకుడు వీరశంకర్, ఫైట్ మాస్టర్ విజయ్ విడుదల చేశారు. ''ఫైట్ మాస్టర్‌గా చాలా ఆఫీసులకి తిరిగాను. నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలనుకుంటున్న టైమ్‌లో సుబాని అబ్దుల్ హీరోగా చాన్స్ ఇచ్చారు'' అన్నారు పృథ్వీశేఖర్. ''వందల ఏళ్ల క్రితం కనుమరుగైన అపార సంపదని ఎలా వెతికారు? దుష్టశక్తులను ఎలా ఎదిరించారనేది కథ'' అన్నారు రమేష్ రాణా. ''ర్యాప్ రాక్ షకీల్ సంగీతం, నేపథ్య సంగీతం అదనపు బలం. రమేష్ రాణా అద్భుతంగా తెరకెక్కించాడు'' అన్నారు సుబాని.

సన్నిధి సాక్షి ఫ్యామిలీ

విజయవాడ । శుక్రవారం । 20-11-2020


# పుష్కరతుంగ... భద్రగంగ

- నేటి మధ్యాహ్నం 1.21 గంటలకు పుష్కర ప్రవేశం.
- ఈ మేరకు దేవదాయ శాఖ ప్రభుత్వానికి సమాచారం.
- పుష్కరాలలో నదీ స్నానాలకు బదులు జల్లు స్నానాలకు ఏర్పాట్లు.
- ఘాట్ల వద్ద పిండ ప్రదాన కార్యక్రమాలకు పురోహితుల నియామకం.
- నేటి నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు పుష్కరాలు కొనసాగుతాయి.
- 23 పుష్కర ఘాట్లు సిద్ధం.




**జలాన్ని దేవతా రూపంలో తల్లిగా భావించి పూజించడం హిందువుల సంప్రదాయం. నదీస్నానాలు, కోనేటి స్నానాలు, మంగళ స్నానాలు, సముద్ర స్నానాలు... అలాగే తీర్థ యాత్రలు, పుణ్య క్షేత్రాలు దర్శనం... సమస్తం నీటితో ముడిపడి వున్నాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్యప్రదమని హిందువుల విశ్వాసం. సకల జీవరాశులకు ప్రధానమైన జల స్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు.**

'తుంగే పానీ.. గంగే స్నానే' అన్నది ఆర్యోక్తి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీనికి అర్థం! అసలు తుంగభద్ర నది ఎలా ఏర్పడిందో తెలుసుకుందాం...

హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రంలో వేయగా శ్రీ మహావిష్ణువు వరాహావతారమెత్తి తన కోరలతో భూమిని సాగరం నుండి పైకెత్తి సర్వజీవులనూ రక్షించాడు. తుంగ (ఎత్తు) నుండి రావడం వల్ల తుంగానదిగానూ, హిరణ్యాక్షుని సంహరించే సమయంలో వరాహ రూపుడైన విష్ణువు కుడి కోర నుండి కారిన లాలా జలం భద్రానదిగానూ ఉద్భవించాయి. పుష్కరాలు జరిగే 12 నదులలో తుంగభద్ర ఒకటి.

రాష్ట్రంలో చివరి తుంగభద్ర పుష్కరాలు 2008 లో జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి తుంగభద్ర పుష్కరాలు ఇవే. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదిలో కొలువై ఉంటారని, ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

**ప్రముఖ దేవాలయాలను తాకుతూ వెళుతున్న తుంగభద్ర..**

**కర్ణాటక:** శృంగేరి (చిక్కమగళూరు), పంపావతి దేవాలయం (కంప్లి), హరిహరేశ్వర దేవాలయం(హంపి).
**ఆంధ్రప్రదేశ్:** రాఘవేంద్రస్వామి ఆలయం, (మంత్రాలయం), శివరామాలయం (గుండ్రేవుల).
**తెలంగాణ:** సంతాన వేణుగోపాలస్వామి ఆలయం (వేణిసోంపురం), వైకుంఠ నారాయణ స్వామి ఆలయం (రాజోళి), సూర్యనారాయణ స్వామి ఆలయం (పుల్లూరు), జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు (అలంపూర్), సంగమేశ్వరాలయం.

తుంగ, భద్ర నదులు కలసి కర్ణాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమల నుంచి ప్రవహిస్తాయి. ఈ రెండు నదులు కలిసి తుంగభద్ర నదిగా మారి.. కర్ణాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కొత్తాళం మండలం మేళగనూరు వద్ద ప్రవేశిస్తుంది. తెలంగాణలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కుట్కనూరు వద్ద తుంగభద్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం పులికల్, రాజోళి, పుల్లూరు మీదుగా సాగుతూ నదీతీరంలో కొలువైన దేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది.

**పుష్కరాల సందర్భంగా పితృదేవతలకు పిండ ప్రదానం చేసేందుకు మొత్తం 443 మంది పురోహితులను ఎంపిక చేసి, వారికి గుర్తింపు కార్డులను అందజేసింది. పిండ ప్రదానం తదితర కార్యక్రమాలకు రేట్లను ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ నిర్ధారించింది. ఆ వివరాలను వీటి కోసం కేటాయించిన షెడ్ల వద్ద ప్రదర్శించనుంది. పుష్కర ఘాట్లకు సమీపంలోని ఆలయాల్లో దర్శనాలకు ఇబ్బంది లేకుండా అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన దాదాపు 300 మందికి పైగా దేవదాయ శాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. కాగా నేటి మధ్యాహ్నం కర్నూలు జిల్లాలోని సంకల్‌బాగ్ పుష్కర ఘాట్ వద్ద శాస్త్రోక్తంగా జరిగే కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహనరెడ్డి పాల్గొంటారు.**

తుంగభద్ర నది రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురువడంతో తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది.

– ఇన్‌పుట్స్:
**అంబటి తిరుమలేష్**
సాక్షి స్కూల్ ఆఫ్ జర్నలిజమ్

# సాయి సత్య బోధ

**మ**నిషి జీవితంలో సైన్స్‌కి అందని విషయాలు చాలా ఉన్నాయి... రామాయణ.. మహా భారతాల్ని కల్పితాలు అని వాదించే నాస్తికులు, అబ్దుల్ కలాం లాంటి ప్రముఖ శాస్త్రవేత్తలు సైతం సత్యసాయి దర్శనం చేసుకుని ఆయన బోధలను ఆలకించినవారే!



సత్యం ధర్మం శాంతి ప్రేమ అహింస అనే వాటిని ఆయుధాలుగా చేసుకుని.. లవ్ ఆల్ సర్వ్ ఆల్ అని తన బోధనల ద్వారా ప్రజల్లో ప్రేమ తత్వాన్ని నింపారు సత్య సాయి.

నేను మీ నుంచి ఆశించేది ఒక్కటే...అదే ప్రేమ... మీ ప్రేమ నాకు కావాలి.. అంటూ ఉండేవారు సత్యసాయి. భౌతికంగా ఆయన మనకు కనుమరుగై కొన్ని ఏళ్లు గడిచినా ఇప్పటికీ పుట్టపర్తిలోని ప్రశాంతినిలయంలో భగవాన్ జయంతి వేడుకలు జరుగుతూనే ఉన్నాయి.

ఎక్కడెక్కడి నుంచో వచ్చిన అందరూ ఇక్కడ 10 నుంచి 15 రోజులు సేవ చేస్తూ ఒకే కుటుంబంగా ఉంటూ వచ్చిన వాళ్ళకి సేవ చేస్తూ ఉంటారు.

పదాహారేళ్ల పిల్లలు... ఎవరో తిని తాగిన ఎంగిలి విస్తళ్లు, కప్పులు మేము తియ్యడం ఏమిటా అనుకోకుండా ఒకరితో ఒకరు సేవలో పోటీ పడుతూ సంతోషంగా చేస్తున్నారు.

కరోన కారణంగా సామాజిక దూరం పాటించడం కోసం మందిరంలో... ఇంకా చాలా చోట్ల వృత్తాలు గీసి ఉంచారు.

బాబా తన బోధలలో ఎక్కువగా ఒక విషయం చెప్పేవారు... చావుకు భయపడద్దు... చెప్పుడు మాటలు నమ్మద్దు... భగవంతుడిని విడవద్దు... అని. బహుశ వీటిని దృష్టిలో పెట్టుకునే కాబోలు... ఎంతోమంది ఈ కరోన సమయంలో కూడా సేవకు వచ్చారు.

**సత్యసాయి బోధామృతం..**
- రోజును ప్రేమతో మొదలు పెట్టు... ఇతరుల కోసం ప్రేమతో సమయం వెచ్చించు. రోజంతా నీలో ప్రేమను నింపుకో. ప్రేమతోనే ఈ రోజు ముగించు. దేవుణ్ణి గుర్తించడానికి అదే సరైన దారి.
- కోరికలు ప్రయాణాలలో తీసుకు వెళ్లే వస్తువులలాంటివి. ఎక్కువయిన కొద్దీ జీవిత ప్రయాణం కష్టం అవుతుంది.
- దైవమే ప్రేమ. ప్రేమలో జీవించు.
- ప్రతి అనుభవం ఒక పాఠం ప్రతి వైఫల్యం ఒక లాభం
- ఎక్కడ దేవుని మీద విశ్వాసం ఉంటుందో అక్కడ ప్రేమ ఉంటుంది.
- ఎక్కడ ప్రేమ వుంటుందో అక్కడ శాంతి ఉంటుంది. ఎక్కడ శాంతి ఉంటుందో అక్కడ దేవుడు ఉంటాడు.

– ఇన్‌పుట్స్:
**పోరంకి లక్ష్మీప్రసన్న**
*(నవంబర్ 23 సత్యసాయి జయంతి)*

– నిర్వహణ: **డి.వి.ఆర్. భాస్కర్**

# శ్రీకాళహస్తీశ్వర శతకం



**కలం పట్టిన ప్రతివాడు కవి కాలేడు. భావావేశంతో చక్కని పదప్రయోగాలతో వ్రాసిన ఒక్క రసాత్మకమైన వాక్యం చాలు కవి ప్రతిభను గుర్తించటానికి. అలాంటి చరణాలను ఎన్నో కమనీయంగా వ్రాసి ఆంధ్రులకు మహాకవి శ్రీ ధూర్జటి అందచేసిన అపురూపమైన శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని గూర్చి తెలుసుకుందాం...! జీవితమంతా భోగలాలసలతో గడిపిన ఆయన, చివరి సమయంలో జీవిత లక్ష్యం ఏమిటో తెలుసుకొని భక్తి శ్రద్ధలతో వ్రాసిన శతకమిది...**

ధూర్జటి కవి విరచిత పద్యం–1

**శ్రీ విద్యు త్కలితాజవంజవ మహాజీమూత పాపాంబుధా
రావేగంబున మన్మనోబ్జ సముదీర్ణత్వంబు గోల్పోయితిన్
దేవా! మీ కరుణా శరత్సమయమింతే చాలు చిద్భావనా
సేవం దామరతంపరై మనియెదన్ శ్రీకాళహస్తీశ్వరా!**

**తాత్పర్యం:** శ్రీ కాళహస్తీశ్వరా! మెరుపులతో, వడివడిగా కదిలే దట్టమైన మబ్బుల, పాప జలధారల, జీవన్మరణ ప్రవాహంలో, నా మనస్సు అనే తామరపూవు వాడిపోయింది. నీ దయ అనే వెన్నెలబుతువును నాకు అనుగ్రహించు. అంతే చాలు. ఆత్మధ్యానమనే నీ సేవలో నేను తామరతంపరగా మనుగడ సాగిస్తాను.

**తెలుగు: టేకి వీరబ్రహ్మం**

# షోడశ సంస్కారాలు

● వేదవాఙ్మయం

**గృ**హస్థు పాటించాల్సిన సంస్కారాల గురించి మనకు మన ప్రాచీన మహర్షులు గృహ్యా సూత్రాల రూపంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పి ఉన్నారు. సంస్కారం అంటేనే సంస్కరించునది అని అర్థం. అంటే, ఈ సంస్కారాలు పాటించడం ద్వారా మనిషి సంస్కారవంతుడు అగుచున్నాడు. ఏవిధంగా అయితే మట్టిలో ఇతర ఖనిజలవణాలతో కలిసిపోయి దాదాపుగా మట్టిలాగే దొరికిన బంగారం, సంస్కరించబడి, అనుభవ యోగ్యమైన సువర్ణంగా, ఆభరణాలుగా మారుతుందో, అలాగే మనిషి కూడా సంస్కారాలు పాటించడంద్వారా ఉన్నతమైన జీవన విధానాన్ని, పరిపక్వమైన మానసికస్థితిని పొందుచున్నాడు. తద్వారా సమస్తజనాలూ సుఖసంతోషాలతో నివసించగలిగేలా క్రమశిక్షణతో కూడిన నడవడికగల ఒక సర్వోన్నత ధార్మికసమాజాన్ని నిర్మించగలిగాడు.



సంస్కారాల సంఖ్యగురించి అభిప్రాయ భేదాలున్నా, లోకంలో ప్రాచుర్యంపొందినవి మాత్రం పదహారే. ఈ పదహారు రకాల సంస్కారాల గురించి, అవి అనుసరించాల్సిన సమయాల గురించి, వాటి విధానాల గురించి, ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం.

మనిషికి ఈ సంస్కారాలు జరిగినట్లుగా మనకంటికి ఏమైనా మార్పులు కనిపిస్తాయా? అంటే కొన్ని సంస్కారాల తాలూకు మార్పులు కంటికి కనిపిస్తాయి, కొన్ని కనిపించవు. ఎందుకంటే, కొన్ని సంస్కారాలు శరీర సంబంధ వేషభాషలలో మార్పులు తీసుకొస్తే, కొన్ని సంస్కారాలు మానసిక పరిపక్వతనీ, ఉన్నతమైన ఆలోచనావిధానాన్నీ, సామాజిక శ్రేయస్సును కలిగిస్తాయి. శరీర సంబంధ మార్పులు కంటికి కనిపిస్తాయి, కానీ మానసికమైన మార్పులు మాత్రం వారి ప్రవర్తనలో, మాట్లాడే విధానంలో, ఎదుటివారిని గౌరవించే తీరులో, వారు తీసుకునే నిర్ణయాలలో ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, 'వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనవ వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః' అను ఆర్యోక్తిని అనుసరించి, ఒక వ్యక్తి గౌరవించబడాలంటే, పంచవకారాలైన వస్త్రం, వేషభాషలు, విద్యా వినయాలను పాటించాలి. వాటిని నేర్పించేది కూడా ఈ సంస్కారాలే.

గర్భాధానం మొదలుగాగల పదిహేను సంస్కారాలు మనిషి జీవించి వుండగా జరిపించేవి కాగా, పదహారవ సంస్కారమైన అంత్యేష్టిమాత్రం మనిషి మరణించిన తరువాత జరిపించేది. ఇది మానవశరీరాన్ని అగ్ని మొదలైన పంచభూతాలకు హవిస్సుగా అర్పించే పరమ పవిత్రమైన సంస్కారంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. దాదాపుగా ప్రతి సంస్కారమూ అగ్నిని ఆధారంగాచేసుకునే జరపాలని సమస్త గృహ్యశాస్త్రాలూ చెప్తున్నాయి. సంస్కారాల వలన సంస్కరింపబడి, దయ ఓర్పు మొదలైన ఆత్మగుణాలు కలిగినవారు పరమపదాన్ని పొందుతారని స్మృతులు చెప్తున్నాయి. సంస్కారాల వరుసక్రమంలో అభిప్రాయ భేదాలున్నా, దాదాపుగా అందరూ అంగీకరించిన వరుసక్రమాన్ని అనుసరించే వాటిని వివరించడం జరుగుతుంది.

**–ఆచార్య తియ్యబిండి కామేశ్వరరావు**

# ప్రశ్నోత్తర భారతం



58. పురోచనుడు తన భార్యను ఎవరి దగ్గర నియోగించాడు?
59. ఆమె చేయవలసిన పని ఏమిటి?
60. కృష్ణ చతుర్దశి నాటి రాత్రి ఏం జరిగింది?
61. ఉత్సవం ముగిశాక ఏం జరిగింది?
62. పురోచనుడు ఎక్కడ నిద్రించాడు?
63. అర్ధరాత్రి సమయంలో ఏం జరిగింది?
64. పాండవులు సొరంగము తవ్వే వానికి ఏం చెప్పారు?
65. పాండవులు ఏం చేశారు?

**జవాబులు**

58. కుంతి దగ్గర; 59. నిత్యం కుంతి రహస్యాలను పురోచనుడికి తెలియపరచాలి. ఆమె అలాగే చేసేది; 60. ఆ రోజు రాత్రి లక్క ఇంటిలో పాండవులు గొప్ప ఉత్సవం చేశారు. నిషాద స్త్రీ, ఆమె ఐదుగురు కొడుకులు కల్లు తాగారు. తెలివి తప్పి పడిపోయారు. లక్క ఇంటి పక్కనే నిద్రించారు; 61. ఉత్సవం ముగిసింది. అర్ధరాత్రి అయ్యింది. అందరూ నిద్రించారు; 62. ఆయుధాగారంలో నిద్రించాడు; 63. ధర్మరాజు సమయం చూశాడు. భీముడికి అనుమతి ఇచ్చాడు. భీముడు నిప్పు అందుకుని, ఆయుధాగారపు ద్వారానికి నిప్పు అంటించాడు. భగ్గున మండింది. పురోచనుడు ఆ మంటల్లో మరణించాడు; 64. వారి కుశలం తెలిపారు. విదురునికి తెలియపరచమన్నారు; 65. బిలంలోకి ప్రవేశించారు.

**–నిర్వహణ: వైజయంతి పురాణపండ**

● సువార్త

# బుద్ధిహీనతతో చేజారిన సువర్ణావకాశం

**అ**మెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్ తన ఆర్థిక సలహాదారుడు జె.కె.గాల్ బ్రెత్ ఇంటికి ఫోన్ చేశాడు. ఆయన పడుకున్నాడని పనిమనిషి ఎమిలీ జవాబిచ్చింది. 'నేనెవరో తెలుసా? ఆయన్ను లేపు' అన్నాడా అమెరికా అధ్యక్షుడు. 'నేను గాల్ బ్రెత్ గారికి పనిచేస్తున్నాను, అమెరికా అధ్యక్షునికి కాదు' అని జవాబిచ్చి ఆమె ఫోన్ పెట్టేసింది. ఆగ్రహించాల్సింది పోయి, లిండన్ జాన్సన్ ఆమె పనితీరును మెచ్చి ఎమిలీని వైట్ హౌస్‌లో నియమించాడు. యజమాని మనసెరిగి, మెలిగి, ఆయన్ను మెప్పించడం అనే అంశంపైన యేసుప్రభువు ఒక ఉపమానం చెప్పాడు (మత్తయి 25:14–30). ఒక భూస్వామి తన ముగ్గురు దాసులను పిలిచి వాళ్ళ సామర్థ్యాన్ని బట్టి ఒకరికి ఐదు తలాంతులు, ఇంకొకరికి రెండు తలాంతులు, మూడవవాడికి ఒక తలాంతు ఇచ్చి మరో దేశానికి వెళ్ళిపోయాడు. ఒక తలాంతు వెయ్యిడాలర్ల విలువ చేసే వెండితో సమానం. భూస్వామి చాలా కాలానికి తిరిగొచ్చి లెఖ్ఖ అడిగితే మొదటివాడు తన ఐదు తలాంతులు వాడి మరో ఐదు తలాంతులు సంపాదించానని చెప్పగా ఆయన ఎంతో సంతోషించి వాటిని కూడా అతనికే ఇచ్చేశాడు. రెండవ వాడు కూడా మరో రెండు తలాంతులు సంపాదించానని చెబితే అతనికి కూడా అదే చేశాడు. మూడవ దాసుడు మాత్రం ఆయనిచ్చిన ఒక తలాంతునూ భద్రంగా తెచ్చిచ్చి, 'నీవు చాలా కఠినుడివి. దీన్ని పోగొడితే శిక్షిస్తావని భయపడి, గుంత తవ్వి దాన్ని భద్రంగా దాచాను. నీది నీవు తీసుకో' అన్నాడు. యజమాని అందుకు ఆగ్రహోదగ్రుడై, అతనివన్నీ మిగిలిన ఇద్దరికిచ్చి, చీకటి గదిలో అతన్ని బంధించాడు.



అసలేం జరిగింది? ఈ ముగ్గురూ నిజానికి బానిసలు. బానిసలకు స్వాతంత్య్రం ఉండదు, హక్కులుండవు. వాళ్ళ పూర్తి జీవితం, సమయం, సామర్థ్యం పైన యజమానికే పూర్తి హక్కులుంటాయి. అలాంటిది, యజమాని వారిని నమ్మి వాళ్లకు తలాంతులిచ్చి, ఆ బానిసలను కాస్తా తన ఆస్తిలో భాగస్వాములను చేశాడు. ఆ తలాంతులతో ఏదైనా చెయ్యగలిగిన స్వాతంత్య్రాన్ని వారికిచ్చాడు. వారి సామర్థ్యాన్ని గుర్తించి వారికి తనతో సమానమైన స్థాయినిచ్చాడు. చాలా కాలం తర్వాత తిరిగొచ్చాడంటే, వాళ్ళు తమ సామర్థ్యాన్ని పెంచుకొని ప్రయోజకులయ్యేందుకు వారికి బోలెడు సమయమిచ్చాడు. అయితే మూడవ వాడు మూర్ఖుడై, అతితెలివి తేటలకు పోయి యజమాని ఉగ్రత పాలయ్యాడు. యజమాని మళ్ళీ వచ్చేదాకా దొరికిన సమయాన్నంతా సోమరితనంతో, నిష్ప్రయోజకంగా గడిపాడు. వెయ్యి డాలర్ల విలువ చేసే వెండినైతే జాగ్రత్తగా కాపాడాడు కాని, డబ్బుతో వెలకట్టలేని ఆయనిచ్చిన అత్యంత విలువైన స్వాతంత్య్రాన్ని, సామర్థ్యాన్ని, గుర్తింపును, ముఖ్యంగా సమయాన్ని మాత్రం దుబారా చేశాడు. తాళం వేసి గొళ్ళెం మర్చిపోవడమంటే ఇదే. చాలా మంది విశ్వాసులు, దేవుడిచ్చిన అత్యంత విలువైన స్వాతంత్య్రాన్ని, సామర్థ్యాల్ని, సమయాన్ని దుబారా చేస్తూ, డబ్బును ఆస్తులను మాత్రం 'జాగ్రత్తగా' కాపాడుకోవడమే తెలివైన విధానమనుకొని, బాధ్యతారహితంగా బతుకుతారు. అలాంటి సోమరులు, పిసినారులకు జీవితంలో సుఖముండదు, సమాజంలో పరువుండదు, జీవన సాఫల్యం అసలే ఉండదు. భూస్వామి అసలు బాధ, కోపమేమిటంటే, తాను అంతటి సువర్ణావకాశమిచ్చినా, ఆ మూడవ వాడు మారలేదు, ఆత్మీయంగా ఎదగలేదు, ప్రయోజకుడు కాలేదు. పైగా యజమాని ఔదార్యాన్ని, ప్రేమను, కృపను అర్థం చేసుకోకుండా, తన దౌర్భాగ్యాన్ని తెలుసుకోకుండా, 'నీవు విత్తని చోట కోసేవాడవంటూ' ఆయనపైనే అభియోగం మోపాడు. రేపు పరలోకంలో మన 'ప్రోగ్రెస్ రిపోర్టుల్లో' ఇవే వ్యాఖ్యలుంటాయేమో జాగ్రత్త!! దేవుని మనసు, ప్రణాళికల మేరకు, పదిమందికీ ప్రయోజనం కలిగిస్తూ ఆయన్ను ఎంత మెప్పించామన్నదే మన ప్రతిభకు, విలువకు గీటురాయి. కరెన్సీ కట్టలెన్ని కూడబెట్టినా దేవుని దృష్టిలో అవి కేవలం చెత్త కాగితాల గుట్టలే!! కాబట్టే, ఆ రోజున దేవాలయంలో పెద్ద మొత్తాలిచ్చిన ధనికులంతా డాంబికంతో తమ ఫలాన్ని పోగొట్టుకొని పరలోకంలో పరమ నిరుపేదలుగా మిగిలిపోతే, ఒక పేద విధవరాలు మాత్రం కేవలం రెండు కాసులిచ్చి దేవుని మనసు గెలుచుకొని పరలోకంలో అందరికన్నా ధనికురాలు, ధన్యురాలైంది.

**–రెవ.టి.ఎ.ప్రభుకిరణ్**

# వాటికయితే వారంటీలు అడుగుతాం కదా!

● వివాహ సంస్కారం



ఆయనకు దేవాలయానికి వెళ్ళడమంటే ఇష్టం. రామాయణ, భారత భాగవతాలు చదువుకోవడమంటే ఇష్టం. ఆధ్యాత్మిక ప్రవచనాలు వినడం ఇష్టం. ఇప్పుడు ఆయనకు భార్యగా వచ్చే పిల్ల కంటికి అందంగా ఉన్నంత మాత్రాన సరిపోదు. జీవితంలో సంతోషంగా గడపడానికి అవకాశం ఇవ్వదు. అందం కొంత కాలం ఉంటుంది. తరువాత జర్ఝరీ భూతమయిపోతుంది. ఆయన స్వభావానికి తగిన పిల్ల పక్కన ఉన్నప్పుడు ఆయన జీవితం పండడానికి అవకాశం ఉంటుంది. అలాగే ఆ పిల్ల జీవితం కూడా. ఆ పిల్ల భక్తి కలిగిన పిల్ల. పూజలు చేసుకోవడం ఇష్టం. అతిథిని పిల్చి అన్నం పెట్టడం ఇష్టం. సాత్వికంగా మాట్లాడడం ఇష్టం. కానీ భర్త ధూర్తుడు. స్వార్థపరుడు. బాగా డబ్బున్నవాడనీ, బాగా చదువుకున్నవాడనీ ఇచ్చి పెళ్ళి చేసారనుకోండి. ఈ పిల్ల జీవితంలో సంతోషాన్ని ఎలా పొందుతుంది? అందుకే ఎవరికి ఎవరిని ఇచ్చి చేయాలో... స్వభావ పరిశీలన చేయగలవారు పరిణతి కలిగిన పెద్దలు. అదే శీల పరిశీలనం. అంటే పెద్దలు వారి నిర్ణయానికి శాస్త్రం చెప్పిన ప్రాతిపదికల్లో మొదటిది శీలం. మిగిలినవి వరుసగా వయస్సు, వృత్తం, అభివంజనం, లక్షణం.

మగపిల్లలకు ఆడపిల్లలకంటే ఎక్కువ వయస్సుండాలి. గురువుగా, దైవంగా భావించి భర్తను అనుగమించాలంటే తన భర్త అనుభవం రీత్యా పరిణతి గలవాడై ఉండాలి. వయస్సు ఎక్కువ అంటే ఏ పదో, ఇరవయ్యో అని కాదు. దాంపత్యజీవనం గడపడానికి ఎంత వయోభేదం ఉంటే ఉపయుక్తం అవుతుందో అంతే వయోభేదాన్ని పాటించాల్సి ఉంటుంది. తరువాత వృత్తం. అంటే నడవడి. ఆయనకు పంచె కట్టుకోవడం అంటే చాలా ఇష్టం. ఆమెకు పంచెలు, ఉత్తరీయాలు నచ్చవు. దేవాలయాలకు వెళ్లడం ఇష్టం ఉండదు. మరో పిల్లకు తన అమ్మానాన్నలు తనతో ఉండాలనీ, తనను ఎప్పుడూ ప్రేమగా చూడాలని ఉంటుంది. మరొక ఆమెకు అత్తామామలు కూడా తమతోనే ఉండాలనీ, వారిని బాగా చూసుకోవాలని ఉంటుంది. మంచి నడవడిక కలిగిన వారు జీవిత భాగస్వామిగా వస్తే పదిమందికి ఆ దాంపత్యం ఆదర్శం అవుతుంది.

ఘర్షణలకు అవకాశం ఉండదు. ఘర్షణ మొదలయితే అది వాళ్ళిద్దరితో, వాళ్ళపిల్లలతో, వాళ్ల కుటుంబంతో సరిపోదు. ''మా ఇంట్లో మా అమ్మగారు, నాన్నగారు ఎప్పుడూ కీచులాడుకుంటూంటారు. మీ అమ్మగారిని, నాన్న గారిని చూస్తే ఎంత సంతోషంగా ఉంటుందో..బాబోయ్ ..మా అమ్మానాన్నలను చూస్తే భయమేస్తుంది'' అని పిల్లలు అనే పరిస్థితి రాకూడదు. దాని ప్రభావం సమాజం మీద పడుతుంది. చుట్టుపక్కల ఉండే పిల్లలకు, పెళ్లంటేనే భయపడి పారిపోయే మనస్తత్వం ఏర్పడుతుంది. తరువాత చూడాల్సిన అంశం–అభివంజనము .. అంటే వెనక ఉన్న వంశం. ఉభయపక్షాల వంశ చరిత్రలలోని సానుకూలతలను బట్టి వియ్యమందాలి. చివరి అంశం – లక్షణం. అంటే ఒకరికొకరు తగినవారయి ఉండాలి. పెళ్ళికి వచ్చిన అతిథులు వధూవరులలో ఒకరిని చూసి మరొకరిపై జాలిపడేంత దయనీయంగా ఉండకూడదు. చూడచక్కని జంటగా కనిపించాలి. అంటే అంగసౌష్ఠవం, శరీరాకృతులు చక్కగా ఉండాలి. ఏదో ఒక ఫ్యాను, ఒక చేతి గడియారం కొనుక్కుంటేనే ఎన్నాళ్ళు పనిచేస్తుందని గ్యారంటీలు, వారంటీలు అడుగుతాం. అటువంటిది వంశంలో చిరస్థాయిగా కీర్తి పొందవలసిన ఇద్దరిని జత కూర్చాలంటే ఎన్నిజాగ్రత్తలు తీసుకోవాలి. అందుకే వివాహాలు కుదిర్చేటప్పుడు శాస్త్రం చెప్పిన ఈ ఐదు లక్షణాలను ప్రాతిపదికగా తీసుకుని పెద్దలు మాత్రమే జీవిత భాగస్వాములను నిర్ణయించాల్సి ఉంటుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

# వేరు తీయమంటే...!

● జెన్ పథం

ఆయన ఓ గొప్ప సాధువు. ఆయనకంటూ ఓ ఆశ్రమం. ఆయన వద్ద ఎందరో శిష్యులున్నారు.

ఓరోజు ఓ వ్యాపారి వచ్చాడు. అతను ధనవంతుడు.

సాధువుకు నమస్కరించి 'నేను మీ దగ్గర శిష్యుడిగా ఉండటానికొచ్చాను' అన్నాడు.

సాధువు అతని వంక చూసి 'నిన్ను చూస్తుంటే విలాసవంతుడిలా ఉన్నావు. మా ఆశ్రమంలో ఆడంబరాలకు తావు లేదు. చాలా సామాన్యమైనది. మా జీవన పద్ధతులు నీకు సరిపోతాయనిపించడం లేదు. అన్నింటినీ త్యజించి ఓ నిరాడంబర సాధువులా బతగ్గలవా అని అనిపిస్తోంది. నీవల్ల కాదేమో అని నా ప్రశ్న. నిజంగానే నువ్వు అన్నింటినీ వదులుకోగలవా?' అడిగారు.



'తప్పకుండా స్వామీ' చెప్పాడు ధనవంతుడు.

'నేనీ క్షణమే పట్టు వస్త్రాలు తీసేసి మామూలు నూలు వస్త్రాలు ధరిస్తాను. మామూలు భోజనం చేస్తాను. నా ధనమంతా ధర్మ కార్యాలకు రాసేస్తాను. మీరెలా చెప్తే అలాగే బతుకుతాను. నాకు జ్ఞానం మాత్రం లభిస్తే చాలు' అన్నాడు ధనవంతుడు.

అప్పటికీ సాధువుకి అతని మాటలు తృప్తి కలిగించలేదు.

'సరేగానీ, నేను నిన్ను కొన్ని రోజులు పరిశీలిస్తాను. ఆ తర్వాత ఓ నిర్ణయానికొస్తాను' చెప్పాడు సాధువు.

ఆరోజు నుంచి ఆ ధనవంతుడు సాధువు ఆశ్రమంలోనే ఉంటూ వచ్చాడు.

సాధువుకి మాట ఇచ్చినట్లే చాలా నిరాడంబరమైన జీవితాన్నే గడుపుతూ వచ్చాడు.

సాధువు అనుకున్న పదిహేనురోజులు ముగిశాయి.

ఓరోజు పొద్దున్నే సాధువు అతనిని పిలిచి 'నీకు ఈ ఆశ్రమ జీవితం సరిపోదు. నువ్వింక ఇంటికి వెళ్ళిపోవచ్చు' అన్నాడు.

'ఏమిటి స్వామీ అలా అంటున్నారు? నేను మీకోసం డబ్బుని వదులుకున్నాను. ఆస్తిపాస్తులు వదులుకున్నాను. సకల వసతులూ వదులుకున్నాను. ఇవేవీ సరిపోవా?' అడిగాడు ధనవంతుడు.

సాధువు ఓ నవ్వు నవ్వారు.

'నేను వేరుని నరకమన్నాను. నువ్వు కొన్ని కొమ్మలను మాత్రమే నరికావు. ఆ నరికేసిన కొమ్మల గురించి గొప్పలు చెప్తున్నావు. పైగా నాకోసం వదిలేశాను... నాకోసం వదిలేశాను అంటున్నావు... ఇది సరికాదు. నువ్వు దయచేయొచ్చు. నీలో ఇంకా నేనూ నాకోసం వంటి ఆలోచనలున్నాయి. అవి నిన్నొదలవు' అన్నారు సాధువు.

**– యామిజాల జగదీశ్**

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com
శుక్రవారం
20-11-2020

# స్కూల్ పిల్లలకు నవ నైపుణ్యాలు !

- టీసీఎస్ 'ఇంటెలిజెమ్' పోటీలకు ప్రకటన
- 5 నుంచి 9 తరగతుల విద్యార్థులు అర్హులు
- స్కూల్ స్థాయి పిల్లల ప్రతిభకు ప్రోత్సాహం
- దరఖాస్తులకు చివరి తేది: 21.11.2020

**నేటి తరం పిల్లలకు టెక్నాలజీపై మక్కువ ఎక్కువ. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే.. గేమ్స్ నుంచి యాప్స్ దాకా ప్రపంచాన్ని చుట్టేస్తున్నారు. పదేళ్లు కూడా నిండకుండానే కోడింగ్ నేర్చుకుంటున్నారు. కొత్తకొత్త యాప్స్‌ను ఎలా వినియోగించాలో పెద్దవాళ్లకే పాఠాలు చెబుతున్నారు. ఇలాంటి చిచ్చర పిడుగుల్లోని ప్రతిభను ప్రోత్సహించి.. వారిలో సాంకేతిక నైపుణ్యాలను మరింతగా తీర్చిదిద్దేందుకు ప్రముఖ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)..'ఇంటెలిజెమ్' పేరుతో పోటీలు నిర్వహిస్తోంది. తాజాగా 2020–21 విద్యాసంవత్సరానికి ఇంటెలిజెమ్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులకు ప్రకటన వెలువడిన నేపథ్యంలో పూర్తి సమాచారం..**

## ప్రతిభకు ప్రోత్సాహం

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్).. టీసీఎస్ అయాన్ నిర్వహించే ''ఇంటెలిజెమ్'' జాతీయ స్థాయి పోటీల కోసం రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. ఇందులో ముందుగా రూపొందించిన ప్రక్రియ ప్రకారం పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందిస్తారు. పాఠశాల స్థాయి నుంచే టెక్నాలజీపై పట్టు సాధించేలా ప్రోత్సహించనున్నట్లు నిర్వాహక సంస్థ చెబుతోంది. పోటీలో భాగంగా విద్యార్థులకు 21వ శతాబ్దం నైపుణ్యాలైన 'క్రియేటివిటీ, ఇన్నోవేషన్, కమ్యూనికేషన్, ఫైనాన్షియల్ లిటరసీ, యూనివర్సల్ వాల్యూస్, గ్లోబల్ సిటిజన్‌షిప్'పై శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పిస్తారు.

## అర్హతలు

ఈ పోటీల్లో 5 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. టీసీఎస్ అయాన్ ఇంటెలిజెమ్ పోటీల్లో పేర్లు నమోదు చేసుకోసుకునేందుకు ప్రతి విద్యార్థికి ఈమెయిల్ ఐడీ ఉండాలి. దానితోనే సంస్థ డిజిటల్ లెర్నింగ్ హబ్ ప్లాట్‌ఫామ్‌ను యాక్సెస్ చేయగలరు. పాఠశాల నమోదు లేకుండా విద్యార్థుల వివరాలు నమోదు చేయలేరు. స్కూల్ రిజిస్ట్రేషన్ తరువాత, ఒక ప్రత్యేకమైన ఐడీ నంబర్ జనరేట్ అవుతుంది. ఆ నంబర్‌తో మాత్రమే విద్యార్థులు తమ పేర్లను పోటీకీ నమోదు చేసుకోగలరు.

## 21వ శతాబ్దం నైపుణ్యాలు

పేర్లు రిజిస్టర్ కాగానే..పోటీలో పాల్గొనే విద్యార్థులు 21వ శతాబ్దం నైపుణ్యాలు(క్రియేటివిటీ, ఇన్నోవేషన్, కమ్యూనికేషన్, ఫైనాన్షియల్ లిటరసీ, యూనివర్సల్ వాల్యూస్, గ్లోబల్ సిటిజన్‌షిప్), వెబ్‌నార్లు, పజిల్స్, ఆటలు మొదలైన వాటిపై మెటీరియల్ పొందచ్చు. తద్వారా ఆయా అంశాలను నేర్చుకోవచ్చు.

## మూడు రౌండ్లుగా పోటీ

- ఈ పోటీ మొత్తం మూడు రౌండ్లుగా జరుగుతుంది. మొదటిది, ఆన్‌లైన్ క్వాలిఫైయింగ్ రౌండ్; రెండోది, ఫిజికల్–డిజిటల్ మోడ్‌లో ప్రీ-ఫైనల్ రౌండ్. వీటిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో 'గ్రాండ్ ఫైనల్' నిర్వహిస్తారు. విద్యార్థులు దరఖాస్తు సమయంలోనే నిర్ణీత అయిదు విభాగాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ అంశాలను ఎంచుకోవచ్చు. ఫైనల్‌లో ప్రతిభ చూపిన వారికి ట్రోఫీలు, పతకాలు, ధ్రువపత్రాల తోపాటు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు.
- పోటీలో పాల్గొనేవారు డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్ కంప్యూటర్, దానికి ఇంటర్‌నెట్/వైఫై, వెబ్ కెమెరా ఉండాలి. క్వాలిఫైయింగ్ రౌండ్ల సమయంలో వీటి అవసరం ఉంటుంది.
- వెబ్‌సైట్: intelligem.tcsion.com/ https://learning.tcsionhub.in/lifelonglearning/se/intelligem/







**ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఎంతో కీలకంగా మారుతోంది. ముఖ్యంగా కోర్సులో అంతర్భాగంగా ప్రముఖ సంస్థల్లో చేసే ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటీవల కాలంలో భారతీయ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను విదేశాల్లోని ప్రముఖ కంపెనీల్లో చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అక్కడి టెక్నాలజీ, వర్క్ కల్చర్, ఎక్స్‌పోజర్.. కోర్సు అనంతర కాలంలో అంతర్జాతీయ అవకాశాలు అందుకునేందుకు దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో.. ఇంటర్నేషనల్ ఇంటర్న్‌షిప్స్‌పై ప్రత్యేక కథనం..**

# విదేశీ ఇంటర్న్‌షిప్

## అంతర్జాతీయ అనుభవం

విద్యార్థి ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో ఇంటర్న్‌షిప్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇంటర్న్‌షిప్‌ల ప్రధాన ఉద్దేశం.. విద్యార్థికి పని అనుభవంతోపాటు సంస్థలో పనిచేసేందుకు అవసరమైన వృత్తిపరమైన అవగాహనను కల్పించడం. ప్రస్తుత గ్లోబల్ విలేజ్‌లో విజ్ఞానం ఎక్కడున్నా నేర్చుకునేందుకు భారతీయ విద్యార్థులు సిద్ధమవుతున్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని తమ ప్రగతికి సోపానంగా మార్చుకుంటున్నారు. ఒకప్పుడు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళితే.. ఇప్పుడు అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌ల కోసం కూడా విభిన్న దేశాలకు పయనమవుతున్నారు.

## ప్రయోజనం ఏమిటి!

- విదేశీ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా అదనపు ప్రయోజనం ఏమిటి?! అనేది చాలామందిలో తలెత్తే ప్రశ్న. వాస్తవానికి నేటి బహుళ జాతి కంపెనీల కాలంలో టాప్ యూనివర్సిటీలో, టాప్ ర్యాంకుతో కోర్సు పూర్తి చేసినంతనే సరిపోదు. పని అనుభవంతోపాటు విస్తృత అవగాహన పరిధి కూడా ఉండాలని కంపెనీలు కోరుకుంటున్నాయి.
- విదేశీ సంస్థల్లో పని అనుభవం సంపాదించడం వల్ల విద్యార్థులకు ఆయా దేశాల్లోని టెక్నాలజీ, నైపుణ్యాలపై అవగాహన పెరుగుతుంది. అక్కడి పని సంస్కృతి గురించి తెలుసుకోవచ్చు. కొత్త వర్క్ కల్చర్‌తో మమేకం అవడం ద్వారా అక్కడి సమస్యలు, సవాళ్లు, వారు సమర్థవంతంగా ఎదుర్కొంటున్న తీరును అర్థం చేసుకోవచ్చు. తద్వారా నేటి పోటీ ప్రపంచంలో ఇతరుల కంటే ముందు నిలిచే అవకాశం లభిస్తుంది.
- ప్రస్తుతం అంతర్జాతీయ సంస్థలు ఖండాంతరాల్లో తమ శాఖలను విస్తరిస్తున్నాయి. దాంతో విదేశాల్లో ఇంటర్న్‌షిప్ అనుభవం ఉన్న ఉద్యోగులకు సంస్థలు ప్రాధాన్యం ఇస్తాయి.
- విదేశాల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా కొత్త భాషలను సైతం నేర్చుకోవచ్చు. దానిద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి, సంస్థల వ్యాపార వాణిజ్య వ్యూహాల గురించి తెలుసుకునేందుకు అవకాశం లభిస్తుంది.
- విదేశీ ఇంటర్న్‌షిప్.. ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థుల బ్రాండ్ విలువను పెంచుతుంది. అక్కడి సంస్థల్లో పొందే పని అనుభవం, వాళ్లు ఇచ్చే సర్టిఫికెట్‌కు ప్రపంచ వ్యాప్తంగా విలువ ఉంటుంది.

- ప్రపంచ ప్రసిద్ధ సంస్థల్లో అవకాశాలు
- స్టయిపెండ్ సైతం అందుకునేందుకు వీలు




## 'పెయిడ్'కే ప్రాధాన్యం

విద్యార్థులు చదివిన కోర్సు, రంగం, కంపెనీ ప్రాధాన్యతను బట్టి రకరకాల అవకాశాలు ఉంటాయి. వాస్తవానికి విదేశాల్లో ఇంటర్న్‌షిప్ అంటే ఖర్చుతో కూడుకున్న పని. కొన్ని కంపెనీలు మాత్రమే పనిచేసిన కాలానికి స్టయిపెండ్ ఇస్తాయి. చాలా కంపెనీలు వర్క్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్‌తో సరిపెడతాయి. అలాంటప్పుడు విద్యార్థి విదేశాల్లో ఉన్న కాలానికి అయ్యే ఖర్చులను సొంతంగా భరించాల్సి ఉంటుంది. పైగా విదేశాల్లో జీవన వ్యయం మన దేశంతో పోలిస్తే అధికంగా ఉంటుంది. కాబట్టి విద్యార్థులు అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు స్టయిపెండ్ ఇచ్చే కంపెనీలనే ఎంచుకోవాలి. విదేశాల్లో ఉచిత ఇంటర్న్‌షిప్ చేస్తున్నా.. అక్కడి అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థి తన సామర్థ్యాలను నిరూపించుకోవాల్సి ఉంటుంది. మన దేశ విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్స్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు.

## సహనంతో శోధన

ఐఐటీలు, ఐఐఎంలు వంటి టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదివే కొంతమంది విద్యార్థులకు మాత్రమే సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ద్వారా విదేశీ ఇంటర్న్‌షిప్స్ అవకాశం లభిస్తోంది. ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో చదువుతున్న విద్యార్థులు విదేశాల్లోని కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాల కోసం సొంతంగా ప్రయత్నించాల్సి ఉంటుంది. ఆయా ప్రముఖ కంపెనీలు తమ అధికారిక వెబ్‌సైట్స్‌లో ఇంటర్న్‌షిప్స్ అవకాశాల వివరాలు వెల్లడిస్తుంటాయి. వాటి ఆధారంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు ఓపిక,సహనం చాలా అవసరం.

## ఆ దేశాల వైపు మొగ్గు

విదేశాలలో ఇంటర్న్‌షిప్ లభించడం అంటే విద్యార్థికి ఉత్తమ అవకాశంగా చెప్పవచ్చు. ఇటీవల చాలామంది భారతీయ విద్యార్థులు విదేశాలలో ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అమెరికా, యూకే, కెనడా, సింగపూర్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, యూఏఈ, జర్మనీ వంటి దేశాల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు మన విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు.

## ఇంటర్న్‌షిప్‌లు అందించే కొన్ని సంస్థలు

- జేపీ మోర్గాన్ కంపెనీ.. టెక్నికల్ అనలిస్ట్, మార్కెట్ అనలిస్ట్, బ్యాంకింగ్ అనలిస్ట్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్స్ అందిస్తుంది. ఇంజనీరింగ్, ఎంబీఏ కోర్సుల విద్యార్థులు ఇంటర్న్‌గా అవకాశం పొందాలంటే.. జేపీ మోర్గాన్ అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు వెబ్‌సైట్: https://careers.jpmorgan.com
- ప్రపంచ వ్యాప్తంగా శాఖలున్న గోల్డ్‌మన్ సాచ్స్ సంస్థలో ఫైనాన్షియల్, మార్కెట్ అనలిస్టులకు సమ్మర్ ఇంటర్న్స్‌గా అవకాశం కల్పిస్తోంది. విద్యార్థులు సంస్థ అధికార వెబ్‌సైట్‌లో వివరాలు చూడవచ్చు. వెబ్‌సైట్: https://www.goldmansachs.com/ careers/students/programs/
- మైక్రోసాఫ్ట్... టెక్నికల్, బిజినెస్, కంప్యూటర్స్ కోర్సులు చేసిన విద్యార్థులకు వివిధ దేశాల్లో పనిచేయడానికి ఇంటర్న్‌షిప్ అవకాశం అందిస్తోంది. వివరాలకు వెబ్‌సైట్: https://careers.microsoft.com/us/en/usuniversityinternship
- గూగుల్ సంస్థ ఫైనాన్స్, మార్కెటింగ్, కమ్యూనికేషన్, బిజినెస్ స్ట్రాటజీ, పీపుల్ ఆపరేషన్స్, అకౌంట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాలలో నెట్‌వర్క్‌ను పెంచుకోవడమే లక్ష్యంగా సాగుతోంది. సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఎంబీఏ గ్రాడ్యుయేట్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు వివిధ దేశాల్లో ఇంటర్న్ అవకాశం కల్పిస్తోంది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://careers.google.com/students/

# సీఏ ఫైనల్.. ప్రాక్టీస్‌తో సక్సెస్

- 21వ తేదీ నుంచి సీఏ ఫైనల్ పరీక్షలు
- గ్రూప్-1: నవంబర్ 21, 23, 25, 27 తేదీల్లో
- గ్రూప్-2: నవంబర్ 29, డిసెంబర్ 2, 4, 6 తేదీల్లో

**సీఏ ఫైనల్.. చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సులో చివరి దశ! సీఏ ఇంటర్ తర్వాత.. రెండున్నరేళ్ల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఫైనల్ పరీక్ష రాసేందుకు అర్హులు! సీఏ ఫైనల్ పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ కొలువులు ఖాయం అవుతాయి! ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుంది!!ఇంతటి కీలకమైన పరీక్షలు.. ఈ నెల(నవంబర్) 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కొద్దిపాటి మెళకువలతో సీఏ ఫైనల్ పరీక్షల్లో రాణించొచ్చు అంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో.. సీఏ ఫైనల్ పరీక్షల్లో విజయానికి సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ గైడెన్స్...**




## ఫైనాన్షియల్ రిపోర్టింగ్:

ఇండియా అకౌంటింగ్ స్టాండర్డ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. దీంతోపాటు చిన్న చాప్టర్లయిన ఇంటిగ్రేటెడ్ రిపోర్టింగ్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ చాప్టర్లపైనా దృష్టి పెట్టాలి. అవసరమైన ప్రతి చోటా కంపెనీల చట్టం–2013 ఫార్మట్‌లోని షెడ్యూల్–3 ప్రకారం బ్యాలెన్స్ షీట్ తయారు చేయాలి. నిర్దిష్టంగా ఒక ప్రామాణిక పుస్తకానికే పరిమితమై అందులోని అంశాలతోనే ప్రిపరేషన్ పూర్తి చేయాలి. ఇండియా అకౌంటింగ్ స్టాండర్డ్స్ అంశాలు ఆడిటింగ్ సబ్జెక్ట్‌లో కూడా పునరావృతం అవుతాయి. కాబట్టి ఈ రెండు సబ్జెక్టులను ఒకేసారి సన్నద్ధమైతే సమయం ఆదా అవుతుంది. మొదటిసారి ప్రిపరేషన్ సమయంలో సులువైన లెక్కలను తీసివేస్తే రెండో దశ ప్రిపరేషన్ మరింత సులభం అవుతుంది. బిజినెస్ కాంబినేషన్ అండ్ కార్పొరేట్ రీ-స్ట్రక్చరింగ్, కన్సాలిడేటెడ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ వంటి చాప్టర్ల సన్నద్ధత విషయంలో కష్టమైన అంశాలను హైలైట్ చేసుకోవాలి. ఫలితంగా తుది దశ ప్రిపరేషన్‌లో ముఖ్యాంశాలపైనే దృష్టి కేంద్రీకరించే ఆస్కారం లభిస్తుంది. ప్రతి చాప్టర్‌లోనూ ఒక బేసిక్ ప్రాబ్లమ్ విధానాన్ని తెలుసుకుని మిగతా ప్రాబ్లమ్స్‌లోని ముఖ్యాంశాలను ప్రాక్టీస్ చేయాలి. ప్రతి చాప్టర్‌లోనూ కాన్సెప్ట్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. సమయం అందుబాటులో ఉంటే కన్సాలిడేషన్ కూడా ప్రిపేర్ అయితే మంచిది.

## స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్

ఈ సబ్జెక్ట్ కోసం ప్రత్యేకంగా ఒక నోట్ పుస్తకంలో ఫార్ములాలను పొందుపర్చుకోవాలి. ప్రత్యేకించి ఫారెన్ ఎక్స్ఛేంజ్ ఎక్స్‌పోజర్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ చాప్టర్లకు నోట్స్ ప్రిపరేషన్ ముఖ్యం. ఈ రెండు చాప్టర్లతోపాటు డెరివేటివ్ అనాలిసిస్ అండ్ వాల్యుయేషన్ చాప్టర్లను కనీసం మూడుసార్లయినా రివిజన్ చేయాలి. ఫారెన్ ఎక్స్ఛేంజ్ ఎక్స్‌పోజర్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్ చాప్టర్లతోపాటు కొత్త చాప్టర్లు.. కార్పొరేట్ ఎవాల్యుయేషన్, ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ స్టార్టప్ ఫైనాన్స్ చాప్టర్లపైనా దృష్టి పెట్టాలి. డెరివేటివ్స్‌లో చాలా అంశాలు ఉన్నాయి కాబట్టి దీనికి తుది ప్రాధాన్యత ఇవ్వాలి. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీ వాల్యుయేషన్ వంటి చిన్నపాటి అంశాలతో ప్రిపరేషన్ ప్రారంభిస్తే మంచిది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ పూర్తిగా ఫార్ములాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ముందుగా దీన్ని పూర్తి చేయొచ్చు. థియరీకి మాత్రం స్టడీ మెటీరియల్ చదివితే సరిపోతుంది.

## అడ్వాన్స్‌డ్ ఆడిటింగ్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్

ఆడిటింగ్ స్టాండర్డ్స్‌కు సంబంధించి ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్ని చదవాలి. ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్‌లోని ప్రాక్టికల్ ప్రశ్నలు చదవాలి. పరీక్షల్లో ఆడిటింగ్ స్టాండర్డ్ మొత్తం రాయనక్కర్లేదు. అడిగిన ప్రశ్న ఆధారంగా తగినంత సమాధానం రాస్తే సరిపోతుంది. ముందుగా ప్రొఫెషనల్ ఎథిక్స్‌ను పూర్తి చేయాలి. రోజుకో ఆడిటింగ్ స్టాండర్డ్ చొప్పున చదవాలి. వీలైతే ఫ్లో చార్ట్స్ వేసుకోవాలి. పరీక్షల్లో ప్రాక్టికల్ ప్రశ్నలే ఎక్కువగా ఉంటాయి కాబట్టి ప్రిపరేషన్‌లోనూ వీటిపై దృష్టి పెట్టాలి. కంపెనీ ఆడిట్, ఆడిట్ రిపోర్ట్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం.

## కార్పొరేట్ 'లా'స్ అండ్ ఎకనామిక్స్

అపాయింట్‌మెంట్ అండ్ క్వాలిఫికేషన్ ఆఫ్ డైరెక్టర్స్,బోర్డ్ మీటింగ్స్ వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే విధంగా అపాయింట్‌మెంట్ అండ్ రెమ్యునరేషన్ ఆఫ్ మేనేజీరియల్ పర్సనల్‌కి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. అన్ని చట్టాల్లో('లా'స్) ప్రొసీజర్స్ ఒకే విధంగా ఉంటాయి. కాబట్టి ఒకటి చదివి మిగతావాటిని చూసుకుంటే సరిపోతుంది. చట్టాల్లో మార్పులు జరిగేటప్పుడు పెనాల్టీ ప్రొవిజన్స్‌కే ప్రాధాన్యం ఉంటుంది. వీటన్నింటినీ గుర్తు పెట్టుకోవాలి. విద్యార్థులు తాము చదివిన ఆథర్ బుక్, స్టడీ మెటీరియల్ రెండూ దగ్గర పెట్టుకొని ప్రిపేర్ అవ్వాలి. ఒక్కోసారి జవాబుల్లో వ్యత్యాసాలు ఉండొచ్చు. ఇలాంటప్పుడు ఆథర్ బుక్ చదివాక, స్టడీ మెటీరియల్ ద్వారా ప్రాక్టీస్ చేస్తే మేలు.

## స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ పెర్‌ఫార్మెన్స్ ఎవాల్యుయేషన్

నిడివి ఎక్కువ ఉండే ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి పునశ్చరణ బాగా పూర్తి చేసిన వారే సమాధానాలు రాయగలరు. ఇటీవల కాలంలో థియరీకి కూడా ప్రాధాన్యం పెరుగుతోంది. కాబట్టి థియరీని కూడా ఔపోసన పట్టాలి. 20 నుంచి 30 శాతం మార్కులు వచ్చే కేస్ స్టడీ చాప్టర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. మోడ్రన్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, డెసిషన్ మేకింగ్, ప్రైసింగ్ డెసిషన్స్, పెర్‌ఫార్మెన్స్ మెజర్‌మెంట్ అండ్ ఎవాల్యుయేషన్, డివిజనల్ ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ అండ్ బడ్జెటరీ కంట్రోల్ వంటి అంశాలు బాగా చదవాలి. వీటి నుంచి 50 శాతం మార్కులు వచ్చే అవకాశం ఉంది. మోడ్రన్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, ప్రైసింగ్ డెసిషన్స్, పెర్‌ఫార్మెన్స్ మెజర్‌మెంట్ అండ్ ఎవాల్యుయేషన్‌లో థియరీకి ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైనంత వరకు ఫార్ములాలతో సొంత నోట్స్ రూపొందించుకోవడం మేలు చేస్తుంది. ఈ సబ్జెక్ట్‌కి సంబంధించి ఆథర్ బుక్స్ కంటే క్లాస్ నోట్స్, స్టడీ మెటీరియల్‌పై ఆధారపడితే మంచిది. స్టడీ మెటీరియల్‌లోని థియరీని చదివితే సరిపోతుంది.

## ఎలక్టివ్ పేపర్

- సీఏ ఫైనల్ పరీక్షల్లో ఒక పేపర్‌ను ఎలక్టివ్ పేపర్‌గా నిర్ణయించారు. రిస్క్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్యాక్సేషనల్, ఎకనామిక్ 'లా'స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, గ్లోబల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అండ్ స్టాండర్డ్స్, మల్టీ డిసిప్లినరీ కేస్ స్టడీలలో.. ఏదో ఒక పేపర్‌ను అభ్యర్థులు ఎంచుకోవాల్సి ఉంటుంది.
- వీటి ప్రిపరేషన్ పరంగా విద్యార్థులు ముఖ్యంగా ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, ఎకనామిక్ 'లా'స్ కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ఎలక్టివ్ పేపర్‌కు సంబంధించి ఓపెన్ బుక్ విధానం ద్వారా పరీక్ష నిర్వహిస్తారు.

## డెరెక్ట్ ట్యాక్స్ 'లా'స్ అండ్ ఇంటర్నేషనల్ ట్యాక్సేషన్

నిర్దిష్టంగా ఒక స్టడీ మెటీరియల్‌ను ఆధారం చేసుకోవాలి. రివిజన్ సమయంలో సమ్మరీ మాడ్యూల్, స్టడీ మెటీరియల్ తప్పనిసరిగా చదవాలి. ఫైవ్ హెడ్స్(అంశాలు) తప్పనిసరిగా చదవాలి. సమయం ఉందని భావిస్తే కేస్ 'లా'స్‌ను కూడా చదవాలి. అభ్యర్థులు ఆయా అంశాల పట్ల ఆత్మ విశ్వాసంతో ఉంటే.. పరీక్షలో సెక్షన్స్, కేస్ 'లా'స్ మిళితం చేసి సమాధానాలు రాయాలి. సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈ పేపర్‌కి సంబంధించి ఫాస్ట్ ట్రాక్ మెటీరియల్ రూపొందించుకొని సన్నద్ధమైతే వేగంగా రివిజన్ పూర్తి చేయొచ్చు.

## గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్; కస్టమ్స్ అండ్ ఎఫ్.టి.పి.

ఎఫ్.టి.పి. చాప్టర్ నుంచి తప్పనిసరిగా ప్రశ్నలు అడిగే వీలుంది. కాబట్టి ఈ చాప్టర్‌ను నిర్లక్ష్యం చేయొద్దు. థియరీకి, ప్రాబ్లమ్స్‌కు సమ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రత్యేకించి ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్‌పై అధికంగా దృష్టిపెట్టాలి. ల్యాండ్ మార్క్ కేస్ 'లా'స్‌కు పరీక్షల్లో తప్పనిసరిగా పేర్కొనాలి. దీనివల్ల మార్కులు పెరిగే అవకాశం ఉంది. ఒకే రకమైన అంశాలను విభిన్న కోణాల్లో చదవాలి. ఈ పేపర్‌కు కూడా ఫాస్ట్‌ట్రాక్ మెటీరియల్‌తో సన్నద్ధమైతే వేగంగా పునశ్చరణ చేయొచ్చు.

## పరీక్షల సన్నద్ధతకు సూచనలు

అన్ని పేపర్లకు సమ ప్రాధాన్యం ఇచ్చి.. ప్రతి సబ్జెక్ట్‌లోని అన్ని చాప్టర్లలోని ప్రశ్నలన్నింటినీ క్షుణ్నంగా చదవాలి. సీఏ ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్ తప్పనిసరిగా చదవాలి. అదే విధంగా సీఏ ఇన్‌స్టిట్యూట్ ఇచ్చే సప్లిమెంటరీ మెటీరియల్‌ను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. దీనివల్ల పరీక్షలు బాగా రాసే సన్నద్ధత లభిస్తుంది. ట్యాక్స్‌కు సంబంధించి పేపర్లు చదివేటప్పుడు చట్టంలో వచ్చిన సవరణలపై పూర్తి అవగాహన పొందాలి. చట్టాల్లో మార్పులను అప్‌డేట్ అవుతూ ప్రిపరేషన్ సాగించాలి. ఏవైనా రెండు పేపర్లను రోజువారీ పద్ధతిలో పునశ్చరణ చేయాలి. సొంతగా ఫాస్ట్‌ట్రాక్ నోట్స్ రూపొందించుకుంటే మేలు. అదే విధంగా ఇటీవల కాలంలోని సవరణలను తప్పనిసరిగా చదవాలి.

## ఆర్‌టీపీస్, ఎంటీపీస్ తప్పనిసరిగా

సీఏ ఫైనల్ పరీక్షల విద్యార్థులు రివిజన్ టెస్ట్ పేపర్స్(ఆర్‌టీపీస్), మాక్ టెస్ట్ పేపర్స్(ఎంటీపీస్)ను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ప్రశ్నలు అడిగే తీరు, ఏఏ అంశాలు ఎక్కువగా ఉంటున్నాయో గమనించి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సిలబస్ వెయిటేజ్‌కి అనుగుణంగా చదవాలి. సొంతంగా సన్నద్ధమయ్యే విద్యార్థులు స్వీయ ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రాక్టీస్ కూడా ఎంతో ప్రధానం. వీలైనంత వరకు ఎన్ని ఎక్కువ మోడల్ టెస్ట్‌లు రాస్తే అంత మంచిది. దానివల్ల విద్యార్థులు తమ లోపాలు సరిదిద్దుకొని.. పరీక్ష హాల్లో మంచి ప్రతిభ కనబర్చేందుకు అవకాశం ఉంటుంది

– ఎం.ఎస్.ఎస్.ప్రకాశ్, డైరెక్టర్, మాస్టర్‌మైండ్స్ అకాడమీ

# అన్ని రంగాలకూ సహాయక చర్యలు

**సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం**



**న్యూఢిల్లీ:** రుణాలపై మారటోరియంసహా కోవిడ్‌–19 సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి తగిన అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. మారటోరియం ఒక ద్రవ్యపరమైన నిర్ణయం అని పేర్కొన్న కేంద్రం, అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం పలు చర్యలు తీసుకుందని తెలిపారు. రుణాలపై మారటోరియం చక్రవడ్డీని తొలగించాలన్న అంశంపై దాఖలైన పిటిషన్లు గురువారం విచారణ నిమిత్తం జస్టిస్‌ అశోక్‌ భూషన్, జస్టిస్‌ సుభాష్‌ రెడ్డి, జస్టిస్‌ ఎంఆర్‌ షాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందుకు వచ్చాయి. ఈ విషయంలో ఇప్పటికే బ్యాంకింగ్‌ తీసుకున్న నిర్ణయాలు, అమలు అంశాలను కేంద్రం, ఆర్‌బీఐలు సుప్రీంకోర్టుకు వివరించాయి. క్రెడిట్‌ కార్డ్‌ వినియోగదారులపై కూడా వడ్డీ ప్రయోజనాలను కల్పించినట్లు ఈ సందర్భంగా సొలిసిటర్‌ జనరల్‌ తుషార్‌ మెహతా అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. నవంబర్‌ 5వ తేదీ నాటికి చక్రవడ్డీ–సాధారణ వడ్డీ వ్యత్యాసం రూ.2 కోట్ల లోపు అర్హులైన రుణగ్రహీతల అకౌంట్లలో జమ చేసినట్లు ఆర్‌బీఐ, ఆర్థిక మంత్రిత్వశాఖలు ఇప్పటికే వేర్వేరుగా అదనపు అఫిడవిట్లు దాఖలు చేశాయి.

**విద్యుత్‌ రంగంలో సహాయక చర్యలపై విచారణ**

కాగా, గురువారం విచారణ సందర్భంగా విద్యుత్‌ రంగానికి సంబంధించి కోరుతున్న సహాయక చర్యలపై సీనియర్‌ న్యాయవాది ఏఎం సింఘ్వీ తన వాదనలు వినిపించారు. విద్యుత్‌ రంగానికి రుణ పునర్‌వ్యవస్థీకరణ విషయంలో లోపాలు ఉన్నాయన్నారు. ఆయా అంశాలకు సంబంధించి పలు పిటిషన్లు బెంచ్‌ ముందు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా మెహతాతోపాటు ఆర్‌బీఐ తరఫు సీనియర్‌ న్యాయవాది వీ గిరి ప్రస్తావించారు. ఆయా సూచనలను ముందు తమకు తెలియజేస్తే తగిన విధంగా స్పందిస్తామన్నారు. దీనికి అంగీకరించిన ధర్మాసనం, ఆయా అంశాలన్నింటినీ సొలిసిటర్‌ జనరల్, ఆర్‌బీఐ తరఫు న్యాయవాదులకు తెలియజేయాలని సూచించింది. ఇందుకు మూడు రోజుల సమయం ఇచ్చింది. కేసు తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# భారత్‌ మార్కెట్‌పై ఎఫ్‌పీఐలు బుల్లిష్‌

- క్యూ2లో 6.3 బిలియన్‌ డాలర్ల పెట్టుబడులు
- ఆగస్టులోనూ అత్యధిక కొనుగోళ్లు
- అనుకూలంగా అంతర్జాతీయ పరిణామాలు
- భరోసానిచ్చిన కరోనా రికవరీ రేటు
- మార్నింగ్‌ స్టార్‌ నివేదిక వెల్లడి



**న్యూఢిల్లీ:** భారత్‌ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌ క్వార్టర్‌లో ఎఫ్‌పీఐలు 6.3 బిలియన్‌ డాలర్ల (దాదాపు రూ.4.6 లక్షల కోట్లు) విలువైన పెట్టుబడులు పెట్టినట్లు మార్నింగ్‌ స్టార్‌ నివేదిక తెలిపాయి. ఈ క్యూ2లో అత్యధికంగా ఆగస్ట్‌లో 6.2 బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పెట్టారని, సెప్టెంబర్‌లో 1.1 బిలియన్‌ డాలర్లను ఈక్విటీలను విక్రయించి నికర అమ్మకందారులుగా మారినట్లు సర్వే తెలిపింది. ఆకర్షణీయమైన వాల్యుయేషన్లు, కరోనా ప్రేరేపిత లాక్‌డౌన్‌ తర్వాత ఆర్థిక వ్యవస్థ, వ్యాపారాల పునః ప్రారంభం, భారత్‌లో కోవిడ్‌–19 రికవరీ రేటు భారీగా నమోదు తదితర అంశాలు ఎఫ్‌పీఐలను ఆకర్షించినట్లు సర్వే పేర్కొంది.

**అనుకూలంగా అంతర్జాతీయ పరిణామాలు...**

కరోనాతో కుంటుబడిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు పలు దేశాలు ఉద్దీపన ప్యాకేజీల ప్రకటనతో ఈ క్యూ2లో ప్రపంచ మార్కెట్లలో ద్రవ్య లభ్యత అధికమైంది. అలాగే ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లనూ తగ్గించాయి. దీంతో భారత్‌లాంటి వర్ధమాన దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఎఫ్‌పీఐలు ఆసక్తి చూపారని సర్వే వివరించింది. కోవిడ్‌–19 వ్యాక్సిన్‌ పరీక్షలు విజయవంతం వార్తలు కూడా ఎఫ్‌పీఐలకు ఉత్సాహాన్నిచ్చినట్లు సర్వే తెలిపింది.

**సర్వే మరిన్ని వివరాలు...**

ఎఫ్‌పీఐల భారీ పెట్టుబడులతో భారత ఈక్విటీల్లో ఎఫ్‌పీఐ పెట్టుబడుల మొత్తం విలువ ఒక క్వార్టర్‌లోనే 31 శాతం పెరిగింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికం నాటికి 344 బిలియన్‌ డాలర్లుగా ఉన్న ఈ మొత్తం విలువ, క్యూ2 చివరినాటికి 450 బిలియన్‌ డాలర్లకు ఎగిసింది.

- ఇదేకాలంలో భారత ఈక్విటీ మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌కు ఎఫ్‌పీఐల వాటా త్రైమాసిక ప్రాతిపదికన 18.7 శాతం నుంచి 21.4 శాతానికి పెరిగింది. భారత ఈక్విటీ మార్కెట్‌ చరిత్రలో ఎఫ్‌పీఐల వాటా ఇదే అత్యధికం కావడం విశేషం. 2015లో ఈక్విటీ మార్కెట్‌ క్యాప్‌కు ఎఫ్‌ఐల మొత్తం వాటా 20.5 శాతంగా ఉంది.
- అక్టోబర్‌ నుంచి నవంబర్‌ 11 వరకు ఎఫ్‌పీఐలు మన మార్కెట్లో మొత్తం 1.1 బిలియన్‌ డాలర్ల విలువైన పెట్టుబడులు పెట్టారు.

**ప్రపంచ మార్కెట్లలో లిక్విడిటీ లభ్యత, వ్యాక్సిన్‌ అభివృద్ధి వార్తలు రానున్న రోజుల్లో భారత ఈక్విటీ మార్కెట్లో ఎఫ్‌పీఐ పెట్టుబడులను నిర్ధారిస్తాయని సర్వే అంచనా వేసింది.**

## 14 నెలల గరిష్టానికి పీ-నోట్ల పెట్టుబడులు

దేశీయ స్టాక్‌ మార్కెట్లలో పార్టిసిపేటరీ నోట్ల (పీ–నోట్లు) ద్వారా పెట్టుబడులు అక్టోబర్‌ చివరి నాటికి 14 నెలల గరిష్టానికి చేరుకున్నాయి. అంతర్జాతీయంగా అధిక లిక్విడిటీ లభ్యత, కేంద్రం చేపట్టిన సంస్కరణలు ఇందుకు కారణం. భారత స్టాక్‌ మార్కెట్లో పీ– నోట్ల ద్వారా ఎఫ్‌పీఐలు పెట్టుబడులు పెడుతుంటారు. సెబీ గణాంకాల ప్రకారం సెప్టెంబర్‌ 30 నాటికి రూ.69,821 కోట్లుగా ఉన్న పీ–నోట్ల పెట్టుబడుల విలువ అక్టోబర్‌ చివరికి రూ.78,686 కోట్లకు చేరుకుంది. ఈ మొత్తం రూ.78,686 కోట్ల పెట్టుబడుల్లో రూ.68,415 కోట్లు ఈక్విటీల్లోకి, రూ.10,047 కోట్లు డెట్‌లోకి, రూ.224 కోట్ల హైబ్రీడ్‌ ఫండ్స్‌లోకి వచ్చాయి. కరోనా భయాలతో స్టాక్‌ మార్కెట్‌ తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొన్న తరుణంలో పీ–నోట్ల పెట్టుబడులు మార్చిలో 15 నెల కనిష్టానికి పడిపోయి రూ.48,006 కోట్లుకు చేరుకున్న సంగతి తెలిసిందే.

# శ్రామికశక్తిలో మహిళలు 25 శాతమే



**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా శ్రామికశక్తిలో మహిళల వాటా కేవలం 25 శాతమే. ఈ విషయంలో ప్రపంచ సగటు 49 శాతంగా ఉందని లాభాపేక్ష లేని సంస్థ వాధ్వాని ఫౌండేషన్‌ గురువారం మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా వెల్లడించింది. మహిళా పారిశ్రామికవేత్తల శక్తి సామర్థ్యాలను మరింతగా వెలికితీయాలని ఫౌండేషన్‌ సూచించింది. 'దేశంలో పెరుగుతున్న వ్యవస్థాపక వ్యవస్థ మహిళలను విస్మరించింది. గ్రామీణ భారతావనిని సమాన దృష్టితో, లక్ష్యాలతో కూడిన విధానాలతో మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించాలి. వ్యాపారవేత్తల్లో మహిళలు 14 శాతమే ఉన్నారు. వారి సామర్థ్యాన్ని గుర్తించి విలువైన మహిళా వ్యాపారవేత్తలను వెలుగులోకి తీసుకురావడానికి ఇది భారత్‌కు అపార అవకాశం. దేశవ్యాప్తంగా ఉన్న 6.3 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల్లో మహిళల వాటా 6 శాతమే. దీనినిబట్టి ప్రతిభను సద్వినియోగం చేసుకోకపోవడం తీవ్రమైన నేరం. సంబంధాల పెంపు, హావభావాల తెలివి, విభిన్న పనులను చేయగలిగే సామర్థ్యం వంటి వ్యాపారానికి అవసరమైన నైపుణ్యాలు మహిళల స్వభావం' అని వాధ్వాని ఫౌండేషన్‌ ప్రెసిడెంట్, సీఈవో అజయ్‌ కేల తెలిపారు.

# హెల్త్‌టెక్‌ స్టార్టప్స్‌కు మైక్రోసాఫ్ట్‌ దన్ను




**న్యూఢిల్లీ:** టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌ తాజాగా హెల్త్‌టెక్‌ స్టార్టప్స్‌కు దన్నుగా నిలిచింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్టార్టప్స్‌ వ్యాపారాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లడంతోపాటు మార్కెట్‌ మద్దతు కల్పిస్తారు. ఇందుకోసం స్టార్టప్‌ ఇంక్యుబేటర్‌ సోషల్‌ ఆల్ఫాతో మైక్రోసాఫ్ట్‌ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆరోగ్య, వ్యాపార సవాళ్లను పరిష్కరించేందుకు సాంకేతిక మద్దతు ఇస్తారు. ఉత్తమ ఫలితాల కోసం స్టార్టప్స్‌తో కలిసి విక్రయాలతోపాటు టెక్‌ టూల్స్‌ను అభివృద్ధి చేస్తామని మైక్రోసాఫ్ట్‌ ఇండియా స్టార్టప్‌ ఎకోసిస్టమ్‌ డైరెక్టర్‌ సంగీత బవి తెలిపారు. సోషల్‌ ఆల్ఫా ఇప్పటికే 20కిపైగా హెల్త్‌టెక్‌ స్టార్టప్స్‌కు సాయం చేసింది.

# కోవిడ్‌–19 నిర్ధారణకు టాటా ఎండీ 'చెక్‌'



**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** కోవిడ్‌–19 నిర్ధారణ పరీక్షలకై టాటా మెడికల్‌ అండ్‌ డయాగ్నొస్టిక్స్‌ 'చెక్‌' పేరుతో రూపొందించిన టెస్ట్‌ కిట్‌ను తొలిసారిగా భారత్‌లో అపోలో హాస్పిటల్స్‌ వినియోగించనుంది. ఫెలూదా డయాగ్నొస్టిక్‌ టెక్నాలజీపై ప్రపంచంలో మొదటిసారిగా కోవిడ్‌–19 పరీక్షలకై డీఎన్‌ఏ జీనోమ్‌ ఎడిటింగ్‌ టూల్‌ క్రిస్పర్‌ కాస్‌–9తో ఈ కిట్‌ రూపుదిద్దుకుంది. ఫెలూదాను కౌన్సిల్‌ ఆఫ్‌ సైంటిఫిక్‌ అండ్‌ ఇండస్ట్రియల్‌ రిసెర్చ్‌కు (సీఎస్‌ఐఆర్‌) చెందిన ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ జీనోమిక్స్, ఇంటిగ్రేటివ్‌ బయాలజీ అభివృద్ధి చేసింది. చెక్‌ టెస్ట్‌ ద్వారా అధిక కచ్చితత్వంతోపాటు పరీక్ష ఫలితాలు వేగంగా తెలుసుకోవచ్చు.

# బెట్టింగ్‌ను చట్టబద్ధం చేయాలి

**కేంద్ర మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ వ్యాఖ్య**



**న్యూఢిల్లీ:** బెట్టింగ్‌ను చట్టబద్ధం చేయడం ద్వారా మ్యాచ్‌ ఫిక్సింగ్‌ వంటి అనుచిత విధానాలను అరికట్టవచ్చని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ అభిప్రాయపడ్డారు. దీనివల్ల ప్రభుత్వానికి పన్నుపరమైన ఆదాయాలు కూడా లభించవచ్చన్నారు. గురువారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా బెట్టింగ్‌ను చట్టబద్ధం చేయాలంటూ ప్రధాని ఆర్థిక సలహా మండలి (ఈఏసీపీఎం) పార్ట్‌టైమ్‌ సభ్యుడు నీలేష్‌ షా చేసిన వ్యాఖ్యలపై ఠాకూర్‌ ఈ మేరకు స్పందించారు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ వంటి దేశాలు దీన్ని చట్టబద్ధం చేసిన సంగతిని ఆయన ప్రస్తావించారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని, దీన్ని క్రీడలు లేదా ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించవచ్చని మంత్రి చెప్పారు. బెట్టింగ్‌ అన్నది వ్యవస్థాత్మకమైనదని, మ్యాచ్‌ ఫిక్సింగ్‌కు పాల్పడే వారిని గుర్తించేందుకు దీన్ని ఉపయోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

# లగ్జరీ ఉత్పత్తులపై కరోనా ఎఫెక్ట్‌

**అమ్మకాలు 23 శాతం తగ్గే చాన్స్‌ • అంచనా వేస్తున్న బెయిన్‌ కన్సల్టెన్సీ**



**మిలన్‌:** లగ్జరీ ఉత్పత్తుల అమ్మకాలపై ప్రపంచవ్యాప్తంగా కోవిడ్‌–19 తీవ్ర ప్రభావం చూపిస్తోంది. విలాసవంతమైన దుస్తులు, ఆభరణాలు, సౌందర్య సాధనాల విక్రయాలు ఈ ఏడాది 23 శాతం తగ్గుతాయని కన్సల్టెన్సీ సంస్థ బెయిన్‌ వెల్లడించింది. ఆరేళ్ల వృద్ధిని కరోనా మహమ్మారి తుడిచిపెట్టడమే ఇందుకు కారణమని తెలిపింది. ఈ తగ్గుదల 35 శాతం ఉండొచ్చని గతంలో అంచనా వేశారు. మూడింట ఒక వంతు సేల్స్‌ ఉండే చైనా మార్కెట్‌ రికవరీ ఈ అంచనాల సవరణకు కారణమని బెయిన్‌ వివరించింది. 2020లో లగ్జరీ ఉత్పత్తుల మార్కెట్‌ రూ.19 లక్షల కోట్లు (217 బిలియన్‌ యూరోలు) దాటనుంది. గతేడాదితో పోలిస్తే ఇది 64 బిలియన్‌ యూరోలు తక్కువ. ఈ తగ్గుదల 2009 ఆర్థిక సంక్షోభం తర్వాత ఇదే తొలిసారి. ఆ ఏడాది పరిశ్రమ 9 శాతం తిరోగమనం చెందినప్పటికీ, తర్వాతి సంవత్సరంలో పుంజుకుంది.

**రెండు మూడేళ్లలో రికవరీ..**

లగ్జరీ ఉత్పత్తుల విపణి ఎప్పుడు సాధారణ స్థితికి వస్తుందో చెప్పలేమని బెయిన్‌ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా వైరస్‌ తిరిగి పుంజుకుంటున్నందున అత్యవసరం కాని వ్యాపారాలు, ప్రయాణాలను నిలిపివేసే అవకాశం ఉంది. వ్యాక్సిన్‌ రాకపై రికవరీ ఆధారపడి ఉంటుందని బెయిన్‌ పార్ట్‌నర్‌ క్లాడియా దర్పిజో తెలిపారు. '2021లో వృద్ధి తగ్గుదల 10–19 శాతం ఉండే అవకాశం ఉంది. బ్రాండ్స్‌ లాభాలు ఈ ఏడాది 60 శాతం తగ్గనున్నాయి. ఇందులో సగం రికవరీ వచ్చే ఏడాది ఉండే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా పూర్తి రికవరీ 2022–23లో అయ్యే చాన్స్‌ ఉంది. చైనా కస్టమర్లు చేసే వ్యయం, యూఎస్, యూరప్‌లో ఉద్దీపన చర్యలతోపాటు యూఎస్‌ కొత్త అధ్యక్షుడు ప్రకటించబోయే నూతన పన్ను విధానాలు ప్రభావితం చేయనున్నాయి' అని క్లాడియా వెల్లడించారు. సంక్షోభం చాలా కాలం కొనసాగితే కొన్ని బ్రాండ్లు మూతపడతాయని, మరికొన్ని వ్యాపార విధానాన్ని పునర్నిర్మించుకుంటాయని తెలిపారు.

## గిరిజనులకు అందుబాటులో

# మల్టీ స్పెషాలిటీ వైద్యం

**అడవి పుత్రుల ఆరోగ్యానికి వైఎస్‌ జగన్‌ ప్రభుత్వ భరోసా**

- ఐదుచోట్ల వైద్యశాలల నిర్మాణానికి రూ.482 కోట్లు విడుదల
- భవనాలకు ఇటీవల ముఖ్యమంత్రి శంకుస్థాపన
- ఇప్పటికే అందుబాటులో స్పెషలిస్ట్‌ వైద్యులు, సిబ్బంది
- 20 పీహెచ్‌సీలు, 159 సబ్‌ సెంటర్లు, 312 అంబులెన్సులతో సేవలు
- రూ. 500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం

సాక్షి, అమరావతి

గిరిజనులకు అందుబాటులో ఉండేవిధంగా వైద్య సౌకర్యాల కల్పనకు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. సాధారణ వైద్య సేవలతో పాటు స్పెషలిస్ట్‌ వైద్యులను ఏజెన్సీ ప్రాంతాల్లో నియమించి గిరిజనులకు ఖరీదైన వైద్యాన్ని సైతం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. తద్వారా గిరిజనులకు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. అందుకు అవసరమైన వైద్యశాలలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. శ్రీకాకుళం జిల్లా సీతంపేట, విజయనగరం జిల్లా పార్వతీపురం, తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం, పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయగూడెం, ప్రకాశం జిల్లా దోర్నాల మండల కేంద్రాల్లో ఈ మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలు ఏర్పాటు చేశారు. రూ.482 కోట్లతో నిర్మించే ఈ భవనాలకు ఇటీవల ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**ఇప్పటికే 20 పీహెచ్‌సీలు, 159 సబ్‌ సెంటర్లు**

ఇప్పటికే 82 గిరిజన గ్రామాల పరిధిలో 20 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, 159 సబ్‌ సెంటర్లు ఉన్నాయి. వైద్యశాలల్లో అన్ని రకాల వైద్యం అందుతుండగా, సబ్‌ సెంటర్లలో ఎమర్జెన్సీ వైద్య సేవలు అందుతాయి. వీటిల్లో ఇప్పటికే 318 మంది వైద్యాధికారులు, 41 మంది స్పెషలిస్ట్‌ వైద్యులు ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యులు గిరిజన గ్రామాల్లో ఉద్యోగం చేసేందుకు ఇష్టపడకపోయినా ఎక్కువ జీతం ఇచ్చి వైద్యులను వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంకా పారా మెడికల్‌ సిబ్బంది 2,606 మంది, కమ్యూనిటీ హెల్త్‌ వర్కర్లు 2,652 మంది కూడా పనిచేస్తున్నారు. 822 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ సెంటర్లలో కూడా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్‌ వర్కర్లు వైద్య సేవలు అందిస్తారు. ఇక ఏజెన్సీ ఏరియాలో 108 అంబులెన్స్‌లు 80, 104 అంబులెన్స్‌లు 82, 102 అంబులెన్స్‌లు 28, ఫీడర్‌ (మోటార్‌ బైక్‌) అంబులెన్స్‌లు 122 సేవలందిస్తున్నాయి.

**వైద్య విద్య కూడా..**

ముఖ్యమంత్రి జగన్‌ వైద్య విద్య సైతం గిరిజనులకు చేరువలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. విశాఖపట్నం జిల్లా పాడేరులో రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణానికి అక్టోబర్‌ 2న శంకుస్థాపన చేశారు. వైద్య ఆరోగ్య ఇంజనీరింగ్‌ విభాగం టెండర్లు పిలిచి పనులు చేపట్టనుంది. 35.01 ఎకరాల విస్తీర్ణంలో వైద్య కళాశాల నిర్మిస్తారు.




# 'నెట్టింట' 75 కోట్ల మంది

- నాలుగేళ్లలోనే ఇంటర్నెట్‌ యూజర్లు రెట్టింపు
- మొదటి స్థానంలో మహారాష్ట్ర

**సాక్షి, అమరావతి:** దేశంలో ఇంటర్నెట్‌ వినియోగం రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఇంటర్నెట్‌ యూజర్లలో భారతదేశం సరికొత్త మైలురాయిని అందుకుంది. దేశంలో ఇంటర్నెట్‌ యూజర్ల సంఖ్య 75 కోట్లకు చేరింది. ఇంటర్నెట్‌ యూజర్లలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా, తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా దేశంలో రెండో స్థానంలో నిలిచాయి. 1995 ఆగస్టు 15న తొలిసారిగా దేశంలో ఇంటర్నెట్‌ సేవలు ప్రారంభం అయ్యాయి. ఈ 25 ఏళ్లలో దేశ జనాభాలో సగం కంటే ఎక్కువ మందికి ఇంటర్నెట్‌ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత నాలుగేళ్లలోనే దేశంలో ఇంటర్నెట్‌ యూజర్ల సంఖ్య రెట్టింపు కావడం విశేషం. టెలిఫోన్‌ రెగ్యులేటరీ అథారిటీ(ట్రాయ్‌) తాజా నివేదిక ప్రకారం దేశంలో ఇంటర్నెట్‌ యూజర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

- 2016లో ఇంటర్నెట్‌ యూజర్ల సంఖ్య 34 కోట్లు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 75 కోట్లకు చేరింది. నాలుగేళ్లలోనే వారి సంఖ్య రెట్టింపు అయ్యింది. స్మార్ట్‌ ఫోన్ల విప్లవమే దీనికి ప్రధాన కారణం.
- దేశంలో సగటున ప్రతి నెల కొత్తగా 86 లక్షల మందికి ఇంటర్నెట్‌ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. మొత్తం ఇంటర్నెట్‌ కనెక్షన్లలో 61 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 39 శాతం ఉన్నాయి. మొత్తం 75 కోట్ల ఇంటర్నెట్‌ కనెక్షన్లలో 72.60 కోట్లు వైర్‌లెస్‌ కనెక్షన్లు. వైర్డ్‌ కనెక్షన్లు 2.40 కోట్లు మాత్రమే ఉన్నాయి.
- ఇంటర్నెట్‌ కనెక్షన్లలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌–తెలంగాణ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌), కర్ణాటక, తమిళనాడు, గుజరాత్‌ అగ్రస్థానంలో ఉన్నాయి. దేశంలోని మొత్తం ఇంటర్నెట్‌ కనెక్షన్లలో 35 శాతం అంటే 26 కోట్ల కనెక్షన్లు ఈ రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం.
- రాష్ట్రాల వారీగా చూస్తే 6.40 కోట్ల కనెక్షన్లతో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌(ఏపీ–తెలంగాణ) 5.90 కోట్ల కనెక్షన్లతో రెండో స్థానంలో ఉంది. తమిళనాడులో 5.10 కోట్లు, గుజరాత్‌లో 4.50 కోట్లు, కర్ణాటకలో 4.60 కోట్ల కనెక్షన్లు ఉన్నాయి.



## కోవిడ్‌ ప్రభావంతో మరిన్ని కనెక్షన్లు

- కోవిడ్‌ మహమ్మారి, తదనంతర పరిణామాలతో దేశంలో ఇంటర్నెట్‌ యూజర్ల సంఖ్య మరింతగా పెరుగుతోందని టెలికాం రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా విద్య, వైద్య సేవలు, ఆర్థిక వ్యవహారాలు ఆన్‌లైన్‌ బాట పట్టాయి.
- చిన్న వ్యాపారస్తులు కూడా ఆన్‌లైన్‌ ద్వారా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ట్రాయ్‌ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో మునుముందు ఇంటర్నెట్‌ కనెక్షన్లు 100 కోట్ల మార్క్‌ చేరుకుంటుందని అంచనా.



# 'ఒంటరి' చేస్తున్న ఇంటర్‌నెట్‌

- ఇంటర్నెట్‌ ఎక్కువ వాడే విద్యార్థుల్లో ఒత్తిడి
- చదువుపై ఆసక్తి, నేర్చుకునే సామర్థ్యం తగ్గుతున్నాయి
- సామాజిక సంబంధాల్లేక ఒంటరివారమనే భావన
- స్వాన్‌సీ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి

**సాక్షి, అమరావతి:** ఇంటర్నెట్‌ను ఎక్కువగా వినియోగించే విద్యార్థులు చదువుపై తక్కువ దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తేలింది. డిజిటల్‌ టెక్నాలజీ ప్రభావం వల్ల చదువు పట్ల వారికి ఆసక్తి కూడా తగ్గిపోతున్నట్లు గుర్తించారు. దీంతో పరీక్షల సమయంలో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. బ్రిటన్‌ (యూకే)లోని స్వాన్‌సీ యూనివర్సిటీ మన దేశంతోపాటు పలు దేశాలకు చెందిన 285 యూనివర్సిటీ, కళాశాలల విద్యార్థులను ఆన్‌లైన్‌లో చేసిన సర్వేలో ఈ విషయాలు స్పష్టమయ్యాయి. చదువుపై ఆసక్తితోపాటు చదివే నైపుణ్యం, నేర్చుకునే సామర్థ్యం కూడా తగ్గిపోతున్నాయని తేలింది. ఈ అధ్యయనంలో తేలిన విషయాలు..

- డిజిటల్‌ టెక్నాలజీపైనే ఎక్కువగా ఉండడం వల్ల తాము ఒంటరిగా ఉన్నామనే భావన పెరుగుతోంది. దీంతో చదవడానికి ఇబ్బందిపడుతున్నారు. తద్వారా పరీక్షల సమయంలో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.
- 25 శాతం మంది విద్యార్థులు రోజూ నాలుగు గంటలు ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. దీంతో వారికి చదువుకునేందుకు ఎక్కువ సమయం దొరకడంలేదు. స్నేహితులు, కుటుంబసభ్యులు ఇతరులతో మాట్లాడేందుకు అవకాశం రావడంలేదు.
- ఇంటర్నెట్‌ ఎక్కువవాడే వారిలో సోషల్‌ నెట్‌వర్కింగ్‌కు 40 శాతం వినియోగిస్తున్నారు. 30 శాతం సమాచారం తెలుసుకోవడం, పంచుకోవడానికి ఉపయోగిస్తున్నారు. ఇవి వారికి చదువులో ఏమాత్రం ఉపయోగపడడంలేదు. పైగా అనవసరమైన అంశాలపైకి దృష్టి మళ్లుతోంది.
- సామాజిక సంబంధాల గురించి అవగాహన లేకపోవడంతో ఒంటరితనం భావన పెరిగి పాజిటివ్‌ ఫీలింగ్‌ రాకుండా చేస్తోంది.
- స్నేహితులు, పక్కవారితో మాట్లాడడం వల్ల సామాజిక సంబంధాలు మెరుగుపడి కొత్త అంశాలు తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ఇప్పుడు అవి తగ్గిపోవడం ప్రమాదకరంగా మారిందని అధ్యయనంలో పాల్గొన్న నిపుణులు తేల్చారు.



- ఈ నేపథ్యంలో పిల్లలు ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయాన్ని గడపడానికి తల్లిదండ్రులు అంగీకరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు.